www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 6-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 279 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 6.24 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 7.06 తదుపరి రేవతి; వర్జ్యం: శేషం ఉ.6.56, తె.6.28; దుర్ముహూర్తం: మ.12.43-1.27, మ.2.55-3.39; అమృతఘడియలు: మ.2.32-4.04; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.51

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మద్యంతో క్యాన్సర్ ముప్పు!

- ఆల్కహాల్ ఉత్పత్తులపై హెచ్చరికలు ఉండాలి
- కొన్ని రకాల వంట నూనెలతోనూ ప్రమాదం
- అమెరికా సర్జన్ జనరల్ వివేక్ మూర్తి హెచ్చరిక

2

పెళ్లికాని జంటలకు రూం ఇవ్వం!



- హోటళ్లలో గది కావాలంటే పెళ్లయినట్లు ధ్రువీకరణ పత్రాలు చూపాల్సిందే
- ఓయో సంస్థ కీలక నిర్ణయం
- తొలుత మేరఠ్‌లో అమలు
- ఆ తర్వాత దేశవ్యాప్తంగా..

2

సౌర భారం!

- దేశంలో పెరుగుతున్న సౌరవిద్యుత్తు వినియోగంతో
- పేరుకుపోతున్న సోలార్ సెల్స్, మాడ్యూళ్ల వ్యర్థాలు
- వాటిలోని కాడ్మియం, టెల్యూరియం భూమిలోకి..
- పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికీ పెను ప్రమాదం
- దేశంలో రెండేళ్ల కిందటే లక్ష టన్నుల సోలార్ వేస్ట్
- జాగ్రత్త పడకపోతే ప్రమాదం.. నిపుణుల హెచ్చరిక



మృత్యుసముద్రంగా పేరొందిన కబుకీ ఎడారిలో.. 400 కిలోమీటర్ల పొడుగున.. 5 కిలోమీటర్ల వెడల్పున సోలార్ గ్రేట్‌వాల్‌ను నిర్మిస్తోంది చైనా! దాని ద్వారా 100 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది డ్రాగన్ దేశం లక్ష్యం. తెలుగు రాష్ట్రాలు కూడా సౌర విద్యుత్తుకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి!! సౌర విద్యుత్తు పర్యావరణ హితం అని భావించడమే ఇందుకు కారణం. ఆ మాట కొంతవరకూ నిజమేగానీ, కాలం చెల్లిన సౌర ఫలకాల వల్ల పర్యావరణానికి ముప్పు పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సౌర విద్యుత్తు అనగానే మనకు గుర్తొచ్చేది.. ఇంటి పైభాగంలో అమర్చే ఆ నల్లటి సౌరఫలకాలే (ఫొటోవోల్టాయిక్ సెల్స్). అన్ని వస్తువుల్లాగానే వాటికి కూడా ఎక్స్‌పైరీ తేదీ ఉంటుంది. అమర్చిన 20-25 ఏళ్లకు వాటికి కాలం చెల్లిపోతుంది. అలా 2030 నాటికి మనదేశంలో 3.4 లక్షల టన్నుల సౌర వ్యర్థాలు

మిగతా 2వ పేజీలో...

పదేళ్లలో రాష్ట్రంలో పెట్టుబడులు..
రూ.1.98 లక్షల కోట్లు

- 1.14 లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- 2035 కల్లా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 49,500 మెగావాట్లకు పెంచడమే లక్ష్యం
- పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భారీ ప్రోత్సాహకాలు
- భూములకు నాలా కన్వర్షన్ నుంచి మినహాయింపు
- యంత్రాలపై 50-100% ఎస్‌జీఎస్టీ రీయింబర్స్‌మెంట్
- 10 శాతం నామమాత్రపు అద్దెతో లీజుకు సర్కారు స్థలాలు
- పునరుత్పాదక ఇంధన విధానం-2025కు క్యాబినెట్ ఓకే

3



ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల ముగింపు ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి, సినీనటులు జయప్రద, జయసుధ, మురళీమోహన్, సాయికుమార్, నిర్మాత అశ్వనీదత్, ఎమ్మెల్యే వివేక్

ఏపీ, తెలంగాణ కలిసి ప్రపంచంతో

పోటీ పడాలి

మార్చిలోగా గ్రూప్-1 నియామకాలు

- జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు
- రాష్ట్రం నుంచి సివిల్స్‌కు అధికంగా ఎంపిక కావాలి
- సీఎం రేవంత్‌రెడ్డి
- సివిల్స్ అభ్యర్థులకు చెక్కుల పంపిణీ
- ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి ఢిల్లీలో బస: భట్టి

13

- సమస్యలుంటే చర్చించుకుని పరిష్కరించుకుందాం
- ఐటీ, ఫార్మాల్లో అత్యున్నత స్థాయిలో తెలుగువారు
- హాలీవుడ్‌తో పోటీ పడుతున్న తెలుగు సినిమా రంగం
- గతంలో జాతీయ రాజకీయాల్లో కీలకంగా తెలుగునేతలు
- ప్రస్తుతం అటువంటి ప్రభావం చూపలేకపోతున్నాం
- సైబరాబాద్‌తో ఐటీని చంద్రబాబు అభివృద్ధి చేస్తే..
- దానిని వైఎస్ఆర్ మరింత ముందుకు తీసుకెళ్లారు
- ప్రపంచంలోని తెలుగువారు పెట్టుబడులు పెట్టండి
- సింగిల్ విండోలో అనుమతులిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రపంచ తెలుగు సమాఖ్య ముగింపు సభలకు హాజరు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు పోటీ అని చాలామంది అంటుంటారని, కానీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలిసి ప్రపంచ దేశాలతో పోటీపడేలా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆ దిశగా ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ, తెలంగాణ పోటీ పడే కన్నా.. రెండు రాష్ట్రాలు కలిసి అభివృద్ధి పథం వైపు నడిస్తే కచ్చితంగా ప్రపంచంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రాలుగా రాణిస్తాయని

మిగతా 13వ పేజీలో...

13

ఏడాది పాలనపై సమీక్ష!

- సీఎం, మంత్రుల పనితీరు, స్థానిక ఎన్నికలపై చర్చ
- 8న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ
- పాల్గొననున్న రేవంత్, మహేశ్, కేసీ వేణుగోపాల్

ఓల్డ్‌సిటీ మెట్రోకు మద్దతు!

- ఆస్తులు ఇచ్చేందుకు నిర్వాసితుల సుముఖత
- వారికి నేడు చెక్కుల పంపిణీ

దేశ రాజకీయాల్లో నన్ను వెలిగించింది తెలుగే: వెంకయ్య

లక్ష మంది కూర్చునే
స్టేడియం



రాష్ట్రంలో నిర్మించే యోచన

- వంద ఎకరాల్లో వివిధ ఆటలకు మైదానాలు.. క్రీడాభివృద్ధికి విధాన రూపకల్పన
- క్రీడాకారులకు సౌకర్యాలు.. ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 15, 16 తేదీల్లో సీఎం ఆస్ట్రేలియా పర్యటన.. 18న సింగపూర్.. 20-24 తేదీల్లో దావోస్

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): "దేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా.. ఒలింపిక్స్ పతకాల్లో వెనకబడ్డాం".. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్య ఇది. ఈ నేపథ్యంలో క్రీడారంగానికి ఊతమిస్తూ.. తెలంగాణను క్రీడలకు కేరాఫ్‌గా మార్చాలని ఆయన నిర్ణయించారు. ఈ క్రమంలో ఫ్యూచర్‌సిటీ లేదా మరో చోట వంద ఎకరాల్లో వివిధ క్రీడలకు అనుకూలమైన మైదానాలను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఏకకాలంలో లక్ష మంది కూర్చొనేలా భారీ స్టేడియాన్ని నిర్మించాలని కృత నిశ్చయంతో ఉన్నట్లు సమాచారం. ఆ స్టేడియంలో ఆధునిక సాంకేతికత ఉండేలా చర్యలు తీసుకుంటారు. అంతేకాదు.. క్రీడాభివృద్ధికి ప్రత్యేక పాలసీ, క్రీడాకారులకు సౌకర్యాల కల్పనపైనా దృష్టి సారించనున్నారు. ఇప్పటికే స్పోర్ట్స్ హబ్ కోసం ఫ్యూచర్‌సిటీలో 760 ఎకరాలను కేటాయించిన విషయం తెలిసిందే..! ప్రస్తుతం గుజరాత్‌లో ఏకకాలంలో 1.32 లక్షల మంది కూర్చునే వీలున్న భారీ స్టేడియం ఉంది. అదే స్థాయిలో.. లక్ష మంది ప్రేక్షకుల సామర్థ్యంతో తెలంగాణలో వంద ఎకరాల్లో అతిపెద్ద స్టేడియాన్ని నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతను ఈ స్టేడియంలో అందుబాటులో తీసుకురావాలని ఆయన ఆలోచన చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇలాంటి స్టేడియం అందుబాటులోకి వస్తే.. క్రికెట్ లాంటి క్రీడలకు తెలంగాణ కేరాఫ్‌గా మారుతుందని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. క్రీడామైదానాల ఏర్పాటుతోపాటు.. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, మౌలిక వసతుల కల్పనకు సీఎం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన ఈ నెల 15, 16 తేదీల్లో ఆస్ట్రేలియా, 18న సింగపూర్‌లో

మిగతా 13వ పేజీలో...

ప్రభుత్వ అంబులెన్స్‌లు మన వద్ద మరీ తక్కువ!

- దేశంలోనే 20వ స్థానంలో తెలంగాణ
- అందుబాటులో 456 వాహనాలు మాత్రమే
- 7,499 అంబులెన్స్‌లతో మహారాష్ట్ర ఫస్ట్
- కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ నివేదిక

11

ఫార్ములా-ఈ కేసులో.. నేడు ఏసీబీ
విచారణకు కేటీఆర్!

రేపు విచారణకు రావాల్సిందిగా ఈడీ సమన్లు



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోమవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించనుంది. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలంటూ ఏసీబీ అధికారులు ఇప్పటికే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. న్యాయ నిపుణుల సూచన మేరకు ఈ కేసులో విచారణకు హాజరవుతానని కేటీఆర్ కూడా శనివారం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో తెలిపారు. మరోవైపు తనపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. తీర్పు ప్రకటించే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని పేర్కొంది. అయితే విచారణ కొనసాగించవచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌ను

మిగతా 3వ పేజీలో...

నమ్మక ద్రోహం కాంగ్రెస్ నైజం

- రైతులను దగా చేసిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాయాలి
- మాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా?
- కేటీఆర్ విమర్శలు.. నేడు రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నిరసన

3



ఒక్క రోజు వేతనం.. 48 కోట్లు!

- ప్రపంచంలోనే అత్యధిక జీతం పొందుతున్న వ్యక్తిగా క్వాంటమ్‌స్కేప్ సీఈవో జగ్‌దీప్ సింగ్ రికార్డు
- ఆయన వార్షిక ఆదాయం రూ.17,500 కోట్లు
- ఈవీ బ్యాటరీల తయారీలో అగ్రగామిగా క్వాంటమ్‌స్కేప్

న్యూఢిల్లీ, జనవరి 5: రూ.48 కోట్లు. ఇది ఒక కంపెనీ నెలవారీ టర్నోవర్ కాదు. ఒక వ్యక్తి ఒక్క రోజులో సంపాదించే మొత్తం. ఆయన పేరు జగ్‌దీప్ సింగ్. విద్యుత్తు వాహనాల్లో వినియోగించే బ్యాటరీల తయారీ రంగంలో ఉన్న క్వాంటమ్‌స్కేప్ సీఈవో ఇతను. ప్రపంచంలోనే అత్యధిక వేతనం పొందుతున్న వ్యక్తిగా జగ్‌దీప్ సింగ్ రికార్డు సృష్టించారు. ఆయన వేతనం రోజుకు 48 కోట్ల రూపాయలు. ఏడాదికి రూ.17,500 కోట్లు. ఇది చాలా పెద్ద సంస్థల వార్షిక ఆదాయం కంటే అధికం. 2010లో అమెరికాలో

మిగతా 2వ పేజీలో...

పానీ పూరీ పవర్!

- ఏడాదిలో రూ.40 లక్షలకు పైగా డిజిటల్ లావాదేవీలు నమోదు చేసిన ఓ పానీపూరీ వ్యాపారి
- జీఎస్టీ నోటీసులు జారీ.. తమిళనాడులో ఘటన
- సోషల్ మీడియాలో వైరల్.. మీమ్స్, జోకులు
- రూ.40 లక్షల పరిమితి దాటితే జీఎస్టీ వర్తింపు



న్యూఢిల్లీ, జనవరి 5: పానీ పూరీ.. మన దేశంలో ప్రసిద్ధమైన ఒక స్ట్రీట్ ఫుడ్! సాయంత్రం అయిందంటే చాలు చిన్న పట్టణాల నుంచి నగరాల వరకూ వీధుల్లో, రోడ్ల పక్కన పానీ పూరీ విక్రయించే బండ్ల ముందు చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు బారులు తీరుతుంటారు. లొట్టలు వేసుకుంటూ.. పానీ పూరీలను లాగించేస్తారు. ఈ వ్యాపారంలో అధిక సంఖ్యలోనే లావాదేవీలు ఉంటాయి. అది ఎంతలా అంటే.. తమిళనాడుకు చెందిన ఒక పానీపూరీ వ్యాపారికి జీఎస్టీ విభాగం నుంచి నోటీసులు వచ్చేంత! 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఫోన్‌పే, రేజర్‌పేల ద్వారా రూ.40 లక్షలకు పైగా నగదు చెల్లింపులు జరిగాయని.. సదరు వ్యాపారి జీఎస్టీ కింద నమోదు చేసుకోలేదని నోటీసులు జారీచేసింది. ఇది కాస్తా సోషల్

మిగతా 2వ పేజీలో...

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం



'బరి తెగింపు' భవనం కూల్చివేత

- అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణంపై హైడ్రా కొరడా
- నేలమట్టం చేసే పని ప్రారంభించిన యంత్రాంగం
- 7 అంతస్తుల భవనం.. జీహెచ్ఎంసీ నిబంధనలు బేఖాతరు
- స్థానికుల ఫిర్యాదుతో అక్రమమని నిర్ధారించి హైడ్రా చర్యలు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని వంద అడుగుల రోడ్డులో పాలమూరు గ్రిల్స్ పక్కన చేపట్టిన అక్రమ నిర్మాణంపై హైడ్రా కొరడా ఝుళిపించింది. ఎటువంటి అనుమతుల్లేకుండా ఏడు అంతస్తులుగా నిర్మిస్తున్న భవనాన్ని కూల్చివేస్తోంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ఈ భవనాన్ని పరిశీలించి

మిగతా 14వ పేజీలో...

సీఎంఆర్ బాలికల హాస్టల్ ఘటనలో
ఇద్దరి అరెస్టు

- హాస్టల్‌లోని వంట మనుషులే నిందితులు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఇద్దరు వార్డెన్లపైనా కేసు

3

శ్రీతేజ్‌కు పరామర్శపై
పునరాలోచించండి

- హీరో అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసు
- ఆస్పత్రిలో పేషెంట్లకు ఇబ్బంది అని వెల్లడి
- చిక్కడపల్లి ఠాణాలో అల్లు అర్జున్ సంతకం
- విస్తృత బందోబస్తుతో స్థానికులకు ఇబ్బంది

14

ఢిల్లీ రోడ్లను ప్రియాంక బుగ్గల్లా మారుస్తా

- బీజేపీ నేత బిధూరి వ్యాఖ్యలు.. కాంగ్రెస్ ఫైర్
- పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి
- విమర్శలు రావడంతో మాటలను వెనక్కి తీసుకుంటున్నట్టు బిధూరి ప్రకటన

2



నేడు చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రత్యక్ష వీక్షణకు ఏర్పాట్లు

11

రైతు భరోసా.. బోగస్


- స్థానిక ఎన్నికల తర్వాత ఇదీ ఇవ్వరు
- రాష్ట్రంలో 14 శాతం కమీషన్ ప్రభుత్వం
- ఇద్దరు, ముగ్గురు మంత్రులకైతే అదే పని
- మోసాల్లో కాంగ్రెస్‌కు గురువు కేసీఆరే
- కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు

14

పానీ పూరీ పవర్!

(మొదటి పేజీ తరువాయి)

మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు మీమ్స్, జోక్స్ పేలుస్తున్నారు. ఉద్యోగాలు చేసే వారి కంటే పానీపూరీ వ్యాపారం ఆదాయమే బెటర్ అని కామెంట్లు పెడుతున్నారు. ఎగుమతి అవకాశాలు, విదేశీ సహకారం కూడా అవసరం అవుతాయేమోనని హాస్యాస్పదంగా స్పందిస్తున్నారు. పానీ పూరీ అమ్మకందారులు వ్యాపార దిగ్గజాలుగా మారే అవకాశం ఉందంటూ మరికొందరు పోస్టులు చేస్తున్నారు. పన్ను వ్యవస్థ నుంచి తప్పించుకునేందుకు బహుశ క్యూఆర్ కోడ్‌లు ఉపయోగించడం లేదా కెరీర్‌ను మార్చుకోవడమో చేయాలేమో.. అంటూ చమత్కరిస్తున్నారు. తాజా ఒక్క ఘటనే కాదు.. ఇటీవలి కాలంలో ఆసక్తికరంగా దేశవ్యాప్తంగా పలువురు పానీపూరీ వ్యాపారులకు జీఎస్టీ నోటీసులు వస్తున్నాయి. డిజిటల్ చెల్లింపులు భారీగా ఉండటమే ఇందుకు కారణం. ఒకప్పుడు నగదు రూపంలో తీసుకునే వీళ్లంతా.. ఇప్పుడు మారిన డిజిటల్ యుగంలో ఫోన్‌పే, రేజర్, యూపీఐ వంటి వేదికలను వాడుతున్నారు. దీంతో వీరంతా ఇప్పుడు పన్ను యంత్రాంగం దృష్టిలో పడుతున్నారు. డిజిటల్ పేమెంట్లను అధికంగా స్వీకరిస్తున్న నేపథ్యంలో.. ఇది వీధి వ్యాపారులను కూడా నెమ్మదిగా పన్ను వ్యవస్థ పరిధిలోకి తెచ్చేలా చేస్తోంది. ఇది భారత అసంఘటిత వ్యాపార రంగం భవిష్యత్తుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది.



డిజిటల్ చెల్లింపుల పెరుగుదల.. జీఎస్టీ వర్తింపు

సంప్రదాయంగా పానీ పూరీ విక్రేతలు అసంఘటిత వ్యాపార రంగంలో ఉంటారు. వీరికి పన్నులు ఉండవు. అయితే డిజిటల్ పేమెంట్లు విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో చిన్న వ్యాపారాల్లో కూడా లక్షల రూపాయల మేర లావాదేవీలు జరుగుతున్నాయి. రూ.40 లక్షల రెవెన్యూ పరిమితిని దాటేస్తున్నాయి. ఇది జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేస్తోంది. ఇదే వ్యాపారులకు జీఎస్టీ నోటీసులు వెళ్తున్న దాని వెనుక ముఖ్య కారణం. భారత్‌లో ప్రస్తుతం వీధి వ్యాపారుల వార్షిక టర్నోవర్ రూ.40 లక్షలు దాటనంత వరకు వారికి సాధారణంగా జీఎస్టీ పరిధి నుంచి మినహాయింపు ఉంటుంది. చిన్న స్థాయిలో లేదా పరిమితంగా డిజిటల్ చెల్లింపులను తీసుకునే వ్యాపారులకు పెద్దగా ఇబ్బందేమీ ఉండదు. లావాదేవీలు రూ.40 లక్షలు దాటినా లేదా ఆదాయ పన్ను వార్షిక పరిమితిని అధిగమించిన వ్యాపారులు తప్పనిసరిగా జీఎస్టీ, ఆదాయ పన్ను నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా డిజిటల్ చెల్లింపుల వివరాలన్నీ పన్ను అధికారుల చేతుల్లో ఉంటున్నాయి. దీంతో కొత్త పన్ను నిబంధనల గురించి అవగాహన లేని వారికి నోటీసులు వెళ్తున్నాయి.



ఒక్క రోజు వేతనం.. 48 కోట్లు!



జగ్‌దీప్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

జగ్‌దీప్ సింగ్ స్థాపించిన క్వాంటమ్‌స్కేప్... ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీలో అగ్రగామిగా ఉంది. భారత సంతతికి చెందిన ఆయన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో బీటెక్, బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. తొలినాళ్లలో హెచ్‌పీ, సన్ మైక్రోసిస్టమ్స్ వంటి సంస్థల్లో పనిచేశారు. తర్వాత పలు స్టార్టప్ కంపెనీలు స్థాపించారు. వాటిలో 1992లో నెలకొల్పిన 'ఎయిర్‌సాఫ్ట్' ఒకటి. అది వైర్‌లెస్ నెట్‌వర్క్‌ల కోసం సాఫ్ట్‌వేర్ రూపొందిచేంది. ఇక క్వాంటమ్‌స్పేస్ సంస్థ సాలిడ్-స్టేట్ బ్యాటరీల అభివృద్ధి, తయారీలో ముందుంది. ఇందులో బిల్ గేట్స్ వంటి వ్యక్తులు కూడా పెట్టుబడి పెట్టారు. ఈ బ్యాటరీలు లిథియమ్-అయాన్ బ్యాటరీల కంటే మెరుగైనవి. వేగంగా ఛార్జింగ్ అవుతాయి. భద్రత ఎక్కువ. బ్యాటరీ టెక్నాలజీలో తనదైన ముద్ర వేసిన జగదీప్ సింగ్.. ప్రపంచం దృష్టి ఆకర్షిస్తున్నారని పారిశ్రామిక దిగ్గజాలు ప్రశంసిస్తున్నారు. కళ్లు చెదిరే ఆయన వేతన ప్యాకేజీ వివరాలు వెల్లడి కావడంతో రాత్రికి రాత్రే ఆయన ఇంటర్నెట్‌లో సంచలనంగా మారారు.

బీజేపీకి ఓటేయండి..'ఆప్'దను తొలగించండి

» ఢిల్లీని అత్యుత్తమ రాజధాని నగరంగా చేస్తాం: మోదీ

న్యూఢిల్లీ, జనవరి5: పదేళ్ల విలువైన కాలాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్రంతో కొట్లాటకే దుర్వినియోగం చేసిందని, ఢిల్లీ వాసులకు అభివృద్ధిని ఆమడదూరం చేసిందని ప్రధాని మోదీ విమర్శించారు. ఢిల్లీకి పట్టిన ఆపదను తొలగించి బీజేపీకి అవకాశం ఇవ్వాలని ఆయన ఢిల్లీ వాసులకు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని రోహిణీ ప్రాంతంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఢిల్లీలో సంక్షేమ కార్యక్రమాలు ఆగబోవని ఆయన స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారుకు అవకాశం ఇస్తే ఢిల్లీని ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఢిల్లీ ప్రజలు కోవిడ్ సమయంలో ఆక్సిజన్ కోసం అల్లాడుతుంటే ఆప్ నేతలు తాము ఉండేందుకు ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ అద్దాల మేడలు(శీష్ మహల్) కట్టుకున్నారని మోదీ ఆరోపించారు.

కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్ కూలి ముగ్గురి దుర్మరణం

పోర్‌బందర్, జనవరి 5: భారత తీర రక్షణ దళం(కోస్ట్ గార్డ్)కు చెందిన ఓ హెలికాప్టర్ కూలి ముగ్గురు సిబ్బంది దుర్మరణం పాలయ్యారు. ఈ విషాదకర ఘటన గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో ఆదివారం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూవారి విధులకు వెళ్లిన అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్(ఎఎల్‌హెచ్)ధ్రువ్ తిరిగి వస్తుండగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దాంతో కోస్ట్‌గార్డ్ విమానాశ్రయంలో ల్యాండ్ చేయాలని ప్రయత్నించగా రన్‌వేకు సమీపంలో కుప్పకూలిపోయింది. ఆ వెంటనే మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు పైలెట్‌లు, ఓ క్యాబిన్ సిబ్బంది చనిపోయారు. సాంకేతిక సమస్యల కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు చెప్పారు.

అబూజ్‌మడ్‌లో నలుగురు నక్సల్స్ హతం

చర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్ మరోమారు నెత్తురోడింది. భద్రతాబలగాలు-మావోయిస్టులకు మధ్య శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన ఎదురుకాల్పుల్లో.. ఇద్దరు మహిళలు సహా నలుగురు నక్సల్స్, డీఆర్జీకి చెందిన ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందారు. నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్‌కుమార్ కథనం ప్రకారం.. దక్షిణ అబూజ్‌మడ్‌లో నక్సల్స్ కదలికలున్నట్లు సమాచారం అందుకున్న నారాయణపూర్, దంతేవాడ, కొండగావ్, బస్తర్ జిల్లాల పోలీసులు, కేంద్ర బలగాలు, ఎస్టీఎఫ్, డీఆర్జీ ఫైటర్లు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో భద్రతాబలగాలకు నక్సల్స్ తారసపడడంతో కాల్పులు జరిగాయి. ఆదివారం ఉదయం జరిపిన గాలింపులో..నలుగురు నక్సల్స్ మృతదేహాలు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

ఐదోవంతు హెచ్1 బీ వీసాలు మన కంపెనీలకే!

న్యూఢిల్లీ, జనవరి 5: గత ఏడాది ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో అమెరికా మంజూరు చేసిన హెచ్1 బీ వీసాల్లో దాదాపు ఐదో వంతు భారతీయ మూలాలున్న ఐటీ కంపెనీలే దక్కించుకున్నాయి. మొత్తం 1.3 లక్షల వీసాలు మంజూరు కాగా.. వాటిలో 24,766 వీసాలు భారతీయ కంపెనీలకు లభించాయి. వీటిలో 8,140 హెచ్1 బీ వీసాలతో ఇన్ఫోసిస్ తొలిస్థానంలో ఉండగా.. తదిపరి స్థానాల్లో టీసీఎస్ (5,274), హెచ్‌సీఎల్ అమెరికా (2,953) నిలిచాయి. మొత్తంగా, హెచ్1 వీసాలకు సంబంధించి అమెజాన్ కంపెనీ 9,265 వీసాలతో నెంబర్‌వన్ స్థానంలో ఉంది. దాని తర్వాత రెండో స్థానాన్ని ఇన్ఫోసిస్ కైవసం చేసుకుంది. అమెరికాలో టెక్ కంపెనీల్లో విదేశీ ఉద్యోగులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోవటానికి హెచ్1 బీ వీసా వీలు కల్పిస్తుంది.

విదేశీ విద్యార్థుల కోసం 2 ప్రత్యేక వీసాలు

న్యూఢిల్లీ, జనవరి 5: దేశంలోని విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే విదేశీ విద్యార్థుల కోసం కేంద్రం రెండు ప్రత్యేక కేటగిరీ వీసాలను ప్రారంభించింది. 'ఇ-స్టూడెంట్ వీసా', 'ఈ-స్టూడెంట్ ఎక్స్' వీసాలను కేంద్ర హోంశాఖ ప్రవేశపెట్టిందని, దరఖాస్తుదారులందరూ ప్రభుత్వం ప్రారంభించిన స్టడీ ఇన్ ఇండియా (ఎస్ఐఐ) పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. భారత్‌లో దీర్ఘకాలిక/స్వల్పకాలిక కోర్సులు చేయాలనుకొనే విదేశీ విద్యార్థుల ప్రవేశ ప్రక్రియను ఎస్ఐఐ పోర్టల్ సులభతరం చేస్తుంది. అయితే విద్యార్థులు వీసా కోసం విడిగా https://indianvisaonline.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తుకోవాలి. వారి దరఖాస్తు ప్రామాణికతను ఎస్ఐఐ ఐడీ ద్వారా ధ్రువీకరిస్తారు.

వీసా నిబంధనలకు న్యూజిలాండ్ సవరణలు

వెల్లింగ్టన్, జనవరి 5: తమ దేశంలో కార్మికుల కొరతను తీర్చుకునేందుకుగాను న్యూజిలాండ్ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా వీసా నిబంధనలను సరళతరం చేసింది. వలసదారులకు ఉండాల్సిన పని అనుభవాన్ని తగ్గించడంతోపాటు వర్క్ వీసాకు మరింత కాలం పొడిగింపును ఇచ్చింది. ఇలాంటి నిర్ణయాల వల్ల భారతీయ వలసదారులే కాకుండా ఇతర దేశాల కార్మికులు న్యూజిలాండ్‌లో సులభంగా ఉపాధిని పొందే అవకాశం లభించనుంది. ఇంతకు ముందు వలసదారులకు పని అనుభవం మూడేళ్లు ఉండాలని న్యూజిలాండ్ నిబంధన విధించింది. అయితే కార్మికుల కొరతను తీర్చడానికి ఇప్పుడు దీన్ని రెండేళ్లకు తగ్గించింది. అలాగే సీజనల్ కార్మికులకు 2 కొత్త వీసాలను ప్రకటించింది.

పూరీ జగన్నాథ ఆలయంపై డ్రోన్ కలకలం

భువనేశ్వర్, జనవరి 5: ఒడిశాలోని ప్రఖ్యాత పూరీ జగన్నాథ ఆలయంపై ఆదివారం తెల్లవారుజామున డ్రోన్ కనిపించడం కలకలం రేపింది. సుమారు 4 గంటల ప్రాంతంలో మంగళ హారతి సమయంలో భక్తులు దర్శనానికి వచ్చినపుడు ఆలయం మీదుగా డ్రోన్ అరగంట పాటు చక్కర్లు కొట్టింది. ఈ దృశ్యం వీడియోలో రికార్డయింది. నో ఫ్లయింగ్ జోన్ ప్రాంతంలో డ్రోన్ ఎగరడం ఆలయ భద్రతపై ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ఒడిశా మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ మాట్లాడుతూ... భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఆలయ సముదాయం చుట్టూ 4 వాచ్ టవర్ల వద్ద నిరంతరం భద్రత సిబ్బందిని మోహరించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు వెల్లడించారు.

'సౌర' భారం!



(మొదటి పేజీ తరువాయి)

పోగుపడతాయని.. 2050 నాటికి అవి 1.9 కోట్ల టన్నులకు చేరుతాయని 'ద కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ)' గత ఏడాది హెచ్చరించింది. ప్రస్తుతానికి మనదేశంలో కాలం చెల్లిన సోలార్‌ప్యానెళ్లను మామూలు తుక్కు కింద మాత్రమే అమ్ముతున్నారు. వాటిని కొనేవారు కూడా.. ఆప్యానెళ్లలోని అల్యూమినియం, రాగి, గ్లాస్ భాగాలను మాత్రమే తీసుకుని.. సిలికాన్, కాడ్మియం టెల్యూరైడ్ వంటి వాటిని, పాలిమర్లను పారేస్తున్నారు. అవి భూగర్భంలోకి.. అక్కణ్నుంచీ భూగర్భ జలవనరుల్లోకి చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. వచ్చే దశాబ్దానికి ఆ వ్యర్థాలు ఇప్పటితో పోలిస్తే నాలుగైదు రెట్లు పెరుగుతాయని అంచనా. కాబట్టి పటిష్ఠ నిబంధనలు రూపొందించి ఇప్పటి నుంచే జాగ్రత్తపడాలని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు.. ప్రపంచ విద్యుత్తు వినియోగంలో కేవలం 3 శాతంగా ఉన్న సౌర విద్యుత్తు ప్రపంచంలోని టెల్యూరియం నిల్వల్లో 3 శాతాన్ని, వెండిలో 15%, ఇంకా.. ఇండియమ్, జింక్, టిన్, గాలియం, సెమీకండక్టర్ గ్రేడ్ క్వార్ట్జ్‌ను గణనీయంగా వినియోగించుకుంటున్నట్టు అంచనా.

లక్ష టన్నులు!

సౌర విద్యుత్‌కు సంబంధించి.. 2023 నాటికి భారతదేశ స్థాపిత సామర్థ్యం 66.7 గిగావాట్లు. ప్రస్తుతం దాదాపు 75 గిగావాట్లు. 2070 నాటికి 5,600 గిగావాట్లకు చేరుతుందని.. 2070కల్లా భారతదేశం సున్నా కర్బన ఉద్గారాల లక్ష్యాన్ని సాధిస్తుందని సీడబ్ల్యూఈఈ గత ఏడాది ఒక నివేదికలో వెల్లడించింది. దీనికి అనుగుణంగానే సౌరఫలకల వ్యర్థాల పెరుగుదల కూడా ఉంటుందని పేర్కొంది. సీడబ్ల్యూఈఈ నివేదిక ప్రకారం.. 2023 ఆర్థిక సంవత్సరం నాటికే మనదేశంలో పోగుపడ్డ సౌర వ్యర్థాలు లక్ష టన్నులు. కానీ, మనదేశంలో.. సౌర వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కేంద్ర పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పు శాఖ 'ఈ-వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, 2022'లో సోలార్ సెల్స్ మాడ్యుల్స్‌ను కూడా చేర్చింది తప్ప.. వాటి రీసైక్లింగ్‌కి నిబంధనలు రూపొందించలేదు.

పర్యావరణం.. ఆరోగ్యం.. గుల్ల!

భూగర్భంలోకి, జలవనరుల్లోకి చేరే కాడ్మియం, టెల్యూరైడ్ కారణంగా.. పర్యావరణానికి మేలు చేసే ఎన్నోరకాల సూక్ష్మజీవులు చనిపోతాయి. ఫలితంగా పంటల దిగుబడి తగ్గిపోతుంది. ఆ అవశేషాలు మనం తాగే నీటి ద్వారా, పండించే తిండిగింజల రూపంలో మన శరీరంలోకి చేరితే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా.. కాడ్మియం అవశేషాలు ఒంట్లోకి చేరితే మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. అంతే కాదు.. కాడ్మియం క్యాన్సర్ కారకం కూడా.

యూపీ రైతు పిటిషన్..

'కుసుమ్ యోజన' కింద తమ గ్రామంలో పంట పొలాలకు నీళ్లు అందించేందుకు వినియోగిస్తున్న సౌర విద్యుత్ ఫలకాలు పాడైపోతే, వాటిని పంటపొలాల్లో పాతిపెడుతున్నారని, వాటివల్ల భూసారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. యూపీకి చెందిన ఆశిష్ సింగ్ చండేల్ అనే రైతు జాతీయ హరిత ట్రైబ్యునల్‌కు ఒక లేఖ రాశారు. ఆ లేఖలోని విషయ తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న ఎన్జీటీ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. 'సోలార్ వేస్ట్'పై వైఖరి తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈయూ ముందంజ..

సౌర విద్యుత్తు వ్యర్థాల నిర్వహణకు సంబంధించి యూరోపియన్ యూనియన్(ఈయూ) చాలా ముందంజలో ఉంది. "ద వేస్ట్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ డైరెక్టివ్(డబ్ల్యూఈఈఈ)" పేరుతో రూపొందించిన మార్గదర్శకాల్లో.. సౌర వ్యర్థాల నిర్వహణ బాధ్యతను యూరోపియన్ యూనియన్ ఉత్పత్తిదారులు, పంపిణీదారులపైనే పెట్టింది. సౌరఫలకాల జీవితకాలం ముగిసే సమయంలో.. వాటిని తిరిగి సేకరించి, సోలార్ మాడ్యూళ్లను పద్ధతిప్రకారం రీసైక్లింగ్ చేసే బాధ్యత వారిదే. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు ఈ దిశగా ఇప్పటికే కసరత్తు చేస్తున్నాయి. - సెంట్రల్ డెస్క్

తిరిగి వాడుకోవచ్చు..

అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధనాల సంస్థ (ఐఆర్ఈఏ) అంచనాల ప్రకారం.. కాలం చెల్లిన సౌరఫలకాల నుంచి సేకరించే ముడిపదార్థాల విలువ 2030 నాటికి 450 మిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.3,860 కోట్లు) ఉండనుంది. అలా సేకరించిన ముడిపదార్థాలతో కొత్తగా 6 కోట్ల సౌరఫలకాలను తయారుచేసి వాటితో 18 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని అంచనా. అలాగే.. 2050 నాటికి అలా సేకరించే ముడిపదార్థాల విలువ 15 బిలియన్ డాలర్లని (దాదాపు రూ.1.28 లక్షల కోట్లు).. వాటితో 200 కోట్ల సోలార్‌ప్యానెళ్లు నిర్మించి 630 గిగావాట్ల విద్యుదుత్పత్తి చేయొచ్చని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు.

ఇండియా క్లైమేట్ అండ్ ఎనర్జీ డాష్‌బోర్డు ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో సౌర విద్యుత్ గణాంకాలు..

రాష్ట్రం	సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం	ఉత్పత్తి అవుతున్న విద్యుత్
తెలంగాణ	4,842 మెగావాట్లు	4,417.79 మిలియన్ యూనిట్లు
ఆంధ్రప్రదేశ్	4,653.6 మెగావాట్లు	5,098.89 మిలియన్ యూనిట్లు

పెళ్లికాని జంటలకు రూం ఇవ్వం!

» గది కావాలంటే పెళ్లయినట్లు ఐడీ చూపాల్సిందే..ఓయో సంస్థ నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 5: ప్రముఖ హోటల్ గదుల బుకింగ్ సంస్థ ఓయో కీలక నిర్ణయం తీసుకుంది. హోటళ్లలో దిగేవారికి కొత్త చెక్-ఇన్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇకపై అవివాహిత జంటలకు హోటళ్లలో గది ఇవ్వరు! ఈ మేరకు ఈ ఏడాది అమల్లోకి వచ్చేలా కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా ఇక మీదట పెళ్లికాని జంటలు గదిని బుక్ చేసుకునేందుకు వీలుండదు. ఈ నిబంధనలు తొలుత మేరఠ్ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కంపెనీ ఆదివారం వెల్లడించింది. ఓయో సవరించిన విధానం ప్రకారం.. ఇకపై ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో రూమ్ బుక్ చేసుకునేటప్పుడు జంటలు పెళ్లి ధ్రువపత్రాలు/రుజువును సమర్పించాల్సి ఉంటుంది. అంటే కచ్చితంగా వివాహాన్ని నిర్ధారించే గుర్తింపు పత్రాలను చూపించాల్సి ఉంటుంది. ఏదైనా సందర్భంలో ఇలాంటి బుకింగ్‌లను తిరస్కరించే విచక్షణాధికారాన్ని ఓయో తన భాగస్వామి హోటళ్లకు అందించింది. మేరఠ్‌లోని తన భాగస్వామ్య హోటళ్లలో తక్షణమే దీన్ని అమల్లోకి తీసుకురానుంది. క్షేత్రస్థాయి అభిప్రాయాలు, సూచనల (ఫీడ్‌బ్యాక్) ఆధారంగా కంపెనీ దీన్ని మరిన్ని నగరాలకు విస్తరించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తాము సురక్షితమైన, బాధ్యతాయుతమైన ఆతిథ్య విధానాలను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఓయో ఉత్తర భారత రీజియన్ అధిపతి పవాస్ శర్మ చెప్పారు. అందులో భాగంగానే తాజాగా కొత్త చెక్-ఇన్ విధానాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

మద్యంతో క్యాన్సర్ ముప్పు!

» ఆల్కహాల్ ఉత్పత్తులపై హెచ్చరికలు ఉండాలి

» అమెరికా సర్జన్ జనరల్ సూచన

వాషింగ్టన్, జనవరి 5: 'మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం' అనేది అందరికీ తెలిసిన విషయమే..! కానీ.. మద్యం తాగితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అమెరికా సర్జన్ జనరల్ మరోసారి హెచ్చరించింది. మద్యం బాటిళ్లపై హెచ్చరికలతో కూడిన లేబుళ్లు వేసి ప్రజలకు అవగాహన కల్పించాలని యూఎస్ సర్జన్ జనరల్ వివేక్ మూర్తి పిలుపునిచ్చారు. అంతేకాదు మనం నిత్యం వంటకాల్లో వాడే సన్‌ఫ్లవర్, ద్రాక్ష గింజల ఆయిల్ వంటి కొన్నిరకాల విత్తన నూనెల కారణంగా పెద్దపేగు కేన్సర్ రోగులు కూడా పెరుగుతున్నారని అమెరికాలోని మరో అధ్యయనం సూచించింది. అమెరికాలో ఆల్కహాల్ వల్ల ఏటా దాదాపు 1,00,000 మంది కేన్సర్ బారిన పడుతుండగా వారిలో 20 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సర్జన్ జనరల్ వివేక్ మూర్తి పేర్కొన్న మేరకు.. పొగాకు, ఊబకాయం తర్వాత కేన్సర్‌కు మూడో అతిపెద్ద కారణం ఆల్కహాల్. మద్యం సేవించడం వల్ల రొమ్ము, కాలేయం, పెద్దపేగు, అన్నవాహిక, గొంతు సహా ఏడు రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రీయ పరిశోధనల్లో నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ ప్రమాదాన్ని సూచించేలా ఆల్కహాల్ ఉత్పత్తులపై నూతనంగా రూపొందించిన ఆరోగ్య హెచ్చరికలను తప్పనిసరి చేయాలని సర్జన్ జనరల్ అమెరికా కాంగ్రెస్‌ను కోరింది.

వంట నూనెలతోనూ..

ఇళ్లలో, రెస్టారెంట్లలో వాడే సన్‌ఫ్లవర్ ఆయిల్, ద్రాక్ష గింజల నూనె, కనోలా, మొక్కజొన్న నూనెలతో కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అమెరికా శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో వెల్లడైంది. పెద్ద పేగు క్యాన్సర్ ముఖ్యంగా యువకుల్లో ఈ తరహా కేన్సర్ పెరుగుదలకు ఈ వంట నూనెలే కారణమని తేలింది. అధ్యయనంలో భాగంగా 30 నుంచి 85 ఏళ్ల మధ్య వయసున్న 80 మంది పెద్దపేగు కేన్సర్ రోగుల కణితలను పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించారు. వారి కణితుల్లో చాలాఎక్కువ స్థాయిలో బయోయాక్టివ్ లిపిడ్లు ఉన్నాయి. విత్తనాల నుంచి వచ్చే నూనెల వాడకం వల్ల.. బయోయాక్టివ్ లిపిడ్లు అధికంగా పెరుగుతున్నాయని పరిశోధకులు కనుగొన్నారు.

కుంభమేళాకు 13 వేల రైళ్లు

40 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా.. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు నిర్వహణ

» ప్రయాగ్‌రాజ్‌లో 18 వేల మంది ఆర్‌పీఎఫ్ సిబ్బంది మోహరింపు

» మేళాకు బాంబు బెదిరింపు

» బిహార్‌లో ఒకరి అరెస్టు

ప్రయాగ్‌రాజ్, జనవరి 5: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న జరుగనున్న మహా కుంభమేళాకు దేశవిదేశాల నుంచి 40 కోట్ల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. యాత్రికులు, భక్తులను చేరవేసేందుకు రైల్వే శాఖ పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. 50 రోజుల పాటు 13 వేల రైళ్లు నడపాలని నిర్ణయించింది. వీటిలో పది వేలు రెగ్యులర్ సర్వీసులు కాగా.. మూడు వేలు ప్రత్యేక రైళ్లు. మేళా జరగడానికి 2-3 రోజుల ముందు.. ఆ తర్వాత 2-3 రోజుల వరకు రైళ్లు నడుస్తాయి. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రాలను కలుపుతూ 560 రింగ్ రైళ్లు నడుపనుంది. ప్రయాగరాజ్-అయోధ్య-వారాణసీ-ప్రయాగ్‌రాజ్, ప్రయాగరాజ్-సంగమ్ ప్రయాగ్-జాన్‌పూర్-ప్రయాగ్-ప్రయాగరాజ్, గోవింద్‌పురి-ప్రయాగ్‌రాజ్-చిత్రకూట్-గోవింద్‌పురి, ఝాన్సీ-గోవింద్‌పురి-ప్రయాగరాజ్-మాణిక్‌పూర్-చిత్రకూట్-ఝాన్సీ మార్గాల్లో వీటిని నడుపుతారు. ప్రయాగ్‌రాజ్ ప్రాంతంలోని మొత్తం 9 రైల్వే స్టేషన్లలో 560 టికెట్ కౌంటర్లను కూడా రైల్వే ఏర్పాటుచేస్తోంది. భక్తులు లక్షలాదిగా తరలిరానున్న నేపథ్యంలో రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్), రాష్ట్ర రైల్వే పోలీసుకు చెందిన 18 వేల మందికిపైగా సిబ్బందిని మోహరిస్తున్నట్లు ఉత్తర మధ్య రైల్వే జీఎం ఉపేంద్ర వెల్లడించారు. ప్రయాణికులకు వైద్య సేవలు అందించడానికి ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సంట్రేటర్లు, ఈసీజీ యంత్రాలతో ప్రయాగరాజ్ జంక్షన్‌లో అబ్జర్వేషన్ రూంను ఏర్పాటు చేశామన్నారు.



ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం వద్ద భక్తులు

ఉగ్ర బెదిరింపు..

మహాకుంభమేళాకు ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. ఉగ్ర దాడిచేస్తానని, వెయ్యి మందిని చంపుతానని సోషల్ మీడియాలో పోస్టుచేసిన ఆయుష్‌కుమార్ జైస్వాల్‌ను మహాకుంభ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు విద్యార్థి. బిహార్‌లోని షాదీజంగ్ వాసి. ఇన్‌స్టాగ్రాంలో నాసిర్ పఠాన్ అనే నకిలీ పేరుతో ఈ బెదిరింపు పోస్టు పెట్టి నేపాల్ పారిపోయాడు. తన పక్కింటిలోని నాసిర్ పఠాన్‌ను ఇరికించేందుకే ఆయుష్ ఆ పేరుతో పోస్టు పెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

మేళా జరిగేది వక్ఫ్ భూమిలో!

తమ వక్ఫ్ భూమిలో మహాకుంభమేళా జరగబోతోందని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ తెలిపారు. వక్ఫ్ భూమిలో ఇంతటి ఉత్సవం నిర్వహించేందుకు అనుమతించి ముస్లింలు తమ విశాల హృదయాన్ని చాటుకున్నారని.. హిందువులు కూడా ఇచ్చిపుచ్చుకునే రీతిలో ఈ కార్యక్రమానికి తమను అనుమతించాలని అన్నారు. ఆయన వ్యాఖ్యలపై హిందూ మహాసభ మండిపడింది. పాకిస్థాన్ ప్రేరిత మౌలానాను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. మహాకుంభ్‌ను ఆటంకపరచడానికి ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తున్నారంది.

అణువిపత్తును ఎదుర్కొనేందుకు శిక్షణ

మహా కుంభమేళా సందర్భంగా రసాయన, అణు విపత్తులు చోటుచేసుకుంటే ఎదుర్కోవడానికి యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సిబ్బందిని అందుకు సన్నద్ధం చేసేందుకు గత శుక్రవారం ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చింది. యూపీ విపత్తు నిర్వహణ అథారిటీ (యూపీఎస్‌డీఎంఏ), కేంద్రప్రభుత్వం, అణుశక్తి విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అథారిటీ ఉపాధ్యక్షుడు లెఫ్టినెంట్ జనరల్ యోగేంద్ర డిమ్రీ ప్రారంభించారు. సంబంధిత సాధనాల ప్రదర్శనతో పాటు విపత్తు నిర్వహణలో కొత్త సాంకేతికతలు, రసాయన ప్రమాదాలపై సత్వర స్పందన, సురక్షిత సహాయ కార్యక్రమాలు, వైద్యసాయం మొదలైనవాటిపై వివిధ శాఖలకు చెందిన సుమారు 400 మందికి శిక్షణ ఇచ్చారు.

ఆవేశంలో నోరుజారాను.. తప్పే!

» మాధవీలత గురించి అలా మాట్లాడాల్సింది కాదు

» తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి



తాడిపత్రి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకురాలు, సినీ నటి మాధవీ లత గురించి ఆవేశంలో అలా మాట్లాడానని, ఆమెను కించపరిచే ఉద్దేశం తనకు లేదని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జేసీ పార్కులో గత ఏడాది డిసెంబరు 31న నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలపై బీజేపీ నాయకురాలు సాధినేని యామినీశర్మ, సినీ నటి మాధవీ లత చేసిన కామెంట్‌పై జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. ఆయన అభ్యంతరకరమైన భాష వాడటంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో తాడిపత్రిలోని తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆ అంశంపై స్పందించారు. తన వయసు 72 ఏళ్లు అని, కొంత ఆవేశంలో మాట్లాడానే తప్ప ఆమెను కించపరచాలనే ఉద్దేశం తనకు లేదన్నారు. డిసెంబరు 31న తన నియోజకవర్గ ప్రజలు, తన అక్కచెల్లెమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దాదాపు 16వేల మంది తనను నమ్మి జేసీ పార్కుకు వచ్చారన్నారు. తనపై నమ్మకం ఉంది కాబట్టే భారీగా తరలివచ్చారని అన్నారు. కొందరు అక్కడకు వెళ్లవద్దని మాట్లాడారని, అది సరికాదని అన్నారు. రేపు సంక్రాంతి ఉందని, ఆ పండుగకు మీరు వచ్చి చేయండి సంతోషిస్తాం అని తెలిపారు.

ఢిల్లీ రోడ్లను ప్రియాంక బుగ్గల్లా మారుస్తా

» బీజేపీ నేత బిధూరి వ్యాఖ్యలు.. తర్వాత విచారం

» అతీశీ తండ్రినే మార్చుకున్నారని మళ్లీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీపై బీజేపీ నేత, మాజీ ఎంపీ రమేష్ బిధూరి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కల్కాజీ నుంచి బీజేపీ అభ్యర్థిగా సీఎం అతిషిపై పోటీ చేస్తున్నారు. ఓ ప్రచార సభలో మాట్లాడుతూ.. "గతంలో ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ బిహార్ రోడ్లను హేమమాలిని బుగ్గల్లాగా చేస్తానంటూ అబద్ధం చెప్పారు. నేను మాత్రం ఓక్లా, సంగం విహార్‌లో రోడ్లను అభివృద్ధి చేసినట్లే కల్కాజీ రోడ్లను కూడా ప్రియాంక బుగ్గల మాదిరి నిర్మిస్తాన"ని అన్నారు. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్, ఆప్ ఖండించాయి. తన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో.. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు బిధూరి ఎక్స్ వేదికగా ప్రకటించారు. మరోవైపు, అతీశీ తన తండ్రినే మార్చుకున్నారంటూ బిధూరి ఆదివారం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'అతీశి తన ఇంటిపేరును మర్లెనా నుంచి సింగ్‌గా మార్చుకుంది. ఇదీ వారి చరిత్ర" అని రోహిణిలో నిర్వహించిన ర్యాలీలో అన్నారు.

భార్య వేధింపులు భరించలేక గుజరాత్‌లో భర్త ఆత్మహత్య

రాజ్‌కోట్, జనవరి 5: భార్య వేధింపులు భరించలేక మరో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో బెంగళూరులో ఇలాంటి సంఘటన జరగగా, తాజాగా గుజరాత్‌లో చోటుచేసుకుంది. బోటాడ్ జిల్లా జమరాల గ్రామానికి చెందిన సురేష్ సతాదియా (39) గత నెల 30న తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాణాలు తీసుకునే ముందు సెల్‌ఫోన్ ద్వారా అతడు తీసిన వీడియో వెలుగులోకి రావడంతో ఆయన తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భార్య జయ తనను మానసికంగా హింసించిందని సురేశ్ ఆ వీడియోలో తెలిపాడు. "జీవితాంతం గుర్తుంచుకునేలా ఆమెకు గుణపాఠం చెప్పండి. ఆమె నాకు చెందదు. పిల్లలకు కూడా చెందదు. నన్ను మోసగించింది. ప్రాణాలు తీసుకునేలా చేసింది" అని సురేష్ చెప్పాడు. తనతో నిత్యం గొడవ పడి పుట్టినింటికి వెళ్లిపోయేదని తెలిపాడు. సురేష్‌కు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. 15, 10 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు కుమార్తెలు, 6, 4 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, సురేశ్ భార్యను శనివారం అరెస్టు చేశామని డీఎస్పీ ఎస్.పి.అహిర్ తెలిపారు.

సీఎంఆర్ బాలికల హాస్టల్ ఘటనలో ఇద్దరి అరెస్టు

- నిందితులు.. హాస్టల్‌లోని వంట మనుషులే
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ఛైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఇద్దరు వార్డెన్లపైనా కేసు

మేడ్చల్ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌లో వీడియోలు తీసిన ఘటనలో ఇద్దరు యువకులను మేడ్చల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం వారిని రిమాండ్‌కు తరలించారు. అలాగే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరించిన కళాశాల ఛైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు వార్డెన్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి ఆదివారం వివరాలు వెల్లడించారు. హాస్టల్ బాత్రూమ్ వెంటిలేటర్ నుంచి తమను వీడియోలు తీసే ప్రయత్నం చేశారంటూ గత బుధవారం రాత్రి విద్యార్థినులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు అక్కడ వంట మనుషులుగా పని చేస్తున్న నందకిషోర్ కుమార్ (20), గోవింద్ కుమార్ (20)ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టగా.. వారిద్దరూ నేరాన్ని అంగీకరించారు. గతంలోనూ విద్యార్థినుల పట్ల నిందితులు అసభ్యంగా ప్రవర్తించేవారని డీసీపీ తెలిపారు. నిందితుల విశ్రాంతిగది.. హాస్టల్ బాత్రూమ్‌కు సమీపంలో ఉండడంతో వెంటిలేటర్ ద్వారా విద్యార్థినులను చూసేందుకు ప్రయత్నించారని తెలిపారు. బాత్రూమ్‌లో ఎవరో తొంగి చూస్తున్నారని, వీడియోలు తీస్తున్నట్టు అనుమానం ఉంద ని వార్డెన్లకు విద్యార్థినులు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోగా, నిందితులను కాపాడే ప్రయత్నం చేశారని పేర్కొన్నా రు. ఈ వ్యవహారం బయటికి పొక్కకుండా కళాశాల యాజమాన్యం తీవ్ర ప్రయత్నాలు చేసిందని చెప్పారు. బాలిక వసతి గృహాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించలేదని, భద్రత నియమాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. హాస్టల్‌లో పని చేసే యువకులను అక్కడే ఉండటానికి అనుమతివ్వడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని తెలిపారు. ఈ మేరకు కళాశాల ఛైర్మన్ చామకూ ర గోపాల్ రెడ్డి, డైరెక్టర్ జగ్గారెడ్డితో పాటు వార్డెన్లు ప్రీతిరెడ్డి, కేవీ.ధనలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ అనంత నారాయణ పైనా కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. విద్యార్థినుల భద్రత విషయంలో కళాశాల యాజమాన్యాలు, హాస్టళ్ల నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. కళాశాలలు, హాస్టళ్లలో ఎవరైనా వేధిస్తే విద్యార్థినులు నేరుగా పోలీసులను సంప్రదించాలని కోరారు.

పదేళ్లలో 1.98 లక్షల కోట్ల పెట్టుబడులు!

2035 కల్లా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 49,500 మెగావాట్లకు పెంచడమే లక్ష్యం

1.14 లక్షల మందికి ఉద్యోగావకాశాలు

పునరుత్పాదక ఇంధన విధానం-2025కు ఆమోదం

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భారీగా రాయితీలను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సౌర, పవన, పునరుత్పాదక ఇంధనం, ఎనర్జీ స్టోరేజీ (బ్యాటరీ+పంప్డ్ స్టోరేజీ) ప్రాజెక్టులు, జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటును పెద్దఎత్తున ప్రోత్సహించనుంది. ప్రస్తుతం రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్తు సరఫరా సామర్థ్యం 10,095.20 మెగావాట్లు ఉండగా, 2029-30 నాటికి 31,400 మెగావాట్లకు పెంచాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. 2034-35 నాటికి 49,500మెగావాట్లకు పెంచాలని భావిస్తోంది. వీటి ఏర్పాటుకు వచ్చే పదేళ్లలో రూ.1.98 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 1.14 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు రూపొందించిన తెలంగాణ పునరుత్పాదక ఇంధన విధానం-2025ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. పదేళ్ల పాటు ఈ విధానం అమల్లో ఉండనుంది.

బిడ్డింగ్ ద్వారా కేంద్రాల ఏర్పాటు

విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం)లు టారిఫ్ ఆధారిత కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా కొత్త సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం, జియో థర్మల్, మినీ హైడల్, వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు బిడ్లను ఆహ్వానించనున్నాయి. వీటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసి, విద్యుత్తును కొనుగోలు చేయనున్నాయి. డెవలపర్లకు ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో లీజుకు ఇస్తారు. బిడ్డింగ్‌లో గెలిచిన వారికి మార్కెట్ రేటులో 10% లీజు ధరతో భూములను కేటాయిస్తారు. అనంతరం రెండేళ్లకోసారి లీజు ధరను 5% పెంచుతారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం(పీపీఏ) జరిగాక జిల్లా కలెక్టర్లతో లీజు ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థలకు అమ్ముకోవచ్చు. సొంత అవసరాలకూ వాడుకోవచ్చు. ఎకరాకు రూ.లక్ష ధరతో ఇలాంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం 25 ఏళ్లు, లేదా ప్రాజెక్టు జీవిత కాలానికి స్థలాలను కేటాయిస్తుంది. సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ఎంత సామర్థ్యం లభ్యత ఉంటుందో ఆ మేరకే అనుమతిస్తారు. ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం లభించనుంది. సౌర, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లను రెండేళ్లలో, పవన విద్యుత్తు ప్లాంట్లను మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇక నీటిపారుదల శాఖ భాగస్వామ్యంతో జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహిస్తారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు జలాశయాలను నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తారు.

మహిళా సంఘాలతో సౌర విద్యుత్కేంద్రాలు

500 కిలోవాట్ నుంచి 2 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు ప్లాంట్ల స్థాపనకు డిస్కంలు స్వయం సహాయక సంఘాల మహిళల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించనున్నాయి. వారి నుంచి నిర్దీత ధరకు విద్యుత్తును కొనుగోలు చేస్తాయి.

భారీ ప్రోత్సాహకాలు..

- పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులను స్థాపించే భూములకు నాలా కన్వర్షన్ నుంచి మినహాయింపు.
- టీజీ-ఐపాస్ ద్వారా ఏకగవాక్ష విధానంలో సత్వర అనుమతులు.
- పారిశ్రామిక హోదా కల్పించి అన్ని రకాల ప్రోత్సాహకాల వర్తింపు.
- ప్రతి మెగావాట్‌కు 4 ఎకరాల చొప్పున భూగరిష్ఠ పరిమితి చట్టం నుంచి మినహాయింపు.
- భూముల కొనుగోళ్లపై స్టాంప్ డ్యూటీ 100శాతం తిరిగి చెల్లింపు.
- వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి ప్రాజెక్టులకు 100శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లింపు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సౌర, పవన విద్యుత్తు వాడుకుంటే 8 ఏళ్ల పాటు విద్యుత్తు సుంకం నుంచి మినహాయింపు.
- డిస్కంలకు విద్యుత్తు విక్రయిస్తే ప్రోత్సాహకాలు.
- ఇతర సౌర, పంప్డ్, బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టులకు 50శాతం రాష్ట్ర జీఎస్టీ తిరిగి చెల్లిస్తారు.
- ఎస్‌హెచ్‌జీలు/గ్రామ సమాఖ్యలు ఏర్పాటు చేసే సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులతో పాటు ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలపై ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులకు 100 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.

పీఎస్పీలకు 45 ఏళ్ల లీజుకు స్థలాలు..

పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్రాజెక్టుల(పీఎస్పీ)కు ప్రభుత్వ భూములను 45 ఏళ్ల పాటు లీజుకి ఇస్తారు. ఒకే ప్రాంతంలో సౌర, పవన, పవన+ఫ్లోటింగ్ సోలార్ వంటి హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులతోపాటు విండ్+స్టోరేజీ, హైబ్రిడ్+స్టోరేజీ వంటి ప్రాజెక్టుల ఏర్పాటునూ ప్రోత్సహించనున్నారు.

2029-30, 2034-35 నాటికి పెంచనున్న సామర్థ్యం కేటగిరీల వారీగా (మెగావాట్లలో)

పునరుత్పాదక విద్యుత్తు (నిర్మాణంలో ఉన్నవి కలిపి)	ప్రస్తుత సామర్థ్యం	లక్ష్యం (2029-30 నాటికి)	లక్ష్యం (20234-35 నాటికి)
సౌర విద్యుత్తు	7900	19800	26,000
పునరుత్పాదక ఇంధనం	467	4300	8000
పవన విద్యుత్తు	128	2500	4500
ఎనర్జీ స్టోరేజీ (పంప్డ్+బ్యాటరీ)	1600	3800	8000
జియో థర్మల్	(20కేడబ్ల్యూ)	1000	3000
మొత్తం	10,095.20	31,400	49,500

జాతీయ రహదారిపై డ్రైవర్లకు కంటి పరీక్షలు

- ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు: మంత్రి కోమటిరెడ్డి


డ్రైవర్లకు కంటి పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

చిట్యాల రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): "వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటి సమస్యలు లేకుండా చూడాలి. ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం జాతీయ రహదారిపై తిరిగే వాహన డ్రైవర్లకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో కంటిపరీక్షలు నిర్వహిస్తున్నాం" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆదివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి శివారులో జాతీయ రహదారి పక్కన గల డూన్ పంజాబీ దాబాలో 'నల్లగొండ దృష్టి - ట్రక్కు డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల' కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కంటి చూపు సమస్యలు ఉన్నా, కళ్లు మసకగా ఉన్నా డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ట్రక్కు డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు కళ్ల పరీక్షలు చేసి కళ్లద్దాలు అందిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక దృష్టిని సారించి కంటి పరీక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల & ఆయకట్టు అభివృద్ధి శాఖ
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, I & CADD, ఇరిగేషన్ సర్కిల్, కె.సి.కాలనీ, వరంగల్-506 015
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
టెండరు ప్రకటన & తేది: 12/2024-25 (1వ పిలుపు), తేది: 04.01.2025. పని పేరు: I & CADD – మైనర్ ఇరిగేషన్, వరంగల్ జిల్లా, బ్లాక్ నం.1,2 & 3 కొరకు భద్రకాళి ట్యాంక్‌లో మట్టిని త్రవ్వడం మరియు లోడ్ చేయడం. అంచనా వ్యయం విలువ (రూ.లక్షలలో): రూ.349.11 లక్షలు. టెండరు డాక్యుమెంట్ లభ్యత: 06.01.2025న ఉ.11.00 గం.ల నుండి. టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు, మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in ను దర్శించండి. కార్యాలయ ఇమెయిల్ ఐడి: seic.wgl@gmail.com, సంప్రదించు నం.లు: 9704678266 (SE, IC, WGL), 9701576925 (AEE, IC, WGL)
సం/-సూపరింటెండింగ్ ఇంజనీర్, I & CADD, ఇరిగేషన్ సర్కిల్, కె.సి.కాలనీ, వరంగల్
DIPR RO No.8672-PP/CL/ADVT/1/2024-25 తేది:05.01.2025

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

24, 29 మరియు 30 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ₹3,000 కోట్ల (ముఖ విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ఆఫర్ చేసింది.

మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం, భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) మీద 07 జనవరి 2025 (మంగళవారం)న నిర్వహించబడుతుంది. పోటీ లేని స్కీమ్ ప్రకారం రిటైల్ డైరెక్ట్ పోర్టల్ (https://rbiretaildirect.org.in) ద్వారా కూడా వ్యక్తిగత ఇన్వెస్టర్‌లు బిడ్‌లు దాఖలు చేయవచ్చు.

మరింత సమాచారం కొరకు 03 జనవరి 2025 (శుక్రవారం) తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి పత్రికా ప్రకటనను RBI వెబ్ సైట్ (www.rbi.org.in)ను చూడండి.

"మీకు డబ్బు ఆశ చూపుతూ వచ్చే ఈ-మెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

నమ్మక ద్రోహం కాంగ్రెస్ నైజం

- రైతులను దగా చేసిన రేవంత్ రెడ్డి..
- కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాయాలి
- రైతులకు మద్దతుగా నిరసన: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతులను కాంగ్రెస్ నయా మోసం చేసిందని, నమ్మక ద్రోహం ఆ పార్టీ నైజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రధాన హామీని నెరవేర్చకుండా రైతాంగానికి తీరని ద్రోహం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రజాక్షేత్రంలో ముక్కు నేలకు రాయాలన్నారు. డిక్లరేషన్ల పేరుతో నమ్మించి నయవంచన చేసిన రాహుల్ గాంధీ 70 లక్షలమంది రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం కాంగ్రెస్ తప్పుడు హామీలిచ్చిందని, ఆ పార్టీని తెలంగాణ రైతాంగం ఎన్నటికీ క్షమించదన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సోనియాగాంధీ చెబితేనే తాను మాటిస్తున్నానని రేవంత్ రెడ్డి ఆనాడు అన్నారని, రైతు భరోసా గురించి ఇప్పుడు ఆయన చెబుతున్న మాటలు ఎవరూ నమ్మడం లేదన్నారు. రైతులకు సంబంధించిన పలు హామీలను వరంగల్ డిక్లరేషన్ పేరుతో రాహుల్ గాంధీతో చెప్పించారని, అధికారంలోకి వచ్చాక ఆ పథకాల అమలుకే గ్యారెంటీ లేకుండా పోయిందని విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం రైతుబంధు కింద ఇచ్చిన పదివేలనే బిచ్చమన్న రేవంత్.. ఇప్పుడు చేస్తున్నదేమిటని నిలదీశారు. పెట్టుబడి సాయాన్ని రూ.2 వేలు పెంచడమంటే.. ఆయన దృష్టిలో ముష్టి వేస్తున్నట్లా? ఇచ్చినమాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా? రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. వెంటనే తాను వస్తానన్న రాహుల్ గాంధీ.. ఇప్పుడు ప్రజలు కష్టాల్లో ఉంటే ఆయన ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగుల పరిస్థితులు బాగుండేవని సీఎం పదవిలో కూర్చొని రేవంత్‌రెడ్డి తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశంలోనే ధనిక రాష్ట్రం తెలంగాణ అని ప్రతిపక్షంలో ఉన్నపుడు పేర్కొన్న రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అప్పులపాలైందని ప్రచారం చేస్తున్నారన్నారు. బాగోలేనిది రాష్ట్ర ఆర్థికపరిస్థితి కాదని.. ఆయన మానసిక పరిస్థితి అని అన్నారు.



అప్పు తెచ్చిన డబ్బును ఏం చేశారు?

ఇబ్బందికర పరిస్థితులను సరిదిద్దాల్సిన స్థానంలో కూర్చొని రాష్ట్రం గురించి సీఎం రేవంత్ రెడ్డి తక్కువగా మాట్లాడటం సరికాదని కేటీఆర్ అన్నారు. రాష్ట్రానికి ఆర్థిక ఇంజన్‌గా ఉన్న హైదరాబాద్‌లో హైడ్రా, మూసీ ప్రాజెక్టు కారణంగా రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ అప్పు చేస్తే.. ఆ డబ్బులను ప్రజలకు పంచారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో రూ.1.38 లక్షల కోట్ల అప్పు చేసి ఏం చేసిందని ప్రశ్నించారు. ఢిల్లీకి మూటలు పంపించారా? అని నిలదీశారు. రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తింపచేసేవరకు కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు మద్దతుగా నిరసనలు చేపట్టనున్నట్లు కేటీఆర్ వెల్లడించారు.కాగా రాష్ట్రవ్యాప్తంగా 19,600 సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు 26 రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం తగదని ఎమ్మెల్సీ కవిత ఎక్స్ వేదికగా అన్నారు.

ఫార్ములా-ఈ కేసులో.. నేడు ఏసీబీ విచారణకు కేటీఆర్!

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు రావాల్సిందిగా ఏసీబీ నోటీసులిచ్చింది. దీంతో సోమవారం జరగనున్న పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఇదే కేసులో ఈ నెల 7న విచారణకు రావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేటీఆర్‌కు సమన్లు జారీ చేసింది. కాగా, ఈ కేసులో సహనిందితులుగా ఉన్న బీఎల్ఎన్ రెడ్డి, అరవిందకుమార్‌లనూ ఈ నెల 2, 3వ తేదీల్లోనే విచారణకు రావాలని ఈడీ సమన్లు జారీ చేయగా.. వారిద్దరు కొంత సమయం కావాలని రాతపూర్వకంగా కోరారు. దీంతో వారికి ఈడీ అధికారులు వారం రోజుల వ్యవధి ఇచ్చారు.


భారత ప్రభుత్వం, రైల్వేల మంత్రిత్వ శాఖ
రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు
సెంట్రలైజ్డ్ ఎంప్లాయిమెంట్ నోటీస్ (CEN) నం. 07/2024
మినిస్టీరియల్ & ఐసోలేటెడ్ కేటగిరీల వివిధ పోస్టుల కోసం నియామకం
దిగువ పట్టికలోని వివిధ మినిస్టీరియల్ & ఐసోలేటెడ్ కేటగిరీల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. దరఖాస్తు సమర్పణకు చివరి తేది 06-02-2025. దరఖాస్తు (అన్ని విధాలుగా పూర్తి చేసినది) ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలి.
దరఖాస్తు ప్రారంభ తేది : 07-01-2025. దరఖాస్తుకు సమర్పణకు చివరి తేది : 06-02-2025

పోస్ట్ పేరు	7వ సిపిసి ప్రకారం పే లెవెల్	ప్రారంభ వేతనం (రూ.)	వైద్య ప్రమాణం	వయస్సు (01-01-2025 నాటికి)	మొత్తం ఖాళీలు (అన్ని ఆర్ఆర్‌బీలలో)
వివిధ సబ్జెక్టుల పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు	8	47600	సి2	18 - 48	187
సైంటిఫిక్ సూపర్‌వైజర్ (ఎర్గోనామిక్స్ & ట్రైనింగ్)	7	44900	బి1	18 - 38	3
వివిధ సబ్జెక్టుల శిక్షణ పొందిన గ్రాడ్యుయేట్ టీచర్లు	7	44900	సి2	18 - 48	338
ప్రధాన న్యాయ సహాయకుడు	7	44900	సి1	18 - 43	54
పబ్లిక్ ప్రాసిక్యూటర్	7	44900	సి1	18 - 35	20
ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ (ఇంగ్లీష్ మీడియం)	7	44900	సి2	18 - 48	18
సైంటిఫిక్ అసిస్టెంట్ / ట్రైనింగ్	6	35400	బి1	18 - 38	2
జూనియర్ ట్రాన్స్‌లేటర్ / హిందీ	6	35400	సి2	18 - 36	130
సీనియర్ పబ్లిసిటీ ఇన్‌స్పెక్టర్	6	35400	సి1	18 - 36	3
స్టాఫ్ అండ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్	6	35400	సి1	18 - 36	59
లైబ్రేరియన్	6	35400	సి2	18 - 33	10
సంగీత ఉపాధ్యాయురాలు (మహిళ)	6	35400	సి2	18 - 48	3
వివిధ సబ్జెక్టుల ప్రాథమిక రైల్వే ఉపాధ్యాయులు	6	35400	సి2	18 - 48	188
సహాయ ఉపాధ్యాయురాలు (మహిళ) (ప్రాథమిక పాఠశాల)	6	35400	సి2	18 - 48	2
లేబొరేటరీ అసిస్టెంట్ / పాఠశాల	4	25500	సి2	18 - 48	7
ల్యాబ్ అసిస్టెంట్ గ్రేడ్ III (కెమిస్ట్ మరియు మెటలర్జిస్ట్)	2	19900	బి1	18 - 33	12
				వెరసి మొత్తం	1036

*ఇందులో కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఒక పర్యాయ ప్రమాణంగా నిర్దిష్ట వయోపరిమితి కంటే వయస్సులో 3 సంవత్సరాల సడలింపు ఉంటుంది.
మరిన్ని వివరాల కొరకు, దయచేసి దిగువ జాబితా చేయబడిన అన్ని పార్టిసిపేటింగ్ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల (RRBs) అధికారిక వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్న సవివర సెంట్రలైజ్డ్ ఎంప్లాయిమెంట్ నోటీస్ (CEN) నం. 07/2024 చూడగలరు.

CEN నెం. 07/2024లో పాల్గొను RRBs వెబ్‌సైట్‌లు		
అహ్మదాబాద్ www.rrbahmedabad.gov.in	చండీగఢ్ www.rrbcdg.gov.in	మాల్డా www.rrbmalda.gov.in
అజ్మీర్ www.rrbajmer.gov.in	చెన్నై www.rrbchennai.gov.in	ముంబై www.rrbmumbai.gov.in
బెంగళూరు www.rrbbnc.gov.in	గోరఖ్‌పూర్ www.rrbgkp.gov.in	పాట్నా www.rrbpatna.gov.in
భోపాల్ www.rrbbhopal.gov.in	గౌహతి www.rrbguwahati.gov.in	ప్రయాగ్‌రాజ్ www.rrbald.gov.in
భువనేశ్వర్ www.rrbbbs.gov.in	జమ్మూ-శ్రీనగర్ www.rrbjammu.nic.in	రాంచీ www.rrbranchi.gov.in
బిలాస్‌పూర్ www.rrbbilaspur.gov.in	కోల్‌కతా www.rrbkolkata.gov.in	సికింద్రాబాద్ www.rrbsecunderabad.gov.in

ఈ ప్రకటన పూర్తిగా సూచనాత్మకం. ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేయడానికి ముందు అభ్యర్థులు తమ అర్హతను నిర్ధారించుకోవడానికి సవివర CEN నం. 07/2024 యొక్క పోస్ట్ పారామీటర్ టేబుల్ మరియు వేకెన్సీ టేబుల్ గమనించగలరు. పైన పేర్కొన్న నియామకానికి సంబంధించిన ఏదైనా సవరణలు/అనుబంధం/ముఖ్యమైన ప్రకటన ఎప్పటికప్పుడు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లలో మాత్రమే జారీ చేయబడుతుంది.
నెం. RRB/SGUJ/Advt./CEN 07/2024/Ministerial & Isolated Categories
తేది: 05-01-2025
చైర్మన్లు, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు
మధ్యవర్తులు, బ్రోకర్లు మరియు జాబ్ రాకెట్ల పట్ల జాగ్రత్త వహించండి.



భావోద్వేగాల్ని అనువదించటం ముఖ్యం

– దాసు కృష్ణమూర్తి



దాసుకృష్ణమూర్తి వాక్యానికి వృద్ధాప్యం లేదు. 98 ఏళ్ల వయసులోనూ ఆయన రాస్తూ, అనువాదాలు చేస్తున్నారంటే నమ్మలేం. ముఖ్యంగా తెలుగు కథ అనువాదానికి ఆయన ఎనలేని కృషి చేస్తున్నారు. ఇటీవల ఆయన కూతురు తామ్రపర్ణితో కలసి తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేసిన కథల పుస్తకాన్ని ప్రసిద్ధ పుస్తక ప్రచురణ సంస్థ అలెఫ్ బుక్ కంపెనీ 'ద గ్రేటెస్ట్ తెలుగు స్టోరీస్ ఎవర్ టోల్డ్' పేరుతో ప్రచురించింది. ఇందులో 21 మంది తెలుగు రచయితల కథలు ఉన్నాయి. అంతకుముందు 2010లో మరికొంతమంది తెలుగు కథకుల రచనలను '1947 సంతోషాబాద్ పాసెంజర్ అండ్ అదర్ స్టోరీస్' పేరుతో అనువాదం చేశారు (రూపా పబ్లికేషన్స్ ప్రచురణ). ప్రస్తుతం న్యూజెర్సీలో ఉంటున్న దాసు కృష్ణమూర్తి ఇంగ్లీషులో స్వతంత్ర రచనలూ చేశారు. కథలు రాసి 'ద సీసైడ్ బ్రైడ్ అండ్ అదర్ స్టోరీస్' (2019) పేరుతో ప్రచురించారు. అనువాదాలు అనేకం వస్తున్నప్పటికీ నాణ్యత ఉండటం లేదని ఇంగ్లీషులో వస్తున్న తెలుగు అనువాదాల్లో నాణ్యత పెంచడమే తన లక్ష్యమని చెబుతున్న దాసు కృష్ణమూర్తితో సంభాషణ.

ఇంటర్వ్యూ ■ **వేంపల్లె షరీఫ్**

ఈ వయసులోనూ అనువాద ప్రక్రియ మీద మీకెందుకు ఇంత పట్టుదల కలిగింది? మీ ప్రేరణ ఏమిటి?

నా కూతురు తామ్రపర్ణి అమెరికాలో ఉంటోంది. నేను, నా భార్య తరచూ ఇక్కడికి వచ్చేవాళ్లం. ఇక్కడున్న తెలుగువాళ్లకు తెలుగు సాహిత్యం, రచయితల గురించి పెద్దగా తెలియదని అర్థమైంది. అప్పుడే ఏదైనా చేయాలనుకున్నాం. నా భార్య చనిపోయాక పూర్తిగా ఒంటివాణ్ణి అయిపోయాను. అమెరికా లోనే కూతురు, అల్లుడి దగ్గర ఉండాల్సి వస్తోంది. ఇక నన్ను నేను ఎంగేజ్ చేసుకోవడానికి అనువాదాలు మొదలుపెట్టాను.


2006లో నేను, నా కుమార్తె తెలుగులో వస్తున్న కల్పనా సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురించాలని గట్టిగా ప్రయత్నం మొదలుపెట్టాం. తెలుగులో ఉన్న అద్భుతమైన సాహిత్యం, రచయితల గురించి అమెరికాలో ఉన్న వారికి తెలియాలని 'లిటరరీ వాయిస్ ఆఫ్ ఇండియా' పేరుతో వెబ్ సైట్‌ని ప్రారంభించాం. ఇందులో ముఖ్యంగా భారతదేశంలో ఉన్న విభిన్న సంస్కృతులకు, పెద్దగా వెలుగులోకి రాని జీవితాలకు ప్రాధాన్యత ఇచ్చి వారి సాహిత్యాన్నే ప్రచురించాం.

ఇక వయసు అంటారా– క్రియేటివిటీ అనేది మనసుకు సంబంధించింది. మనసుకు వయసు లేనట్టే సృజనకు కూడా లేదు. అనువాదాల మీద నాకున్న గాఢమైన ఇష్టమూ, నా కూతురూ అల్లుడి సహకారాలే నన్ను నడుపుతున్నాయి.

తెలుగు రచనలు ఇంగ్లీషు అనువాదానికి సులువుగా ఇమడవు అంటారు, ఎంత వరకు వాస్తవం?

కరెక్టు కాదు అనుకుంటాను. ఎందుకంటే కొన్నిసార్లు ఒకే భాషలో కూడా ఒకే సాంస్కృతిక పదాలు ఉండవు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలే అందుకు కచ్చితమైన నిదర్శనాలు. అయితే భాషలు వేరైనా, సంస్కృతులు వేరైనా మనుషులకు అనుభవాలు ఎక్కడైనా ఇంచుమించు ఒకేలా ఉంటాయి. ఆ అనుభవాలే సాహిత్యంలో మనుషులను సహానుభూతి పొందేలా చేస్తాయి. అది గుర్తించినప్పుడు కథను, భావోద్వేగాన్ని ఒక భాష నుంచి మరో భాషలోకి తీసుకెళ్లడం సులువు అవుతుంది.

> 2006లో నేను, నా కుమార్తె తెలుగులో వస్తున్న కల్పనా సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురించాలని గట్టిగా ప్రయత్నం మొదలుపెట్టాం. తెలుగులో ఉన్న అద్భుతమైన సాహిత్యం, రచయితల గురించి అమెరికాలో ఉన్నవారికి తెలియాలని 'లిటరరీ వాయిస్ ఆఫ్ ఇండియా' పేరుతో వెబ్‌సైట్‌ని ప్రారంభించాం.



ఇన్నేళ్ల అనువాద కృషిలో మీరు గమనించిన అంశాలు?

భాషలు సంస్కృతులకు పుట్టిన పాపలు. ఇంగ్లీషులో 'mouse' (ఒక కంప్యూటర్ భాగం)ని తెలుగులోకి ఎలా అనువదించడం. అలాగే 'Foxtrot', ఇంకా 'Halloween' లాంటివన్నీ ఎలా అనువదించగలం. రెండు సాంస్కృతిక నేపథ్యాలు వేరుగా ఉన్నప్పుడు వాటి మధ్య ఆమోదయోగ్యమైన పదాన్ని నిర్మించడం సవాలుతో కూడుకున్న పనేకానీ అసాధ్యమైతే కాదు. ఇది నేను గమనించింది.

అనువాదంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

ప్రధాన సమస్య ఏంటంటే మూలంలో ఉన్న భావాన్ని ఉన్నదున్నట్టు అనువాదం చేయడమా లేక కొంత మెరుగు పర్చడమా అన్నది. అయితే మెరుగుపరిచే ఉద్దేశ్యంతో ఎట్టి పరిస్థితిల్లోనూ మూల రచయిత అసలు ఉద్దేశ్యాన్ని చెడగొట్ట కూడదు కదా. అతని చూపుని, దృష్టి కోణాన్ని కూడా అనువాదంలో చెడకుండా చూసుకోవాలి. ఈ పరిమితులకు లోబడి వీలైనంతవరకు మూల భాషలోని అర్థానికి అనువాద భాషలో ఉన్న సరైన పదాలనే వాడటానికి ప్రయత్నిస్తాను.

అనువాదానికి ఎలాంటి రచనలు ఎంచుకుంటారు?

చాలావరకు బలమైన పాత్రలు, సంఘటనలు, సామాజిక అంశాలున్న కథలను ఎంచుకుంటాం. వేంపల్లె షరీఫ్ రాసిన 'పర్దా' (ది కర్టెన్) కథనే తీసుకుందాం. తన కొడుకు నిర్బంధ సామాజిక నిబంధనలను ధిక్కరించే ఒక వృద్ధ మహిళ కథ అది. అలాగే అద్దేపల్లి ప్రభు రాసిన 'అతడు మనిషి' (ఏన్ ఐడియల్ మేన్) కథలోనూ పైన చెప్పిన మూడు లక్షణాలు ఉన్నాయి.

మంచి అనువాదాలు పెరగాలంటే ఏం చేయాలి?

రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సాహిత్య అనువాదాలను ప్రోత్సహించాలి. ఉదాహరణకు తమిళనాడు ప్రభుత్వం అనువాదాలను విపరీతంగా ప్రోత్సహిస్తోంది. అనువాదం అంటే కేవలం మన సాహిత్యం ఇతర భాషల్లోకి వెళ్లడం కాదు, ఇతర భాషల సాహిత్యాన్ని మన భాషలోకి తెచ్చుకోవడం కూడా. అలాగే ప్రచురణ సంస్థలు సైతం జాతీయ స్థాయిలో అనువాదాల కోసం ఎంతో కృషి చేస్తున్నాయి. తాజాగా అలెఫ్ (Aleph) బుక్ కంపెనీ వారు తెస్తున్న 'ది గ్రేటెస్ట్ స్టోరీస్ ఎవర్ టోల్డ్ సిరీస్'కి విపరీతంగా గుర్తింపు ఉంది. భారతీయ భాషలన్నింటి లోంచి వారు కథలను అనువదించి ఇంగ్లీషులో పుస్తకాలు వేస్తున్నారు.

మీ అనువాదాలకు వచ్చిన పెద్ద ప్రశంస ఏది?

అలెఫ్ బుక్ కంపెనీ ప్రచురించిన మా పుస్తకం 'ది గ్రేటెస్ట్ తెలుగు స్టోరీస్ ఎవర్ టోల్డ్' దేశవ్యాప్తంగా బాగా అమ్ముడవుతోంది. అనువాదం బావుందని చాలామంది మెసేజులు పంపారు. మా మరో పుస్తకాన్ని ప్రచురించిన రూపా పబ్లికేషన్స్ మమ్మల్ని మంచి అనువాదకులుగా పేర్కొంది. తెలుగులో ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి "దాసు కృష్ణమూర్తి నా కథను అనువదించడానికి అంగీకరించడం గౌరవంగా భావిస్తున్నాను" అన్నారు. కవన శర్మ "మీ ప్రయత్నాలు తెలుగు కథకు, రచయితలకు ఎంతో మేలు చేస్తాయి" అన్నారు. అనువాదం విలువ అందరికీ తెలియకపోవచ్చు కానీ ఇలాంటి రచయితలకైతే తప్పక తెలుసని నా నమ్మకం.

ప్రస్తుతం మీరు ఏమి రచనలు చేస్తున్నారు?

ఇప్పుడు నేను నా భార్యకు సంబంధించిన పుస్తకంపై పనిచేస్తున్నాను. మా సంకలనాలను చూడ్డానికి ఆమె లేదు. నేను బతికిన్నాళ్లు నాకు ఆమె ఒక శక్తి కింద పని చేసింది. అయితే ఆమె దూరమై 23 సంవత్సరాలు అవుతున్నా ఆమె స్ఫూర్తి నన్ను నడిపిస్తూనే ఉంది.

శేషం



సీతాకోక చిలక చివరి క్షణాల్లో
ఆడంబరంగా అంజలి ఘటిస్తుంటావు నువ్వు,
చీమనై దాని రెక్కల్ని తుంచుకుపోయి – వాటి
మాసే రంగుల్లో పొర్లాడి మాయమౌతాను నేను.

వేకువకు నేలరాలే రేరాణి పూల గంధాలతో
లిప్తకాలాల శాశ్వత బంధాలను శ్వాసిస్తూ నేను,
చిన్న చిన్న సంతోషాలతో చెలిమి చేతకాక
పంచేంద్రియాలూ పాడైన స్వనీతి ఆత్మని మోస్తూ
నువ్వు.

అబద్ధ ప్రమాణాల వెలుగులో నిన్ను నువ్వు
ఆనందరాగాలాపనకి సిద్ధం చేసుకొనే వేళలో,
దక్కిన మధుపాత్రను చుంబిస్తూ చేదుగుళిక
లన్నిట్నీ చప్పరించి ఉమ్మేస్తుంటాను నేను.

నిన్ను మెప్పించేలా అనురాగాలను అరువిచ్చే
నీలాంటి ఆత్మీయులే చుట్టూ దాపురించిన
దారిద్ర్యం నీది,
నాలాగా – తమకోసమే తాము కళలై మెరిసే
ఒకరో, ఇద్దరో సుదూర అదృశ్య ప్రియులున్న
ఐశ్వర్యం నాది.

ఇహపర పారవశ్యాల్ని నటించడంలో జీవించే
తేజో నక్షత్రానివి నువ్వు,
ఎదలో "ప్రవక్త" స్వరానికై ఎడారి దాహాలతో
శిలువను మోసే బడుగుని నేను.

కానుకలూ, శుభాకాంక్షలూ, కొవ్వొత్తి నవ్వులు,
ప్రేమ సందేశాలు, పాతదేహానికి కొత్త కొత్త
అలంకరణలూ, లోకమంతా నువ్వు..

నీకర్థం కాని,
నిన్నటి ప్రేయసికీ, రేపటి ఊర్వశికి అంతే చిక్కని
యోగమేదో సిద్ధింపచేసుకొంటూ
కొండల్లో ప్రవహించే సెలయేరునై.. నేను.

■ **సొలోమోన్ విజయ్ కుమార్**
✆ 83413 36828

బొమ్మలు: అక్బర్

యాగంటి వచనాల్లో అచ్చతెలుగు 'అధివాస్తవికత'!

తెలుగు పాట తొలినాళ్ళ రూపాలలో 'ఏల' ఒకటి. 'ఏల' అనే మాటకు 'శృంగారపు పాట' అని శబ్దరత్నాకరం అర్థం చెప్పింది. "ఏలలు పెట్టి పాడడం" అని పాల్కురికి సోమనాథుడు బసవ పురాణంలో చెప్పిన మాట ఒకటి ఉంది. "రెండేసి పాదములకో, మూడేసి పాదములకో ఒకసారి ఏదో ఒక దేవుని పేరు రాగ క్రమమున ఉచ్చరిస్తూ చదవడం యేలలుపెట్టి చదవడము" అని దానికి వివరణ. 'ఏలలు' పాడుకోవడానికి ఉద్దేశించినవే కాబట్టి, ఈ వివరణలోని 'చదువుట' అనే మాటను 'పాడుట' గానే అర్థం చేసుకోవచ్చు.

కానరాని యడవిలోన
వానలేని మడుగు నిండె,
వానలేని మడుగుమీదనూ, యాగంటిలింగా,
మానరాని అగ్ని పొడమెరా.

ఆకులేని యడవిలోన
తోకలేని మృగముపుట్టె
తోకలేని మృగము కడుపునా, యాగంటిలింగా,
ఈకలేని పక్షిపుట్టెరా.

'యాగంటి వారి ఏల'ల లోనివి ఈ రెండు ఏల పదాలు. పాడుకోవడానికే ఉద్దేశించినవని చెప్పకనే తెలిసిపోతుంది. మాటలతో వర్ణించి చెప్పలేని ఒక అధివాస్తవ మార్మికత ఈ ఏలలలో ఉన్నదని కూడా చెప్పకనే తెలిసిపోతుంది. 'యాగంటిలింగా' అన్నది మూడవ పాదాంతంలో తప్పనిసరిగా ఇవ్వబడిన విశ్రాంతి. ఈ ఏల పదాన్ని పాడుకోవడంలో మాటలకందని ఒక ఉపశమనం ఉంది. అలసిపోయిన మనసుకు ఇందులోని ఉపశమనం ఎంతో హాయినిచ్చేదిగా ఉంటుందని అర్థమవుతుంది. మార్మికత స్థాయిని మరికాస్త ముందుకు తీసుకు వెళితే అధివాస్తవిక మార్మికతగా రూపాంతరం చెందుతుందని పై ఏలలోని మాటలతో అర్థమౌతుంది. ఒక్కొక సమయంలో మనిషి పాడుకుని ఉపశమనాన్ని పొందడానికి, అర్థవంతమైన మాటల కంటే, మార్మికార్థం దాగి ఉన్నదిగా అనిపించే ఏవో కొన్ని మాటలతో ఒక పాట అవసరమౌతుందని, ఆలోచించే అవసరాన్ని మనిషి బుద్ధి ఆ సమయంలో కోరుకోదని, అందువలన లయబద్ధమైన అర్థంలేని మాటలు పాటగా ఉంటే చాలు మనిషి పాడుకుని తృప్తిపడతాడని ఊహించిన వ్యక్తి ఈ పాటల సృష్టికి కారకుడు. ఆ వ్యక్తి పేరు గార్లపాటి లక్ష్మణయ్య.

ఈయన ఎప్పటివాడు అనే విషయంపై అభిప్రాయ భేదాలున్నప్పటికీ, కనీసం నాలుగైదు వందల సంవత్సరాలకు పూర్వుడని మాత్రం అందరూ ఒప్పుకున్నారు. జానపద సాహిత్యంలో ఇలా అధివాస్తవిక మార్మికత కలిగిన మాటల కూర్పుతో యాగంటి ఏలలను, వచనాలను సృష్టించిన ఈయన కర్నూలు జిల్లాలోని యాగంటి క్షేత్రంలో ఉన్న యాగంటి నంజేశ్వరుడికి అంకితంగా ఈ యాగంటి పదాలను చెప్పాడు. ఈయన ఇంటి పేరైన గార్లపాడు ఈయన నివాస స్థలం అనుకుంటే, అది కూడా కర్నూలు జిల్లాలోనే ఉంది. సంప్రదాయ సాహిత్యంలోని కావ్యాలలోలా, పైన చూపిన యాగంటి ఏలలోని భాష, అందులోని అంతఃసూత్రం మరేదో భాషలోని రచనకు అనువాదమో, అనుకరణో కావడానికి ఎంతమాత్రమూ అవకాశం లేదు. ఇది అచ్చమైన తెలుగు ఊహ అన్నది సందేహం లేని మాట.

మామూలు మాటల్లో వివరించి చెప్పలేనంత అందాన్ని, కొన్ని సందర్భాలలో, మాటలకు మార్మికత అలంకరించి చూపిస్తుంది.



> సాల్వడార్ డాలి సర్రియల్ చిత్రాలకు మించినవిగా భావించదగిన అధివాస్తవిక అక్షర చిత్రాలు తెలుగు సాహిత్యంలోని యాగంటి వచనాలలో ఉన్నాయి.

మాటలకు అలా వచ్చే సాధారణ మార్మికతకు మించిన మార్మికతను, అధివాస్తవికతలో ఆ మార్మికపు మాటలను ముంచి లయబద్ధం చేయడం వలన సాధించవచ్చునని, అలా సాధించడం వలన తయారైన రచన అధివాస్తవ మార్మికత (Surreal-mysticism) అనదగిన ఒక అధిలౌకిక స్థితితో కూడినదై మరింత ఆశ్చర్యాన్ని, మైమరపును కలగజేస్తుందని తెలిపే ఉదాహరణలు యాగంటివారి కొన్ని వచనాల్లో కనపడతాయి. పాశ్చాత్య దేశాలలో అధివాస్తవిక ఆలోచనా ధోరణి ఒక సాహిత్యోద్యమ రూపంలో 20వ శతాబ్దం పూర్వార్థంలో ఫ్రాన్స్‌లో వెలుగు చూసింది. యాగంటి ఏలలకు, వచనాలకు 15వ శతాబ్దం ప్రాంతంలోనే రూపకల్పన జరిగింది కాబట్టి, సాహిత్యంలో అధివాస్తవిక ఆలోచనా ధోరణి తెలుగు నేలపై ఆనాటికే మొదలైందని గట్టిగానే చెప్పవచ్చు.

ఓయక్క ఒక కప్ప అయిదు పాముల మింగె,
తెల్సుకోరె
వినుడి జనులార, ఇనుము వంటక మాయె,
తెల్సుకోరె
అమ్మలపొదిలోన కొమ్ముటేనుగు బుట్టె,
తెల్సుకోరె
అ కొమ్ముటేనుగు మీద కొదమ బాలుడు బుట్టె,
తెల్సుకోరె
చింతమానూ నొక్క బంతిపూవూ బుట్టె,
తెల్సుకోరె
దాని చెంతనున్న కోడి పులిపిల్లాయెనూ,
తెల్సుకోరె
గుడి మీద ఒక నక్క కూతలు బెట్టెను,
తెల్సుకోరె
దాని మెడనున్న గంటలూ మేఘాలు మేసేను,
తెల్సుకోరె
పుడిసెడు నీళ్ళనూ భూమెల్ల తడిసెనూ,
తెల్సుకోరె
దాని వొడినున్న నిప్పులు వనితలు జల్లెనూ,
తెల్సుకోరె
యెరిగిన వారు యాడాది గడియన్నె,
తెల్సుకోరె
దీనియిరవెల్ల క్రమముతో యాగంటి గురుడెరుగు,
తెల్సుకోరె!

పై గేయంలోని చివరి పాదంలో మాటలనుబట్టి ఇది యాగంటి గురుడైన గార్లపాటి లక్ష్మణయ్య రచనగా తెలుస్తుంది. గేయం మొదలైన దగ్గర నుండి ఒక్కొక్క పాదంలో ఒక్కొక అధివాస్తవిక చిత్రం కళ్ళముందు ప్రత్యక్షమౌతుంది. ముందు పాదంలోని అక్షర చిత్రం పూర్తిగా ఆకళింపుకు వచ్చి, అది కలిగించిన అబ్బురం అంతమవక ముందే, తరువాతి పాదంలో ఒక కొత్త చిత్రం కళ్ళముందు ప్రత్యక్షమై పాఠకుడి ఊహను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అర్థం గురించి ఆలోచించే ప్రయత్నం చేసే లోపే, అర్థం గురించి ఆలోచించడం అంత అవసరమా? అనే ఆలోచన ఈ గేయంలోని పాదాలను చదువుతున్నప్పుడు ప్రతి పాదంలోనూ కలుగుతుంది. మొత్తం మీద ఈ గేయంలో ఉన్నది అనన్య సామాన్యమైన అధివాస్తవిక అందం!

సాల్వడార్ డాలి సర్రియల్ చిత్రాలకు మించినవిగా భావించదగిన అధివాస్తవిక అక్షర చిత్రాలు తెలుగు సాహిత్యంలోని యాగంటి వచనాలలో ఉన్నాయి. అధివాస్తవిక ధోరణిని అంతఃసూత్రంగా చేసుకుని కుంచెలతో బొమ్మలు వేసి డాలి ప్రపంచం వేపు వింతగా చూసి మెరిపిస్తే, మాటలతో అంతకు మించిన వింతలను అక్షర చిత్రాలుగా 15వ శతాబ్దం ప్రాంతాలకే తెలుగు జానపద సాహిత్యంలోని పై రచనలలో మలిచి చూపించడం జరిగింది. కానీ ఇవి కనీసం ఒక పుస్తకంగా కూడా ముద్రణ పొందక, చెన్నై లోని ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో వ్రాతప్రతులుగా మూలన పడి ఉన్నాయి!

■ **భట్టు వెంకటరావు**

చదువు ముచ్చట

పద్మజ సూరపరాజు



ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

ఆఖరుగా చదివింది ఆంటన్ చెహోవ్ కథలు, పెద్ద కథలు, నవలికలు. వాటిల్లో ఎక్కువ ఇష్టపడింది చెహోవ్ నవలిక 'మై లైఫ్'. చెహోవ్ రచనలు విడి విడి వ్యక్తుల స్వభావాల కంటే 'మనిషి తత్వా'న్ని మాట్లాడుతాయి, మానవ మూల తత్వాన్ని. చెహోవ్ దృష్టిలో ఒక మనిషికి మరో మనిషి అర్థం చేసుకోలేని అగాథం. చెహోవ్‌కు మానవ దయనీయత అంటే అమితమైన జాలి, దాచుకోలేని చిరాకు, రెండూను. ఆయన సృష్టిలో మనిషి ఎవరికీ ఏమాత్రం పట్టనివాడు. Fate (God) is indifferent to man.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?


ఎనిమిది తొమ్మిదేళ్ళప్పుడు మొట్టమొదట చదివింది ఆర్. కె. నారాయణ్ 'స్వామి అండ్ ఫ్రెండ్స్'. తర్వాత ఆయనవే మరికొన్నిటితోపాటు, చార్లెస్ & మేరీ లాంబ్ పుస్తకం 'టేల్స్ ఫ్రమ్ షేక్స్పియర్'. ఇంట్లో ఉండే భారతి పత్రికలు కూడా. అందులోంచి బాగా నవ్వొచ్చి గుర్తున్నది తిలక్ కవితలో ఒక లైన్, 'మిత్రమా రుబ్బుడు పొత్రమా!' ఆయనదే 'పోస్ట్‌మాన్' కవిత కూడా. చిన్నప్పుడు చదివినవాటిల్లో బాగా నచ్చినవి– చార్లెస్ డికెన్స్ 'డేవిడ్ కాపర్ ఫీల్డ్', ఎమిలి బ్రాంటీ 'వుదరింగ్ హైట్స్'.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర ఏది?

అలా ఒక్క పాత్రా అనిపించ లేదు, నిజంగా! చెపితే నవ్వుతారేమో కానీ, ఇదొక అవాంఛనీయమైన అవలక్షణం కూడా కావచ్చు కానీ, ప్రతి ప్రొటాగనిస్ట్‌కీ నన్ను తల్లిలా ఊహించుకుంటాను. ఇది చాలా బలమైన లక్షణం నాలో. కాఫ్కా 'మెటమార్ఫసిస్' కథలో అక్కడి బలహీన మనస్కురాలైన అమ్మను తీసేసి నేను వెళ్ళిపోయి అక్కడ ఉండాలన్నంత తీవ్రంగా! ఇలా నేను ఆలోచిస్తానని ఇప్పుడు మీ ఈ ఫీచర్‌లో ఈ ప్రశ్నకు జవాబు వెతుక్కుంటుంటేనే నాకూ తెలిసింది.

"ప్రతి ప్రొటాగనిస్ట్‌కీ నన్ను తల్లిలా ఊహించుకుంటాను"

ఏ గతకాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?



దాస్తోయెవ్‌స్కీని ఒక ప్రశ్న అడుగుతాను: నీ రచనల్లోని అంత విషాదం, దాన్ని మోస్తూ ఇంత అద్భుత విశద సృష్టి ఎలా చేశావు? లేక దాన్ని మోయలేక దింపుకుందామని రాసినవా నీ రచనలు?

ఒకప్పటికీ ఇప్పటికీ మీరు చదివే పద్ధతి ఎలా మారింది?

గత రెండేళ్లుగానే చదివే పద్ధతి మారింది. ఇప్పుడు ఒక రచయితను మొదలు పెడితే వాళ్ళ లభ్య రచనలన్నీ చదువుతున్నాను. అంతకు ముందు వరకూ కూడా ఏది కంట్లో పడితే అది ఒక క్రమ పద్ధతి లేకుండా చదివేదాన్ని. ఎక్కువ చదవటమూ జరగలేదు. బోర్హెస్ కథలు, జేమ్స్ జాయ్స్ కథలు, తమిళ రచయిత్రి శివశంకరి కథల ఇంగ్లిష్ అనువాదం... ఇలా ఏది దొరికితే అది.

బాగా నచ్చిన నాన్ ఫిక్షన్ పుస్తకం?

ఆలివర్ సాక్స్ 'ద రివర్ ఆఫ్ కాన్షస్‌నెస్'. జంతు శాస్త్రం, నాడీ శాస్త్రాలతోపాటు ఆయన అధ్యయనం చేయకుండా వదిలిపెట్టిన శాఖ లేదు. ఈ శాఖలకు ఒకదానితో మరొకదానికి కార్యకారణ సంబంధాలు ఉన్నాయని శాస్త్రీయంగా పరిశోధనచేసి, వీటన్నింటిలో ఒక ఏక సూత్రత దర్శించడం ఆయన జీవితాంతమూ చేసిన అధ్యయన లక్షణం, ఫలితం కూడా.

మిమ్మల్ని ఇరిటేట్ చేసిన పాత్రలు?

జేన్ ఆస్టిన్ 'సెన్స్ అండ్ సెన్సిబిలిటీ' నవలలో అన్నా వదినల పాత్రలు నచ్చలేదు. డబ్బు కోసం భార్య మాట విని చెల్లెళ్ళను నిరాధారంగా వదిలేసిన అన్నను, అతన్ని చాకచక్యంగా అందుకు ఒప్పించిన శకుని తెలివితేటల వదినను చూస్తే జుగుప్స కలిగింది. కాఫ్కా 'మెటమార్ఫసిస్' కథలో గ్రెగర్ చెల్లెలు గ్రెట పాత్ర కూడా చాలా ఇరిటేట్ చేసింది. పొద్దున్న లేవగానే పురుగుగా మారిపోయిన అన్న దుస్థితి పట్ల మొదట్లో జాలి సానుభూతి కలదానిలా ఉండి, కాలం గడిచేకొద్దీ అతను తన భవిష్యత్తుకు అవరోధం అవుతాడనుకోవడం మటుకే కాదు నాకు ఆమె నచ్చకపోవడానికి కారణం; ఆమె అన్నకు సహాయం చేసే విధంలో తన తండ్రికి లేని దయ, తల్లికి లేని ధైర్యం తనకు మాత్రమే ఉన్నాయనీ, వాటి వల్ల అన్నకు తను మాత్రమే ఉపయోగపడగలుగుతున్నాను అనీ ఒక కనపడని సంతోషం ఆమెలో ఉన్నది. అది నాకు నచ్చలేదు. అన్న స్థితి పట్ల బాధకంటే ఇటువంటి పరిస్థితిని నిర్వహించగల నైపుణ్యం నాకు ఉన్నది అన్నట్టు ఆమె కనిపించడం నాకు నచ్చలేదు.

మీకు తరచుగా గుర్తొచ్చే కవితా పంక్తి?

చార్లెస్ బాదిలేర్ 'ద స్వాన్' కవితకు సూరపరాజు రాధాకృష్ణమూర్తి చేసిన తెలుగు అనువాదం లోని ఈ పంక్తులు:

"ఒక నగరం, మనిషి మనసు కంటే
అయ్యో! త్వరగా వేషం మారుస్తుంది. ....
సర్వం నాకిపుడు రూపకాలు,
బండరాయి కన్నా బరువైన ఇష్ట స్మృతి చిహ్నాలు."

(పద్మజ సూరపరాజు అనువాదకురాలు, విమర్శకురాలు)

తానా నవలల పోటీ

జులై 3, 4, 5 తేదీలలో డిట్రాయిట్‌లో జరుగనున్న తానా మహాసభల సందర్భంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రెండు లక్షల బహుమతితో నిర్వహిస్తున్న నవలల పోటీలో పాల్గొనవలసిందిగా తెలుగు రచయితలను కోరుతున్నాం. నవలలు తెలుగు జీవితాన్ని ప్రతిబింబించాలి, పేజీల పరిమితి లేదు. వీలైనంతవరకు డిటిపి చేసి పంపాలి. నవలలపై రచయిత పేరు, చిరునామా ఉండకూడదు. కవరింగ్ లెటర్‌పై మాత్రమే ఉండాలి. మీ రచనలను ఏప్రిల్ 15లోగా ఈమెయిల్ tana.novel2025@gmail.comకు, లేదా పోస్టులో చిరునామా: అక్షర క్రియేటర్స్, ఎజి-2, 'ఎ' బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్, హైదర్‌గూడ, హైదరాబాద్-500029కు పంపాలి. మరిన్ని నిబంధనల వివరాలకు ఫోన్: 98493 10560.

నిరంజన్ శృంగవరపు

అలిశెట్టి పురస్కారం

తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం 2024ను కవి బెల్లి యాదయ్యకు జనవరి 12 ఉదయం కరీంనగర్ ఫిలిం భవన్‌లో ప్రదానం చేయనున్నారు. అల్లం నారాయణ, నారదాసు లక్ష్మణరావు, నలమెల భాస్కర్, కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, నగునూరి శేఖర్ తదితరులు హాజరవుతారు.

సి.వి. కుమార్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 6 జనవరి 2025

అచేతన 'అబ్కారీ'

మాదక ద్రవ్యాలపై ఎక్సైజ్ శాఖ నిఘా కరువు

- మద్యం అక్రమ రవాణాపై లేని నియంత్రణ
- పల్లెల్లో గుడుంబా కట్టడిని విస్మరించిన వైనం
- గంజాయి మత్తులో చిత్తవుతున్న యువత
- అరికట్టడంతో ఎక్సైజ్ శాఖ ఉదాసీనత
- కేవలం వైన్స్, బార్ షాపుల పర్యవేక్షణకే పరిమితం
- నివారణ బాధ్యత పోలీసులకు వదిలేసిన వైనం

7

సాదాబైనామా సమస్యకు ఇక తెర

కొత్త రెవెన్యూ చట్టంలో అవకాశం

- పెండింగ్‌లో 1.32 లక్షల దరఖాస్తులు
- దశాబ్దాలుగా కలగని మోక్షం
- కాళ్లరిగేలా తిరుగుతున్న రైతులు
- వర్తించని రైతు బంధు
- అందని పంట రుణాలు
- ధాన్యం విక్రయానికీ ఇబ్బందులే..

7

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

వరంగల్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపోసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

06, 07, 08 తేదీల్లో వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485** ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో గల మా క్లినిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కటేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.



హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో ముగ్గుల పోటీకి హాజరైన మహిళలు

ఇలపై.. విరిసెను హరివిల్లు

అట్టహాసంగా 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- అతిథులుగా హాజరైన పలురంగాల ప్రముఖులు

హనుమకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో ఆదివారం హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాల (కేడీసీ) మైదానంలో నిర్వహించిన ముగ్గులపోటీలు అట్టహాసంగా జరిగాయి. హనుమకొండ జిల్లాలోని వివిధ మండలాలతో పాటు గ్రేటర్ వరంగల్ నుంచి అధిక సంఖ్యలో తరలొచ్చిన మహిళలు.. ఇలపై హరివిల్లు విరిసిన చందంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. తమ ముగ్గుల్లో సృజనాత్మకతను, సందేశాలను వ్యక్తీకరించారు. తెలుగు వారి సంస్కృతీ, సంప్రదాయాలను తమ రంగవల్లులో ప్రతిబింబించారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద స్వయంగా ముగ్గు వేసి ఈ పోటీలను ప్రారంభించారు.



ప్రథమ విజేత మానేటి కవితకు బహుమతి అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య, 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ రాజేష్, బ్యూరోచీఫ్ రాజనారాయణ తదితరులు

అనంతరం ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ, ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ నాయకుడు గట్టు మహేష్‌బాబు, ఎన్‌సీసీ అసిస్టెంట్ డైరెక్టర్ కవితా లెనిన్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమారెడ్డి, మహిళా కాంగ్రెస్ హనుమ కొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ తదితరులు ముగ్గులను తిలకించి.. మహిళలను ప్రశంసించారు. 'ఆంధ్రజ్యోతి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొని బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో వరంగల్ 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్ ఇన్‌చార్జ్ కొల్లు రాజేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్ తడక రాజనారాయణ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్ వి.రమేష్ బాబు, ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ప్రతినిధి దొంతి నవీన్, సర్క్యులేషన్ మేనేజర్ షరీఫ్, 'ఆంధ్రజ్యోతి' వరంగల్ పీసీ ఇన్‌చార్జ్ నరేందర్, పలువురు డెస్క్ జర్నలిస్టులు, రిపోర్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రముఖ సంఘసేవకురాలు కరుకాల అనితా రెడ్డి, ఆల్ ఇండియా రేడి యో వ్యాఖ్యాత చైతన్య, వరంగల్ నగర పాలక సంస్థ అకౌంట్స్ ఆఫీసర్ సరిత వ్యవహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కో ఆర్డినేటర్ దారా దేవేందర్, కళాకారుల బృందం ప్రదర్శించిన ఆటపాట ఆకట్టుకున్నాయి.

అతిథులు, ప్రముఖులు ఏమన్నారంటే..

ముగ్గులు తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ముగ్గులో ఎన్నో అర్థాలు, పరమార్థాలు, ప్రయోజనాలున్నాయని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. నిత్యం ఇళ్ల ముంగిళ్లలో ముగ్గులు వేయడంవల్ల మహిళలకు మానసిక ప్రశాంతత లభిస్తుందని, శారీరకంగా వ్యాయామం కూడా అందుతుందున్నారు. ఈ సందర్భంగా తన చిన్నతనంలో సంక్రాంతి పండుగ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మహిళలకు ముగ్గులు వేయడానికి తీరిక దొరకడం లేదని, దీంతో సంప్రదాయానికి నేటి మహిళ దూరమవుతోందని, అలాంటి సమయంలో మన సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేలా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ తెలుగురాష్ట్రాల్లో ముగ్గుల పోటీని నిర్వహించడం అభినందనీయం అన్నారు. సంప్రదాయంగా వస్తున్న ముగ్గుల్లో మ్యాథమెటికల్ క్యాలిక్యులేషన్ ఇమిడి ఉందని, ముగ్గులు వేయడం వల్ల ప్రశాంతత చేకూరి మెదడు మరింత చురుగ్గా పని చేస్తుందని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. సంస్కృతిని కాపాడేందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ

మిగతా 8వ పేజీలో...





విజేతలు వీరే..


కడిపికొండకు చెందిన మానేటి కవిత ప్రథమ, సుబేదారికి చెందిన బీటెక్ విద్యార్థి ఒడిశాల దివ్యభారతి ద్వితీయ, ఏనుమాములకు చెందిన సునీత తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. అలాగే ఏనుమాములకు చెందిన బి.రమాదేవి హనుమకొండకు చెందిన ఎ.మానస, ఎం.సాహితీ, ఎం.శిల్ప, పోస్టల్ కాలనీకి చెందిన ఎ.శిరీష, పోచమ్మకుంటకు చెందిన వి.సంధ్య, కాశీబుగ్గకు చెందిన ఎన్.నాగేశ్వరి, రెడ్డికాలనీకి చెందిన సంగీత, సుబేదారికి చెందిన ఎన్.శ్రీమతి కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. అలాగే చిట్టి చేతులతో ముగ్గులు వేసి అలరించిన ముగ్గురు చిన్నారులు బి.హిమాన్షీ, డి.స్వాతి, ఇందుర్తి నిత్యశ్రీకి సాయిబాబా ఆలయ ట్రస్ట్ నిమ్మల శ్రీనివాస్ డిక్షనరీలను బహుమతులుగా అందచేశారు.



ప్రథమ విజేతగా నిలిచిన మానేటి కవిత, ఆమె వేసిన ముగ్గు



ద్వితీయ బహుమతి గెలుచుకున్న ముగ్గు, విజేతగా నిలిచిన ఒడిశాల దివ్యభారతి



తృతీయ విజేతగా నిలిచిన సునీత, ఆమె వేసిన ముగ్గు

రూ.15వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలా..?

- రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 2022 మే నెల 6న రైతు సంఘర్షణ సభలో రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గే సమక్షంలో వరంగల్ జిల్లాలో రేవంత్‌రెడ్డి రైతులకు ఒక ఎకరానికి రూ.15వేలు ఇస్తామని హమీ ఇచ్చి ఇప్పుడు రూ.12వేలు ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మాట తప్పిన రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఒక ఎకరానికి రూ.15వేలు రైతు భరోసా అని చెప్పి.. ఇప్పుడు రూ.12వేలు ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. రైతులను రేవంత్‌రెడ్డి బూటకపు హమీలతో మోసం చేశారన్నారు. మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల పక్షాన వరంగల్ నుంచే పోరాటాలకు సిద్ధం అవుతన్నట్లు పెద్ది తెలిపారు. ఎన్నికల్లో రైతులకు ఎన్నో హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు విస్మరించిందన్నారు. రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగకుండా రైతులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, నయీముద్దీన్, రజినీకుమార్, రవీందర్‌రావు, జానకీరాములు, పరుశురాములు, గౌస్, శ్రీధర్, చాగంటి రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షం

- జనవరి 26 నుంచి రైతుభరోసా
- 56 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం..
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- మొగిలిచర్లలో రూ.8.4 కోట్లతో 3 విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు శంకుస్థాపన



గీసుగొండ మండలం మొగిలిచర్లలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు శంకుస్థాపన చేస్తున్న భట్టి

గీసుగొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ 15వ డి విజన్ మొగిలిచర్ల శివారులో రూ.8.4 కోట్లతో నిర్మించే మూడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో భట్టి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.22వేల కోట్లతో రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసి దేశంలోనే చరిత్ర సృష్టించిందన్నారు. సాంకేతిక కారణాలతో ఇంకా రుణమాఫీ కాని రైతులకు కూడా మాఫీ చేస్తామన్నారు. మిగులు బడ్జెట్‌తో తెలంగాణను అప్పచెప్పితే 10ఏళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. లక్షలోపు రైతు రుణాలను మాఫీ చేయలేకపోయిందన్నారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు, రూ.46వేల కోట్ల బకాయిలతో బీఆర్ఎస్ తెలంగాణను అప్పుల ఊబిలోకి తీసుకుపోయిందని ఆరోపించారు. ప్రతీ నెల అప్పుల వడ్డీలకే రూ.6,500 కోట్లు చెల్లించాల్సి వస్తోందని ఆయన చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు. అన్నివర్గాల ప్రజలను ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జనవరి 26 నుంచి రైతులకు రైతు భరోసా ద్వారా యేటా రూ.12 వేలు, భూమిలేని వ్యవసాయ కూలీలకు యేటా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా రూ.12 వేలు ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు. నిరుద్యోగులకు ఇప్పటికే 56 వేల ఉద్యోగాలను కల్పించామన్నారు. రూ.5వేల కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రతీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పాఠశాలలో అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. వరికి రూ.500 బోనస్, 200 యూనిట్‌లలోపు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ వంటివి అమలు చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు మాత్రం బట్టకాల్చి మీద వేసే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు, నాయకులకు ఆయన పిలుపునిచ్చారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ..

మిగతా 8వ పేజీలో...

బంజారా సంస్కృతిని భావితరాలకు అందించాలి

- ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్
- ఘనంగా బంజారా గోత్రాల క్యాలెండర్ ఆవిష్కరణ



బంజారా గోత్రాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు

వడ్డెపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన బంజారా గోత్రాల క్యాలెండర్‌ను హనుమకొండ వడ్డెపల్లి - ఉనికిచర్ల రోడ్డులోని ప్రైవేటు సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. తొలుత బంజారాల ఆరాధ్య దైవం హతిరాం బాబా సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు వీరన్ననాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ రామచంద్రు నాయక్ మాట్లాడుతూ.. బంజారా భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకోసం తాను సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని అన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఉన్న గిరిజనులను ఒకేతాటిపైకి తీసుకొచ్చి, వారి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. హతిరాం సేవాలాల్ చూపిన మార్గం ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ జడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ గోపీసింగ్, అడిషనల్ ఎస్పీ నరేష్‌నాయక్, ఏసీపీలు నందిరాం నాయక్, పెద్దన్న కుమార్, డిప్యూటీ డ్రగ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రాంకిషన్ నాయక్, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సదర్‌లాల్ నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అర్పిత లక్ష్మణ్‌నాయక్, బానోత్ వెంకన్న నాయక్, తెలంగాణ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

• ఏర్పాట్లను పరిశీలించిన ఆర్టీసీ ఆర్ఎం, పోలీసులు



హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం, పోలీసులు

హనుమకొండ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను సోమవారం ప్రారంభించనున్నట్లు వరంగల్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. ఆదివారం బాలసముద్రంలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఏర్పాట్లను ఆర్టీసీ అధికారులు, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ ఈ కార్యక్రమానికి హజరై నూతన ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, హనుమకొండ సీఐ సతీష్, పోలీసు సిబ్బంది, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనివార్య కారణాలతో వాయిదా

హనుమకొండలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం అనివార్య కారణాలతో ఆదివారం వాయిదా పడిందని ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. మంత్రులు అందుబాటులో లేకపోవడంతో సోమవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బంగారు పుష్పాలతో సోమన్నకు పూజలు



బంగారు పుష్పాలతో స్వామి వారిని అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు

పాలకుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం బంగారు పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు దేవగిరి అనిల్‌శర్మ ఆధ్వర్యంలో 108 బంగారు పుష్పాలతో స్వామి వారిని అలంకరించి, భక్తుల దర్శనార్థం ఉంచారు. గతంలో ఈ ఆలయానికి బంగారు పుష్పాలను బహూకరించిన భక్తులు శ్రీరామ్ శెట్టి, సునిల్‌కుమార్ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటయ్య, రాములు, మధు, పూజారులు డీవీఆర్ శర్మ, నాగరాజు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కాన్వాయ్‌కి స్వల్ప ప్రమాదం

» అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన వాహనం

» ఎస్ఐ చెన్నకేశవులు, డ్రైవర్‌కు గాయాలు



చెట్లల్లోకి దూసుకెళ్లిన పోలీసు వాహనం

జనగామ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాన్వాయ్‌లో ఆదివారం అపశ్రుతి చోటు చేసుకుంది. డిప్యూటీ సీఎం వరంగల్ జిల్లా మొగిలిచెర్ల పర్యటనకు బయల్దేరారు. ఈ క్రమంలో జనగామ జిల్లా పెంబర్తి స్వాగత తోరణం వద్దకు ఆయన కాన్వాయ్ చేరుకోగానే ఎస్కార్ట్‌గా ఉన్న జనగామ ఎస్ఐ చెన్నకేశవులు వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లోని ఓ వాహనాన్ని తప్పించబోయే క్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎస్ఐ చెన్నకేశవులుకు, డ్రైవర్ సాగర్‌కు స్వల్ప గాయాలు కాగా వాహనం స్వల్పంగా దెబ్బతింది. అనంతరం వాహనాన్ని బయటికి తీశారు.

రూ.46కోట్లతో ఆస్పత్రి నిర్మిస్తాం

» త్వరలో అత్యాధునిక వైద్యసేవలు » ఎమ్మెల్యే కడియం శ్రీహరి

» కోమటిగూడెం, అక్కపల్లిగూడెం, ఇప్పగూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కోమటిగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే నియోజకవర్గ ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.46 కోట్లతో వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. కోమటిగూడెంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంను స్థల దాత పొట్లపట్టి రాంచందర్‌రావుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. అనంతరం అక్కపల్లిగూడెంలో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని ప్రారంభించారు. అలాగే రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పంచాయతీ సెక్రటరీ అవినాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి 30 ఇందిరమ్మ ఇళ్లను అందిస్తానని హామీ ఇచ్చారు. తర్వాత ఇప్పగూడెంలో రూ.75లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కడియం శంకుస్థాపన చేశారు. కడియం మాట్లాడుతూ గ్రామంలో ఘన్‌పూర్-పాలకుర్తి రోడ్డుపై సినిమా థియేటర్ వద్ద నుంచి పశువైద్యశాల వరకు నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించి సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తానని తెలిపారు. గ్రామానికి వంద ఇందిరమ్మ ఇళ్లను మంజూరి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మల్లిఖార్జునరావు, డాక్టర్ సాయిప్రణీత, ఎంపీడీవో విజయశ్రీ, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి, చిలుపూరు దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, సబ్ సెంటర్ స్థలదాత పొట్లపల్లి రాంచందర్‌రావు, మందపురం ఎల్లాగౌడ్, మంద రాజు, పల్లె రవీందర్, కడుదుల నర్సిరెడ్డి, గొడుగురాజయ్య, దాసరి రాజు, మేడిద భూపాల్, సెల్ కొమురెల్లి, పనికర సోమేష్, కొంకటి రమేష్, లింగనబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో రాజేందర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ మెకానికల్ విభాగం పరిశోధకుడు కట్ల రాజేందర్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆదివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌కు డాక్టరేట్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాజేందర్ 'మెకానికల్ క్యారెక్టరైజేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ మెటల్ మ్యాట్రిక్స్ కంపోసిట్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. వరంగల్ కిట్స్ కళాశాల ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె.ఈశ్వరయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ టూ బి యూనివర్సిటీ మెకానికల్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్‌గా, పీడీ-ఈటీపీ ఆపరేషన్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందటి వరకు కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా విధులు నిర్వహించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం బానోజీపేటకు చెందిన రాజేందర్.. అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు.

అనుమతి లేని ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకోవద్దు



విచారణ చేస్తున్న పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్

వరంగల్ మెడికల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేని ల్యాబ్‌లలో ప్రజలు ఎలాంటి రక్త పరీక్షలు చేయించుకోవద్దని టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్‌కుమార్ సూచించారు. అవసరం లేని టెస్టుల పేరుతో అసలు టెస్టులు చేయకుండానే రిపోర్టులు ఇచ్చే అవకాశం ఉందని, ఎటువంటి డాక్టర్ నిపుణుల పర్యవేక్షణ లేకుండానే పరీక్షలు చేస్తూ మోసం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశాయిపేటలోని సీకేఎం కాలేజీ గ్రౌండులో కాకతీయ హెల్త్‌కేర్ సెంటర్ పేరుతో ప్రభుత్వ అనుమతి లేకుం డా క్యాంపు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కాకతీయ హెల్త్‌కేర్ సెంటర్ ద్వారా ఇచ్చిన రిపోర్టులపై పాథాలజిస్టు డాక్టర్ సుంకరి నరేశ్‌బాబు, డాక్టర్ ప్రతిమ సంతకాలు ఉన్నట్లు తెలుసుకోగా దానికి మాకు ఎలాంటి సం బంధం లేదని డాక్టర్ నరేశ్‌బాబు తెలిపారు. ఆదివారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్‌కుమార్ తనిఖీ నిర్వహిం చగా జనగామ జిల్లాకు చెందిన ముక్క అరుణ్‌కుమార్ ల్యాబ్ టెక్నీషియన్ చదివి ఎలాంటి అనుమతి లేకుండానే కాకతీయ హెల్త్‌కేర్ సెంటర్ పేరున రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అరుణ్‌కుమార్‌పై జిల్లా వైద్యాధి కారులకు ఫిర్యాదు చేయనున్నట్లు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్‌కుమార్ తెలిపారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి



సాంబయ్య (ఫైల్)

కాజీపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఎస్సై నవీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిట్ క్యాంపస్‌లో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న హనుమకొండకు చెందిన రడం సాంబయ్య(55) శనివారం రాత్రి డ్రెయినేజీలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నవీన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంకు తరలించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిజాయితీని చాటుకున్న 108 సిబ్బంది

• రూ.4 లక్షలు, బంగారం అందించిన సిబ్బంది



బాధిత కుటుంబ సభ్యులకు నగదు, బంగారం అందిస్తున్న 108 సిబ్బంది

నెక్కొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ - నర్సంపేట ప్రధాన రహదారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు మండలం గాజులగట్టు గ్రామానికి చెందిన బీరవెల్లి నవీన్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి తన ద్విచక్ర వాహనంపై నవీన్ ఇంటికి వెళ్తుండగా నెక్కొండలోని నూతన్‌దాబా సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొంది. దీంతో నవీన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు.

108 సిబ్బంది నవీన్‌కు సంఘటన స్థలంలో ప్రథమ చికిత్స జరిపి నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, గాయాలకు గురైన నవీన్ వివరాలు తెలుసుకోవడానికి అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తెరువగా రూ.4లక్షలు, బంగారు ఆభరణాలు కనిపించాయి. ఈ విషయాన్ని నర్సంపేట ఆస్పత్రి వైద్య సిబ్బందికి తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో వైద్యుల సమక్షంలో నవీన్ భార్య, బంధువులకు 108 సిబ్బంది నగదు, బంగారు నగలు ఉన్న బ్యాగ్ అందించారు. ఈఎంటీ రాజేంద్రప్రసాద్, పైలట్ నాగరాజులను వైద్య బృందం, నవీన్ బంధువులు అభినందించారు. నవీన్ తలకు బలమైన గాయం తగలడంతో స్పృహలోకి రావడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు.

పాకాలలో పర్యాటకుల సందడి





పాకాల సరస్సులో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు, బోటింగ్ ఆర్చి వద్ద వాకీటాకీలను వినియోగిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

ఖానాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రమైన పాకాలలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఇటీవల అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటింగ్ సేవలను పర్యాటకులు వినియోగించుకుంటున్నారు. బోటుషికారు చేస్తూ సరస్సు మధ్యలో ఉన్న చిలుకలగుట్ట ప్రకృతి అందాలను తిలకిస్తూ, పాకాల తూములను వీక్షిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అటవీ శాఖ అధికారులు తగు సౌకర్యాలు కల్పించారు. అలాగే బోటింగ్ పాయింట్ వద్దకు వెళ్లేందుకు ఆకర్షణీయంగా మెట్లు, ఆర్చి నిర్మాణం చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

మడికొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మడికొండ చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై మడికొండ ఇన్‌స్పెక్టర్ పి.కిషన్ అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను భద్రంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో యువత పాల్గొని ప్రతిభ కనబర్చాలి

» రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అజీజ్‌ఖాన్ » సంగెంలో జిల్లాస్థాయి జూనియర్ కబడ్డీ క్రీడా పోటీలు





కబడ్డీ పోటీల్లో గెలుపొందిన బాలికల జట్టు, కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్

సంగెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): క్రీడా రంగంలో యువత పాల్గొని తమ ప్రతిభను కనబర్చాలని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ చెప్పారు. సంగెం మండల కేంద్రంలో వరంగల్ జిల్లా స్థాయి 16 ఏళ్ల లోపు బాలబాలికల ఐదు జోన్ల కబడ్డీ జూనియర్ స్థాయి క్రీడలు, ఎంపికలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా రంగంలో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని చెప్పారు. క్రీడలకు ప్రభుత్వం తగిన విధంగా ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను తమ అసోసియేషన్ ఆదుకుంటూ ప్రతిభను వెలికితీస్తున్నదన్నారు. కబడ్డీ అసోసియేషన్ మండల స్థాయిలో, జోన్ స్థాయిలో క్రీడలను ఏర్పాటు చేస్తూ క్రీడల్లో ప్రతిభకనబర్చిన క్రీడాకారులకు పైస్థాయి క్రీడల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా ఖాన్, కార్యదర్శి ఆకుల సారంగపాణి, జిల్లా జాయింట్ సెక్రటరీ కక్కెర్ల మల్లికార్జున్, కోశాధికారి భీమగాని ముఖర్జీ, మెట్టుపల్లి ఏలియా, సంగెం మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి, మహ్మద్ ఖాజామొయినుద్దీన్, మందాటి లక్ష్మారెడ్డి, కడిదెల కట్టస్వామి, కడారి శ్రీనివాస్, కడారి రామారావు, మాజీ మండల రైతు బంధు అధ్యక్షుడు నరహరి, సంగెం తాజా సర్పంచ్ గుండేటి బాబు, హసన్, నారాయణ, అత్తర్, రవీందర్, రవీనా, సాబీర్‌అలీ, నాగరాజు, శ్రీకాంత్‌లతో పాటు క్రీడరంగంలోని పలువురు పిఈటిలు పాల్గొన్నారు.

గెలుపొందినది వీరే..

సంగెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ జూనియర్ క్రీడలు, ఎంపికలో ప్రతిభ కనబర్చి విజయం సాధించిన జట్టులను ముఖ్య అతిథులు అభినందించి జ్ఞాపికలను అందజేశారు. బాలుర విభాగంలో వర్ధన్నపేట జోన్ ప్రథమ, ఖానాపురంజోన్ ద్వితీయస్థానం పొందగా, బాలికల విభాగంలో నర్సంపేట జోన్ ప్రథమ స్థానం, ఖానాపురం జోన్ ద్వితీయ స్థానంలో గెలుపొందారు.

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేసినట్లు ఆదివారం కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మంత్రుల పర్యటన ఉన్నందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని సూచించారు.

వరంగల్‌లో..

వరంగల్ కలెక్టరేట్: వరంగల్ కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేసినట్లు కలెక్టర్ సత్యశారద ప్రకటించారు. పరిపాలనపరమైన కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సోమవారం కాకుండా మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు రావాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగికి తీవ్రగాయాలు



గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొమ్మాలు


సంగెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖకు చెందిన ప్రైవేటు కాంట్రాక్ట్ ఉద్యోగి విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మండలంలోని రాంచంద్రాపురం గ్రామానికి చెందిన వేల్పుల కొమ్మాలు ఆదే గ్రామంలో విద్యుత్ శాఖలో హమెన్(కాంట్రాక్ట్ పద్ధతి)గా పని చేస్తున్నాడు. ఈనెల 3న లోహిత విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తు న్న గుగులోతు బాలునాయక్ తన వ్యవసాయ పొలం వద్ద కరెంటు పని ఉండటంతో కొమ్మాలును పనికోసం తీసుకవెళ్లాడు. కరెంటు పోల్‌పై వైరును బిగించే క్రమంలో విద్యుత్‌శాఖ నుంచి అనుమతులు (ఎల్‌సీ) తీసుకున్నానని బాలునాయక్ తెలిపారు. దీంతో కొమ్మాలు కరెంట్ పోల్ ఎక్కడంతో విద్యుత్ షాక్ తగిలి పోల్ నుంచి కిందపడిపోయాడు. దీంతో కొమ్మాలును చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకవెళ్లినప్పటికీ, వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, ఘటనకు కారణమైన బాలునాయక్‌పై చర్యలు తీసుకోవాలని కొమ్మాలు కుమారుడు వేల్పుల అభినయ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సంగెం ఎస్సై నరేష్ తెలిపారు.

ముగిసిన కాకతీయ వర్శిటీ ఇంటర్‌జోన్ క్రికెట్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మూడు రోజులుగా జరిగిన కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. వరంగల్ జోన్ జట్టు విజేతగా నిలవగా, ఖమ్మం జోన్ జట్టు రన్నరప్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం ఖమ్మం, వరంగల్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. అనంతరం వరంగల్ జట్టు 29.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసి విజయం సాధించింది. విజేతలకు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేఎండీసీ ప్రిన్సిపాల్ రమణారావు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉపేందర్ పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి సాధించిన వరంగల్ జట్టు



WANTED
★ Wanted Teacher & Telecallers. All Subjects to Teach Upto 7th Class Part Time/ Full Time Bheemaram, Near KUC, Hnk. Contact : 9849157056
AJW-226007

PLOT FOR SALE
★ రాఘవపూర్ (V) స్టేషన్‌ఘన్‌పూర్ (M) సర్వే.నెం.53 & 54 మేయిన్ రోడ్ వరంగల్ వైపు 299 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సం॥ప్ర॥ 8106523236
AJW-226353

WANTED TELECALLERS
★ Urgnet Requirement for ICIC, HDFC, AXIS, INDUSIND BANK'S. DSA Personal Loans Experience and fresher female Tele-Callers Salary+Incentives Job Location Hanamkonda. Contact : +91 9398286149
AJW-7635

PLOT FOR SALE
★ బిబినగర్, ఘట్‌కేసర్, షాద్‌నగర్ ఏరియాలో ప్లాట్స్ అమ్మబడును, కొనబడును. సెల్: 9505032103
AJH-002993

WANTED
★ యూట్యూబ్ చానల్ నందు పని చేయుటకు 20 మంది (Female's) కావలెను. సుబేదారి, హన్మకొండ. సం॥ప్ర॥ 8897361521
AJW-226008

ఓపెన్ ప్లాట్లు అమ్మబడును
★ జనగామ జిల్లాలో హైదరాబాద్-వరంగల్ హైవే పై జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ ఎదురుగా శ్రీ సత్యసాయి A/C కన్వెన్షన్ హాల్‌కు ఆనుకొని వున్న వెంచర్‌లో క్లియర్ టైటిల్ గల విల్లా ప్లాట్లు అమ్మబడును. సం॥ప్ర॥ 8500623123.
AJW-226350

WANTED
★ మా భారతీయ వైబ్ర్ డే-కేర్, ప్లే-స్కూల్ (నర్సరీ-2వ క్లాస్ మాత్రమే) అడ్మిషన్లు ప్రారంభమైనవి. లేడి ఇంఛార్జ్ / క్లర్క్ / అయాలు / వాచ్‌మెన్ కావలెను. భారతీయ స్కూల్, కాశిబుగ్గ, వరంగల్. సం॥ప్ర॥ 8801066232.
AJW-226409

LEASE / RENT
★ 2000 Sq godown, 1000 Sqft Chit Funds, Boutiques, Offiices, Shutter for Shops, Medical Shop etc. Near NIT, Kazipet. Contact : 9133461141
AJW-226358

సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్ వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్ లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, అర్జెంటుగా కావలెను. జీతం :12,000/-, 14,000/- 12గం॥, 8గం॥ కలవు. సం॥ప్ర॥ 9000463426,
AJW-226351

అమ్మకానికి కలదు
★ Restaurant/హోటల్ అమ్మకానికి కలదు కిట్స్ కాలేజి ప్రక్కన, ఎర్రగట్టు గుట్ట, సంప్రదించవలసిన ఫోన్ నెం : 9281474365
AJW-5758

ఉచిత కంప్యూటర్ శిక్షణ
★ UICT మహబూబాబాద్ & Wgl ఉమ్మడి జిల్లాలలో Hardware & Software నూతన సం॥ ఆఫర్ కోర్సులు ఉచిత శిక్షణ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే. సం॥ప్ర॥ 9966343485
AJW-5759

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి




హనుమకొండలో ముగ్గుల పోటీని ప్రారంభించిన కలెక్టర్ సత్యశారద, తిలకిస్తున్న మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాయిని సతీమణి నీలిమా, న్యాయ నిర్ణేతలు




ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, చిత్రంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ రాజేష్, బ్యూరో చీఫ్ రాజనారాయణ, ఏసీఎం షరీఫ్, ఆంధ్రజ్యోతి ఉద్యోగులు






ముగ్గులు వేస్తున్న వృద్ధురాలు, చిన్నారులు →

మురిసెను.. ముత్యాల ముగ్గులు..

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముగ్గుల పోటీలు

ప్రతీ ఏటా లాగే సంక్రాంతి సందర్భంగా.. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో నిర్వహించిన ముగ్గులపోటీలు వైభవంగా జరిగాయి. ఉమ్మడిజిల్లాలోని ఆరు కేంద్రాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులతో అవని మురిసింది. ఆదివారం హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లా కేంద్రాల్లో జరగ్గా.. శనివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో పోటీలు అట్టహాసంగా ముగిశాయి.



భూపాలపల్లిలో హాజరైన మహిళలు



మహబూబాబాద్‌లో మహిళలు వేసిన ముగ్గులు

శనివారం నర్సంపేటలో పోటీలకు హాజరైన మహిళలు



కేడీసీ మైదానంలో ముగ్గుల పోటీ సందర్భంగా పాటలు పాడుతున్న సాంస్కృతిక సారథి కళాకారుల బృందం

ఆంధ్రజ్యోతి
ABN
యవ్వనపు చర్మ రహస్యం
SANTOOR
Skin Moisturising
Sandal & Turmeric
సెల్సియా
BRA - PANTIES - SLIPS & LEGGINGS
TRADE ENQUIRY : 93445 53675
ఎటువంటి పంటలకైనా
క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్
సేంద్రియ సాగు - అధిక దిగుబడి






జనగామలో ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా దంపతులు | భూపాలపల్లిలో ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు | మహబూబాబాద్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్ | ములుగులో ముగ్గులను తిలకిస్తున్న అతిథులు

ధార్మిక భవన్ పేరు మార్పు

రాత్రికి రాత్రే మారిన బోర్డు » వివాదం సృష్టించే యత్నం

హనుమకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా కొత్తగా నిర్మించిన ధార్మిక భవన్ పేరు ఆగమేఘాల మీద మారింది. ధార్మిక భవన్ పేరును అలానే ఉంచి.. పైన సమ్మక్క, సారలమ్మ పేరును తగిలించారు. కింద దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్, తెలంగాణ.. అని రాశారు. ఇంత హఠాత్తుగా ధార్మిక భవన్ పేరును మార్చడం వెనుక అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. పేరు మార్పునకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడినట్టు సమాచారం లేదు. ఈ మార్పు వెనుక ఒక ఉన్నతాధికారి హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, ధార్మిక భవన్‌పై కొంత కాలంగా వివాదం నడుస్తోంది. భద్రకాళి ఆలయం చుట్టూరా మాడవీధుల నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఈ ఆలయం ఆవరణలోని వేదపాఠశాల భవనం కూల్చివేతకు గురవుతోంది. దీనితో ఇందులో చదువుకుంటున్న వేద విద్యార్థులకు నెలవు లేకుండా పోయింది. దీనితో ఈ వేదపాఠశాలను ఈ ధార్మిక భవన్‌లోకి తాత్కాలికంగా మార్చారు. ఇది ఇష్టం లేని ఓ అధికారి.. లేని వివాదాన్ని సృష్టించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆయన ప్రోద్బలం మేరకే సమ్మక్క - సారలమ్మ పూజారులు ధార్మిక భవన్ స్థలం తమదని, అందులో నిర్మించిన భవనం తమకే చెందాలన్న కొత్త డిమాండ్‌ను తెరమీదికి తీసుకువచ్చారు. అప్పట్లో కొద్ది రోజులు దీనిపై వివాదాలు నడిచాయి. ఆ తర్వాత ఈ వివాదం సద్దు మణిగింది. వేద పాఠశాలను తాత్కాలికంగా ఇందులో మార్చారు. పాఠశాల ప్రస్తుతం ఇందులోనే నడుస్తోంది. ఇప్పుడు ఉన్నట్టు ఉండి ధార్మిక భవన్ పేరును సమ్మక్క సారలమ్మ ధార్మిక భవన్‌గా మార్చడం మళ్లీ ఈ వివాదాన్ని తెరమీదికి తీసుకువచ్చే కుట్రలో భాగమేననే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ ధార్మిక భవనాన్ని భద్రకాళి దేవాలయం, రామలింగేశ్వరాలయం నిధులతో కట్టారు. ఈ రెండు దేవాలయాల నుంచి రూ.1.50కోట్ల చొప్పున వెచ్చించారు.



ధార్మిక భవన్ పేరును సమ్మక్క సారలమ్మ భవన్‌గా మార్చిన దృశ్యం

సాదాబైనామా సమస్యకు తెర

హనుమకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా నలుగుతున్న సాదాబైనామా భూముల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించనున్నది. రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్తగా భూభారతి-2024ను తీసుకు వస్తుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తెల్ల కాగితాలపై క్రయవిక్రయాల ఒప్పందం రాసుకుని భూములు కొనుగోలు చేసిన రైతుల సమస్యల పరిష్కారానికి మోక్షం లభించనున్నది. నూతన ఆర్‌వోఆర్ చట్టం ద్వారా కొన్ని సవరణలు చేసి ధరణి స్థానంలో భూభారతిని తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది తెలిసిందే. భూభారతి బిల్లులో 2014 జూన్ 2కు ముందు తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన భూములన్నింటినీ క్రమబద్ధీకరించేందుకు ఆర్‌వోఆర్ చట్టం సవరించారు.

» కొత్త రెవెన్యూ చట్టంలో అవకాశం
» పెండింగ్‌లో 1.32 లక్షల దరఖాస్తులు
» దశాబ్దాలుగా కలగని మోక్షం
» కాళ్లరిగేలా తిరుగుతున్న రైతులు



తెలిసో తెలియకో..

తెలిసో తెలియకో తెల్లకాగితంపై ఒప్పందం చేసుకొని (సాదాబైనామా) భూములు కొనుగోలు చేసినవారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టే కనిపించినా.. ఆచరణలో ఎక్కడా కనిపించలేదు. తెల్లకాగితాలపై విక్రయ ఒప్పందాలు రాసుకున్న వ్యవసాయ భూముల క్రమబద్ధీకరణకు ఎడతెగని నిరీక్షణ తప్పడం లేదు. వీటికి భూ హక్కుల చట్టబద్ధత ప్రశ్నార్థకంగా మారింది. 2014 జూన్ 2 కంటే ముందు సాదాబైనామా కింద కొనుగోలు చేసిన భూములకు పట్టా హక్కులు పంపిణీ చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. సాదాబైనామా కింద కొనుగోలు చేసిన భూములకు చట్టబద్ధత కోసం 2020 నవంబర్ 10 వరకు గడువు విధించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,32,715 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 36,850, అత్యల్పంగా హనుమకొండ జిల్లాలో 16,650 నమోదయ్యాయి. 2016లో తొలిసారిగా అవకాశం కల్పించడంతో కొంత మంది రైతులు లబ్ధి పొందారు. ఆ తర్వాత దీనిని అటకెక్కించింది.

దీర్ఘకాలిక సమస్య

సాదాబైనామా దీర్ఘకాలిక సమస్య. సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణకు వెల్లువలా వచ్చిన దరఖాస్తులే ఇందుకు ఉదాహరణ. తెలంగాణకే పరిమితమైన ఈ సమస్యను సమైక్యాంధ్ర పాలకులు పట్టించుకోలేదు. నాడు కోనేరు రంగారావు కమిటీ (కేఆర్ఆర్) చేసిన సిఫార్సులనూ విస్మరించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగింది. భూ రికార్డుల యాజమాన్య హక్కుల (ఆర్‌వోఆర్) చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం లేకపోవడంతో 1971 ఆర్‌వోఆర్ చట్టంలోని క్లాజ్‌లను చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. నూతన రెవెన్యూ చట్టంలో క్రమబద్ధీకరణకు సంబంధించి విధివిధానాలు ఖరారు చేయలేదు. భూ హక్కులు పొందేందుకు వివిధ ఆంక్షలు బాధితులకు శరాఘాతంగా మారాయి.

నాలుగేళ్ల కిందట..

నాలుగేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం తొలిసారిగా సాదాబైనామాల క్రమబద్ధీకరణ భాగంగా ఐదెకరాల్లోపు వ్యవసాయ భూములకు ఉచితంగా తహసీల్దార్ కార్యాలయంలో పట్టా మార్పిడి ప్రక్రియ చేపట్టింది. స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములు అప్పట్లో తీసుకోలేదు. ఐదెకరాల కంటే అధిక విస్తీర్ణం ఉన్న భూములకు నిబంధనల మేరకు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము వసూలు చేశారు. అప్పుడు కొంత మేరకు సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ జరిగింది. అయితే చాలామంది రైతులు అవగాహన లేక, ఇతరత్రా కారణాల వల్ల ఈ అవకాశాన్ని వినియోగించుకోలేక పోయారు. దరఖాస్తులను సరైన విధంగా సమర్పించకపోవడంవల్ల సాంకేతిక కారణాలతో తిరస్కారానికి గురయ్యాయి. రెండేళ్ల కిందట మరోమారు తెల్లకాగితంపై రాసుకున్న భూక్రయవిక్రయాలకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించి దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియ అనూహ్యంగా నిలిచిపోవడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వ నుంచి మార్గదర్శకాలు అందలేదని, అందువల్లే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టామని అధికారులు చెప్పుకొచ్చారు.

ఇబ్బందులు

రైతులు తాము సాగు చేస్తున్న భూములు తమవే అయినా దాదాపు 50 నుంచి 60 శాతం మంది ఆ భూములు క్రమబద్ధీకరణ కాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు. రైతు బంధు కింద సాయం కూడా అందడంలేదు. ధాన్యం విక్రయం సందర్భంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల కిందట కొనుగోలు చేసిన భూములు ఆన్‌లైన్‌లో సదరు పట్టాదారు పేరిట కొనసాగుతున్నాయి. యాజమాన్య హక్కుల మార్పిడి జరగకపోవడంతో పాత యజమానుల వారసులు ధరణి పోర్టల్‌లోని సమాచారం ఆధారంగా భూములను విక్రయించే ప్రమాదం ఏర్పడింది. ఈ వెసులుబాటుతోనే రికార్డుల్లో పేర్లు మారుతున్నాయని బాధితులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

చేతివాటం

గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను కొన్ని ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు మీ సేవ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరిశీలించారు. అదే అదనుగా విధుల నుంచి తొలగించిన కొందరు అధికారులు రహస్యంగా పరిశీలిస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావడంతో సాదాబైనామా క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిగా నిలిపివేశారు.

సాదాబైనామా అంటే..

సాదాబైనామా అంటే తెల్లకాగితంపై భూమి కొనుగోలు లేదా రిజిస్టర్ కాని క్రయవిక్రయాలను సాదాబైనామా అంటారు. రిజిస్ట్రేషన్ కాని ఏ భూలావాదేవీ కూడా కేవలం తెల్ల కాగితాల ద్వారా జరిగితే అది సాదాబైనామా కొనుగోలే అవుతుంది. రిజిస్ట్రేషన్ కానీ కొనుగోలుపై ఏదైనా పట్టా పొందాలంటే వాటిని రెగ్యులరైజేషన్ చేయించుకోవడం, లేదా రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పట్టా వస్తుంది. బాండ్ పేపర్ మీద లేదా స్టాంపు పేపర్ మీద భూమి కొనుగోలు చేసినా లేదా వాటిని నోటరీ చేయించుకున్నా సరే రిజిస్టర్ కాని కొనుగోలు కిందకే వస్తుంది. సులభంగా చెప్పాలంటే భూ అమ్మకాలు తెల్ల కాగితంపై రాసుకునే ఒక ఒప్పంద పత్రమే సాదాబైనామా.

అచేతన అబ్కారీ

- మాదక ద్రవ్యాలపై ఎక్సైజ్ శాఖ నిఘా కరువు
- మద్యం అక్రమ రవాణాపై లేని నియంత్రణ
- పల్లెల్లో గుడుంబా కట్టడిని విస్మరించిన వైనం
- గంజాయి మత్తులో చిత్తవుతున్న యువత
- అరికట్టడంతో ఎక్సైజ్ శాఖ ఉదాసీనత
- కేవలం వైన్స్, బార్ షాపుల పర్యవేక్షణకే పరిమితం

వరంగల్ క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు నిత్యం నిఘా పెట్టి అంకితభావంతో పనిచేయాల్సిన అబ్కారీ శాఖ అధికారులు నియంత్రణ విస్మరించినట్లు కనిపిస్తోంది. గంజాయి, డ్రగ్స్, గుడుంబా, అక్రమ మద్యం రవాణాను అడ్డుకట్టవేయాల్సిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ.. ఆ విధులను గాలికొదిలేసి కేవలం వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌ల పర్యవేక్షణకు పరిమితమైనట్లుగా తెలుస్తోంది. ఆ పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగా ఉంటోందనే విమర్శలున్నాయి. ఎవరైనా బాధితులు మద్యం షాపులపై ఫిర్యాదు చేసినప్పుడే మాత్రమే అడుగు బయటికి వేస్తున్నారని, లేదంటే ఆఫీసులను అంటిపెట్టుకొని ఉంటున్నారని అంటున్నారు. ఇక లేదంటే ఫీల్డ్ పేరిట వ్యక్తిగత పనులపై బయట బిజీగా గడుపుతున్నారని సంబంధిత శాఖలోనే ఈ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఉత్సవ విగ్రహాలుగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతీ జిల్లాలో ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, టాస్క్‌ఫోర్స్ బృందం, పోలీస్‌స్టేషన్‌లు ఉండగా, ఆరు జిల్లాలకు కలిపి మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేకంగా ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్సైలు, సిబ్బందితో ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ పనిచేస్తున్నాయి. అయితే ఈ అధికారులు ఉత్సవ విగ్రహాలుగా ఉంటారే కానీ.. గంజాయి, ఇతర డ్రగ్స్ కట్టడికి ఏం చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్ - ఒరిస్సా సరిహద్దులోని పాడేరు నుంచి వస్తున్న గంజాయి రవాణాను ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దులోని నిలువరించాల్సిన ఎక్సైజ్ పోలీసులు.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. దీంతో గంజాయి నగరంలో గల్లీ గల్లీకి విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల పాన్‌షాపుల్లో కిల్లీలాగా చాక్లెట్స్ రూపంలో గంజాయి లభిస్తోంది. వీటిబారిన యువత పడి గంజాయి మత్తులో జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు.

అడపా దడపా కేసులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖిలావరంగల్, కాజీపేట, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, మహబూబాబాద్, తొర్రూరు, గూడూరు, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట, కాటారం, భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ కలిపి మొత్తం 17 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ఆడపాదడపా గంజాయిని పట్టుకొని మొక్కుబడిగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే అపవాదు ఎక్సైజ్ సిబ్బందిపై ఉంది. కేవలం ఏ4, బార్‌అండ్ రెస్టారెంట్‌ల తనిఖీలకే ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ పరిమితమైపోతోందని ప్రచారంలో ఉంది. రైల్వే మార్గాలు ఉన్న సంబంధిత ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సైతం ఎన్‌డీపీఎస్, ఎన్‌డీపీఎల్‌పై దృష్టిసారించకపోవడంతో అక్రమ రవాణా విచ్చ లవిడిగా గంజాయి, ఇతర రాష్ట్రాల మద్యం లభ్యమవుతోంది.



పోలీసులే పట్టుకుంటున్నారు..

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు మిగతా జిల్లాల్లో పోలీసులు పెద్ద మొత్తంలో గంజాయి, అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకుంటున్నారు. పట్టుబడ్డ మద్యాన్ని గంజాయిని సీజ్ చేస్తున్నారు. అయితే మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యాన్ని నిషేధించడానికే ప్రత్యేకంగా ఏర్పడ్డ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ.. ఆశించిన స్థాయిలో పనిచేయకుండా కేవలం లైసెన్స్‌డ్ షాపులైన ఏ4, బార్ అండ్ రెస్టారెంట్లలో మొక్కుబడి తనిఖీలకు పరిమితమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్క వరంగల్ పోలీస్ కమిషనరేట్ (హనుమకొండ, వరంగల్, జనగామ)పరిధిలోనే లా అండ్ ఆర్డర్ పోలీసులు 1,336 కిలోల గంజాయిని పట్టుకొని, 133 కేసులు నమోదు చేసి, 289 మందిని అరెస్టు చేసి రూ.2,45,87,601 విలువ గల గంజాయిని సీజ్‌చేయగా, ఏర్పాటైన ఏడాది కాలంలోనే తక్కువ సిబ్బందితో ఉన్న వరంగల్ నార్కోటిక్ పోలీసులు ఉమ్మడి జిల్లాలో 70 కేసులు నమోదు చేసి సుమారు రూ.6 కోట్ల గంజాయిని సీజ్ చేశారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేసే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కేవలం 101 కిలోల గంజాయిని పట్టుకొని 4 కేసులు నమోదు చేయడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. జిల్లాల వారీగా ఉన్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లలో సైతం అదే విధంగా ఉంది. ఎన్‌డీపీఎల్ (సుంకం చెల్లించని) మద్యం విషయంలో అయితే ఎక్సైజ్ పోలీసులు పూర్తిగా విఫలమైనట్లుగా అర్థమైపోతోంది. ఈ ఏడాదిలో ఎన్‌డీపీఎల్ మద్యం విషయంలో ఒక కేసు నమోదు చేసి 30 లీటర్ల మద్యాన్ని వరంగల్ రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెల్లడించగా, అలాంటిదేమీ లేదు.. పట్టుకుంటే తమకు సమాచారం ఇవ్వాల్సిందేనని హనుమకొండ జిల్లా ఎక్సైజ్ పోలీసులు అంటున్నారు. రెండు శాఖల మధ్య ఎలాంటి పొంతనలేకుండా ఉండటంతో అసలు ఎన్‌డీపీఎల్ మద్యం పట్టుకున్నారా..? లేదా..? పట్టుకుంటే మద్యం ఏమైనట్లు అనే విమర్శలు ఎదురవుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యంతో పాటు ఆర్మీ, నేవీ మద్యాన్ని గ్రేటర్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తుండగా, అబ్కారీ అధికారులు నిఘా పెట్టడం విస్మరించారు.

విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు

గ్రేటర్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా గంజాయి రవాణా చేస్తూ, సేవిస్తూ లా అండ్ ఆర్డర్ పోలీసులకు వందల సంఖ్యలో పట్టుబడుతున్నారు. కానీ ఎక్సైజ్ పోలీసుల మాత్రం తనిఖీల జోలికి వెళ్లకుండా మౌనంగా ఉండిపోతున్నారు. నగరంలో గంజాయి సేవించేందుకు ప్రత్యేకంగా అద్దెరూమ్‌లు తీసుకొని అర్ధరాత్రి 1గంట తర్వాత యువత ఇంటికి వెళ్తున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల ఏకంగా ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతూ కమిషనరేట్ యాంటీ డ్రగ్స్ పోలీసులకు పట్టుపడటం కలకలం రేపింది. గతంలో గంజాయి బానిసలుగా మారిన యువత, వారి తల్లిదండ్రులతో కమిషనరేట్ పోలీసుల సమావేశం ఏర్పాటు చేయగా, వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు గంజాయికి వ్యసనంగా మారిన ఘటనలు చూశాం. ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ కట్టడికి మొదటి బాధ్యులైన ఎక్సైజ్ పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంపై పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లాల్లో గుడుంబా విక్రయాలు, బెల్లం రవాణా పూర్తిగా తగ్గిపోయిందని చెబుతున్న ఎక్సైజ్ పోలీసులు.. తాజాగా కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నెక్కొండ రైల్వేస్టేషన్‌లో రూ.1,82,000 విలువ చేసే బెల్లం, పటికను స్వాధీనం చేసుకోవడంపై ఏం సమాధానం చెబుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గంజాయి నివారణ కోసం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టడం లేదని స్పష్టంగా తెలుస్తోంది.

వేమన భగవాన్ వేడుకల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పట్టణంలో ఈనెల 19వ తేదీన జరిగే వేమన జయంతి వేడుకల ఆహ్వాన పత్రికలను ఆదివారం హనుమకొండలోని ఏకశిల రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో త్రైథ సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇంది జ్ఞానవేదిక జమ్మికుంట కమిటీ అధ్యక్షుడు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏకశిల రెడ్డి సంక్షేమసంఘం అధ్యక్షుడు వేమన భగవాన్, రాధిక, శశికాంత్, దివ్య, రాజు, భార్గవి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

'చైనా మాంజా వినియోగిస్తే చర్యలు'

వరంగల్ క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నిషేధించిన చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో యువకులు పతంగులను ఎగురవేసేందుకు చైనా మాంజాలను వినియోగించడం ద్వారా మనుషులతో పాటు పక్షులకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పర్యావరణ విపత్తుతో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చైనా మాంజాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు.

ఇలపై.. విరిసెను హరివిల్లు



ఎంపీ కడియం కావ్య



కలెక్టర్ సత్యశారద



సీపీ అంబర్‌కిషోర్ ఝా



మేయర్ సుధారాణి



నాయిని నీలిమారెడ్డి

(5వ పేజీ తరువాయి)

ముగ్గులు వేసిన ఇల్లు పరిశుభ్రంగా కళకళలాడుతూ కనిపిస్తుందన్నారు. పల్లెల్లో ప్రతీ ఇంటి ముందు ఇప్పటికీ మహిళలు ఎంతో అందంగా ముగ్గులు వేస్తుంటారని, కానీ మారిన కాలనమాన పరిస్థితుల వల్ల పట్టణాల్లో అంతగా కనిపించడం లేదన్నారు. సంప్రదాయాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతీ మహిళ మీద ఉందని, ఆ లక్ష్యంతో ముగ్గుల పోటీని నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కృషి అభినందనీయమన్నారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా మాట్లాడుతూ ముగ్గుల్లో వాడే రంగుల్లాగానే మహిళల జీవితాలు కూడా కళకళలాడుతూ ఉండాలని ఆకాంక్షించారు. ముగ్గుల సంస్కృతిలో ఒక విశిష్టత, ఔన్నత్యం దాగి ఉందన్నారు. పోటీలో పాల్గొన్న మహిళలు ఒక్కో ముగ్గులో ఒక్కో అంశాన్ని ఇతివృత్తంగా తీసుకోవడం అభినందనీయం అన్నారు. తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ముగ్గుల సంప్రదాయం.. కాలం మారుతుండడంతో క్రమంగా కనుమరగవుతోందని, తెలుగువారికే ప్రత్యేకమైన ఈ సంప్రదాయాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతీ మహిళపై ఉందని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ నాయకుడు గట్టు మహేశ్‌బాబు మాట్లాడుతూ సంస్కృతి కనుమరుగు కాకుండా కాపాడాల్సిన బాధ్యతఅందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమా రెడ్డి మాట్లాడుతూ ముగ్గులు వేయడమంటే చిన్నతనం నుంచి తనకు ఎంతో ఇష్టమన్నారు.





ముగ్గులను తిలకిస్తున్న మురుగన్ యాడ్స్ రవీంద్రనాథ్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్ర శర్మ, ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ నాయకుడు గట్టు మహేశ్‌బాబు, సాయిబాబా ఆలయ ట్రస్టీ నిమ్మల శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి డెస్క్ జర్నలిస్టులు

ముగ్గుల్లో మహిళల సృజనాత్మకత, కళాత్మకత, వారి అంతరంగం కనిపిస్తుందని అన్నారు. 'ఆంధ్రజ్యోతి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు మాట్లాడుతూ మన ప్రాచీన సంప్రదాయం అయిన ముగ్గులను ప్రోత్సహించడం ద్వారా తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సంక్రాంతికి ముందు ముగ్గుల పోటీని నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీలో పాల్గొనేందుకు మహిళలు, పిల్లలు సైతం పెద్దసంఖ్యలో రావడం హర్షణీయం అన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్ ఇన్‌చార్జ్ రాజేష్, బ్యూరో చీఫ్ రాజనారాయణ మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని భావితరాలు అందిపుచ్చుకునేందుకు వీలుగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ప్రతీఏటా ముగ్గుల పోటీని నిర్వహిస్తోందని, లోగిళ్లను నిత్యం కళకళలాడేట్టు ఉంచే ముగ్గుల సంస్కృతిని కలకాలం కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోటీలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలకు అభినందనలు తెలిపారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

క్రమం తప్పకుండా పాల్గొంటున్నా..

మానేటి కవిత, మడికొండ ప్రథమ బహుమతి విజేత

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముగ్గుల పోటీలో యేటా క్రమం తప్పకుండా పాల్గొంటున్నాను. అదే ఉత్సాహంతో ఈసారి కూడా పాల్గొన్నాను. నా ముగ్గుకు ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉంది. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ యాజమాన్యం ఏటా ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయం.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఆంధ్రజ్యోతి విలేకరుల బృందం





ద్వితీయ, తృతీయ బహుమతి అందుకుంటున్న దివ్యభారతి, సునీత

రెండో బహుమతి రావడం సంతోషం

ఒడిశాల దివ్యభారతి, సుబేదారి, ద్వితీయ బహుమతి విజేత

ప్రస్తుతం నేను బీటెక్ చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి ముగ్గులు వేయడం ఇష్టం. ఇంట్లోకూడా తీరిక సమయాల్లో రకరకాల డిజైన్లలో ముగ్గులు వేయడాన్ని ప్రాక్టీస్ చేస్తాను. అదే ఉత్సాహంతో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలో పాల్గొన్నాను. ద్వితీయ బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. పోటీలు నిర్వహించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు

పోటీల్లో పాల్గొడం మొదటిసారి

సునీత, ఏనుమాముల, తృతీయ బహుమతి విజేత

నేను గృహిణిని. ముగ్గులు వేయడం అంటే చాలా ఇష్టం. రోజు నా ఇంటి ముందు రకరకాల ముగ్గులు వేస్తుంటాను. కొత్త కొత్త ముగ్గులను రూపొందిస్తుంటాను. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నది తెలిసి మొదటిసారిగా పాల్గొన్నాను. నా ముగ్గుకు తృతీయ బహుమతి రావడం ఆనందంగా ఉంది.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఆంధ్రజ్యోతి బృందం

రెడ్డి సంఘం నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



రెడ్డి సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు

మడికొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మడికొండ రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రెడ్డి సంఘం నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని సంఘం క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. రెడ్డి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తరించి రెడ్డి సామాజిక వర్గంలోని అవసరార్థులకు, పేదలకు చేయూతనందించి ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, సంఘ సభ్యులు హనుమారెడ్డి, చాడ సునీల్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, పద్మనాభరెడ్డి, వసుంధర, సత్యనారాయణరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, రాధికారెడ్డి, స్వాతి రెడ్డి, రాంగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



వరంగల్ ఉర్సుగుట్ట ఎంజేపీ హాస్టల్‌లో వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని ఎంజేపీ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందో లేదో పరిశీలించారు. కిచెన్, సరుకులు నిలువ ఉంచే గదులను ఆమె నిశితంగా పరిశీలించారు. బియ్యం శుద్ధి చేసే యంత్రం, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ఏక్షణంలోనైనా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పరిశుభ్ర వాతావరణంలో అందించాలని ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, బీసీ సంక్షేమాధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

హసన్‌పర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు వెలగందుల భీష్మనాథం అన్నారు. మండలకేంద్రంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కొనిశెట్టి మునీందర్ ఎన్నికల పరిశీలకులుగా హాజరై నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా వెలగందుల భీష్మనాథం, ప్రధాన కార్యదర్శిగా చిదర కరమ్‌చంద్, కోశాధికారిగా మంచెన శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా గౌరిశెట్టి వెంకటేశ్వర్లు, చిదర భాస్కర్, సహాయ కార్యదర్శులుగా అనుగం సతీష్, చిందర రఘు, కార్యవర్గ సభ్యులుగా గౌరిశెట్టి విజయ్, కట్కూరి కిశోర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా చకిలం రాజేశ్వర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగమల్ల సుధీర్, అప్పని శంకర్, చకిలం చంద్రశేఖర్, సంద్రు నాగేందర్, సంద్రు నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన రాష్ట్ర నాయకుడు వంశీ

హసన్‌పర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును ఆదివారం పెంబర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సౌరం వంశీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



మాజీ మంత్రి కేటీఆర్‌కు బొకే అందజేస్తున్న రాష్ట్ర నాయకుడు సౌరం వంశీ

ఉపముఖ్యమంత్రికి సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆదివారం జిల్లాకు వచ్చిన భట్టిని కలిసిన ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ వినతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి.షఫీ, డి.శ్రీధర్, జ్యోతి, అర్చన, కుమారస్వామి, రఘు తదితరులు పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ దివ్యాంగుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని దివ్యాంగుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇటీవలి బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన కార్యవర్గ సభ్యుల స్థానంలో నూతన సభ్యులను నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి.వాసుదేవరెడ్డి, కోశాధికారిగా బొప్ప ఉమారాణి, ప్రచార కార్యదర్శిగా ఆకవరపు స్వరూప,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మిట్టపెల్లి శివాజీతో పాటు ఎ.రమేష్, బి.తిరుమలేష్‌లను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కొల్లు నర్సమ్మ, బోనగిరి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కడుదుల సోమన్న, నాయకులు ఆర్.రవీందర్, ఫసియుద్దీన్, రాజమౌళి, రాజేంద్రం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిల్ల మహేందర్

ఘనంగా అనాథ పిల్లల జన్మదిన వేడుకలు

హసన్‌పర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బాల వికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అనాథ పిల్లల జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాల వికాస ప్రోగ్రామ్ ఆఫీసర్ లతాప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అనాథ పిల్లల జన్మదిన వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు లేని పిల్లలు జన్మదిన వేడుకలు జరుపుకోవడంలోనే నిజమైన సంతోషం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రామయ్య, సంపత్, బాల వికాస కోఆర్డినేటర్లు బి.రమ, ఎ.శోభ, జి.మహేశ్వరి, పి.పద్మ, జె.రూపా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కాజీపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రహ్మత్‌నగర్ సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో ఆదివారం 20 సంవత్సరాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థి విజయ్ కుమార్ పాఠశాల అభివృద్ధికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ సాంటోస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

జూలైవాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెడ్డి బిడ్డ పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం పోస్టల్ కాలనీలోని రెడ్డి సంఘం కార్యాలయంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోపు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రెడ్డి బిడ్డ పత్రిక ద్వారా రెడ్ల సమస్యలను, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పాఠక లోకానికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కామిడి సతీష్‌రెడ్డి, నల్ల రాజిరెడ్డి, గణపతిరెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, పాపిరెడ్డి, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, సమ్మిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భీమారంలో రక్తదాన శిబిరం

కేయూ క్యాంపస్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ భీమారంలోని డైమండ్ పబ్లిక్ స్కూల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ నేతృత్వంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కానుగంటి నిర్మల నేతృత్వంలో 60 మంది రక్తదానం చేశారు. డైమండ్ స్కూల్ యాజమాన్యం బందు వెంకట్, యాట మహిపాల్‌రెడ్డి, ముప్పిడి జగదీశ్వర్, సాదం కనకరాజులు రక్తదానం చేశారు సేకరించిన రక్తాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో కానుగంటి సుభాష్, డిస్ట్రిక్టు లయో చైర్మన్ లయన్ కె.కోటిలింగం, సెక్రటరీ లయన్ కనకరాజు, లయన్ మనోహర్, రెడ్‌క్రాస్, విద్యాన్ కళాశాల అధ్యాపకులు, డైమండ్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరుకాపులు స్వయం కృషితో ఎదగాలి

వడ్డెపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులు స్వయం కృషితో ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధి, తహసీల్దార్ బాసెట్టి హరిప్రసాద్ పటేల్ అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ వికాస్ నగర్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్నూరు కాపులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని కోరారు. అనంతరం మున్నూరు కాపు సంక్షేమ సంఘం వికాస్ నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నురుకాపు సంక్షేమ సంఘం వికాస్ నగర్ అధ్యక్షుడు బాసెట్టి మల్లయ్య పటేల్, అల్లం మల్లికా ర్జున్ పాల్గొన్నారు.



వికాస్‌నగర్‌లో మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షం

(5వ పేజీ తరువాయి)

పరకాల నియోజకవర్గంలో ఉపాధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో రూ.100కోట్లతో రోడ్లు నిర్మించామన్నారు. సంగెం, దామెరలో మినీ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరులోపు మెగా జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. పరకాల మునిసిపాలిటీ అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.24కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. గత ఎమ్మెల్యే కాంట్రాక్టులు, స్వలాభం కోసం పనులు చేస్తే.. తాను ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో రూ.294 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా గుర్తించినందుకు, అడగగానే విద్యుత్ సబ్‌స్టేషన్‌లను మంజూరు చేసినందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు ఎమ్మెల్యే రేవూరి కృతజ్ఞతలు తెలిపారు.

వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. అందులో భాగంగానే వరంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రూ.6వేల కోట్ల మంజూరు చేశారన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణాలు త్వరలో జరుగబోతున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్, నెహ్రూనాయక్, ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ విప్ రామచంద్రు, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, సీఎండీ వరుణ్‌రెడ్డి, సీపీ అంబర్‌కిషోర్ ఝా, కలెక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, దొమ్మాటి సాంబయ్య, తహసీల్దార్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా రవికృష్ణ గౌడ్



వడ్డెపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లి ప్రాంతంలోని ప్రశాంత్ నగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా బైరి రవికృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వాసం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పత్తి సంపత్‌రెడ్డి, జాయింట్‌సెక్రటరీగా మిడిదొడ్డి సురేష్‌కుమార్, కోశాధికారిగా బయ్య అశోక్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఆరెల్లి శ్రీనివాస్, దండ కోమల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవికృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. కాలనీ వాసుల సహకారంతో ప్రశాంత్ నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మల్లారెడ్డిపల్లి వంతెన నిర్మాణం పూర్తి చేయాలి


▸▸ ఉప ముఖ్యమంత్రిని కలిసిన రెండు గ్రామాల రైతులు

హసన్‌పర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సూదన్‌పల్లి - మల్లారెడ్డిపల్లి గ్రామాల వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇరు గ్రామాల రైతులు ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా సూదన్‌పల్లి-మల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అసంపూర్తిగా నిర్మించిన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి ఇరు గ్రామాల రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు.

వినతి పత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైర్మెన్ తంగెళ్లపల్లి తిరుపతితో పాటు సూదన్‌పల్లి, మల్లారెడ్డిపల్లి రైతులు ఉన్నారు.



ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు



నవ్య

కుటుంబ కదంబం

ఇంటి యజమాని మద్యానికి బానిసైతే
ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం..
అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్ళు అనుభవించారు
చెన్నైకి చెందిన **భాను సురేష్‌బాబు.** కష్టనష్టాలు
భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను
మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా
అనుభవించకూడదనే ఆలోచనతో...
డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి...
వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు.
స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం
గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్థోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సిలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

చికిత్స ఎలా ఉంటుందంటే...

ఇష్టపూర్వకంగా వచ్చిన వారికి మాత్రమే మేము చికిత్స చేస్తాం. ఆ మేరకు వాళ్ల ఒప్పందంపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. ముందుగా వారి మానసిక స్థితిని అంచనా వేస్తాం. కౌన్సెలింగ్ తీసుకోవడానికి మనస్ఫూర్తిగా అంగీకరించినవారిని మాత్రమే చేర్చుకుంటాం. వారికి 25 నుంచి 30 రోజుల చికిత్స ఉంటుంది. రోజూ ఉదయాన్నే 'కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ' ఇస్తాం. ఆనందకర క్షణాల్లో తాగడం, బాధాకర సమయాల్లో తాగడం, డిప్రెషన్‌లో తాగడం, ఒత్తిడిని జయించేకోసమంటూ తాగడం లాంటి అంశాలను వారితో చర్చిస్తాం. మధ్యాహ్నం వాటికి అనుబంధమైన ఒక యాక్టివిటీ జరుగుతుంది. తరువాత గ్రూప్ థెరపీ వుంటుంది. ఆ థెరపీలో వారంతా మనసులోని మాటను బయటపెడతారు. విడిగా కౌన్సెలింగ్ ఇచ్చేటప్పుడు... కౌన్సెలర్ వారు సమస్యకు పరిష్కారం చెబుతారు. మా దగ్గర 15 మంది ఉండడానికి అవకాశం వుంది. అంతకు మించి ఎక్కువమందిని తీసుకోం. మా కేంద్రంలో ఒక డాక్టర్, నర్సు, కౌన్సిలర్లు, సహాయకులు, వంట మనుషులు... అందరూ కలిపి 23 మంది సిబ్బంది వుంటారు. ఆంధ్రా, తెలంగాణ నుంచి కూడా చాలామంది ఇక్కడకు వస్తుంటారు.



> 'మా స్వస్థలం చెన్నై. మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే. అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."

కుటుంబ మద్దతు అవసరం

మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలా మంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటువైపు వెళ్లరు.


ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు







17 చుక్కలు, 17 వరుసలు

జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!



తేనె

- ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేక్‌లు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.



బెల్లం

- దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.



ఖర్జూరాలు

- కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్.... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.



కొబ్బరి చక్కెర

- దీనిని కొబ్బరి చెట్టు పూల మొగ్గల కాండం స్రవించే రసం నుంచి తయారు చేస్తారు. దీనిలో గ్లైసెమిక్ ఇండెక్స్ శాతం చాలా తక్కువ. మామూలు పంచదారలో కంటే 400 రెట్లు అధికంగా పొటాషియం ఉంటుంది. కొబ్బరి చక్కెరలో అత్యధికంగా ఉండే సుక్రోజ్... కొవ్వుగా మారదు. పాయసం, లడ్డూలు, మఫిన్ల తయారీకోసం కొబ్బరి చక్కెరను నిరభ్యంతరంగా ఉపయోగించుకోవచ్చు.



మాపుల్ ద్రావణం

- దీనిని మాపుల్ చెట్ల కాండం నుంచి తయారు చేస్తారు. ఇది బంగారం రంగులో ప్రత్యేకమైన రుచితో ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. పాన్ కేక్, కుకీ, పేస్ట్రీల తయారీకి ఈ ద్రావణం అనుకూలంగా ఉంటుంది.

చపాతీలు మెత్తగా రావాలంటే...



మనలో చాలా మంది చపాతీలను ఇష్టంగా తింటూ ఉంటారు. రెండు వేళ్లతో తుంచగలిగేంత సుతిమెత్తని చపాతీలు ఆకలిని మరింత పెంచుతాయి. కానీ ఒక్కోసారి అవి గట్టిగా తయారై అసలు తినాలనిపించదు. చపాతీలు మెత్తగా రావాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం!

- ముందుగా గోధుమ పిండిలో తగినంత ఉప్పు వేసి కలపాలి. తరవాత కొంచెం నూనె లేదా నెయ్యి వేసి పిండి మొత్తానికి పట్టించాలి. కొన్ని పాలు, కొన్ని నీళ్లు చిలకరిస్తూ పిండిని మెత్తని ముద్దలా చేయాలి. పిండి ముద్ద పగుళ్లు లేకుండా నున్నగా రావాలి. దీనిమీద మూతపెట్టి కనీసం పావుగంట నాననివ్వాలి. చపాతీలు పామేముందు కూడా పిండిని వేళ్లతో నొక్కుతూ మరో పది నిమిషాలు గట్టిగా కలపాలి. అప్పుడే చపాతీలు మెత్తగా వస్తాయి.
- పిండిని మరీ చల్లని నీళ్లతో కాకుండా గోరువెచ్చని నీళ్లతో కలిపితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- చపాతీని పామేటపుడు పొడి పిండిని ఎక్కువగా చల్లవద్దు. ఒకవేళ చపాతీ మీద పిండి ఎక్కువైందని అనిపిస్తే తడి బట్టతో తుడిచేయాలి. చపాతీలను మరీ సన్నగా పామకూడదు.
- చపాతీలను పెద్ద మంట మీద కాల్చకూడదు. మధ్య స్థాయి మంట ఉండేలా చూసుకోవాలి.
- పెనం బాగా వేడిగా అయ్యాకనే దాని మీద చపాతీలు కాల్చాలి. పెనం వేడిగా లేకపోతే చపాతీలు గట్టిగా వస్తాయి.
- చపాతీ సగానికి పైగా కాలిన తరవాతనే దాని మీద నూనె రాయాలి. పెనం మీద ముందుగా నూనె వేస్తే చపాతీలు సరిగా కాలవు.
- చపాతీలను రెండువైపులా కాల్చిన తరవాత పళ్లెంలోకి తీసి దాని మీద మూత పెట్టాలి. లేకుంటే గట్టిపడతాయి.

భరతనాట్యమే గెలిపించింది

సంగీతం, నృత్యం, క్రీడలు ఈ మూడూ భిన్నమైన అభిరుచులు... అంతకు మించిన భిన్నమైన రంగాలు. అయినప్పటికీ మూడింట్లో ప్రత్యేకత చాటుకుంది చెన్నైకి చెందిన శివశ్రీ స్కందప్రసాద్. తన కన్నడ భక్తి గీతంతో ప్రధాని మోదీ ప్రశంసలను అందుకున్న శివశ్రీ, తాజాగా 'ఐరన్‌మ్యాన్ 70.3' నాల్గవ ఎడిషన్ పూర్తి చేసి, తనలోని క్రీడా స్ఫూర్తిని సైతం చాటుకోవడం విశేషం. త్వరలో బీజేపీ ఎంపీ తేజస్వీసూర్యను వివాహం చేసుకోబోతున్న ఈ బహుముఖ కళాకారిణి గురించిన మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు...

అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ వేడుకల్లో 'పూజిసలెండె హూగళ తండె' అనే కన్నడ భక్తి గీతాన్ని ఆలపించి, ప్రధాని మోదీ ప్రశంసలు అందుకోడంతో తొలిసారి వెలుగులోకొచ్చింది 28 ఏళ్ల శివశ్రీ. ప్రధాని ప్రశంసల గురించి ప్రస్తావిస్తూ... "నాలాంటి యువ కళాకారులను అంతటి గొప్ప వ్యక్తి ప్రస్తావించడం ఎంతో ప్రోత్సాహకరం. భారతీయ సంస్కృతి విలువను అర్థం చేసుకుని, ప్రతి పౌరుడూ బాధ్యతగా ఈ వారసత్వాన్నీ ముందుకు తీసుకువెళ్లడానికి ఈ ప్రశంస ఎంతో తోడ్పడుతుంది" అంటూ శివశ్రీ ఒక సందర్భంలో మీడియాతో చెప్పుకొచ్చింది. కర్నాటక సంగీతంలో దిట్ట అయిన శివశ్రీ భరతనాట్య కళాకారిణి కూడా! 1996, ఆగష్టు ఒకటిన చెన్నైలో పుట్టిన ఈ కళాకారిణి, మృందగ విద్వాంసుడైన శ్రీ జె. స్కందప్రసాద్ సంతానం. ఆయన ద్వారానే, శివశ్రీ సంగీత ప్రపంచంలోకి అడుగు పెట్టింది. శాస్త్ర యూనివర్శిటీ నుంచి బయోఇంజనీరింగ్ బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఈ కళాకారిణి, మద్రాసు యూనివర్శిటీ నుంచి భరతనాట్యంలో డిగ్రీ పొందింది. శివశ్రీ తొలిసారిగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం చిత్రం, పొన్నియన్ సెల్వన్‌లో ఎ.ఆర్.రహమాన్ సంగీత దర్శకత్వంలో, హెల్లె నీను అనే పాట కూడా పాడింది. ఈ గాయని 64 భారతీయ కళలను ప్రోత్సహించే 'ఆహుతి' అనే వేదికను కూడా స్థాపించింది.

ప్రదర్శనలు- అవార్డులు...

శివశ్రీ భరతనాట్య ప్రయాణం ఆమె మూడవ ఏటలోనే మొదలైంది. కలైమామణి శ్రీమతి కృష్ణకుమారి నరేంద్రన్, ఆచార్య చూడామణి గురు శ్రీమతి రోజా కన్నన్‌ల ఆధ్వర్యంలో భరతనాట్యం నేర్చుకున్న శివశ్రీ, మ్యూజిక్ అకాడమీ, నారద గాన సభ, శ్రీకృష్ణ గాన సభలతో పాటు చెన్నైలో ఎన్నో నాట్య ప్రదర్శనలు ఇచ్చింది. శివశ్రీ ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ ద్వారా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, 2018లో డెన్‌మార్క్‌లో, 2019లో దక్షిణ కొరియాలో నాట్య ప్రదర్శనలివ్వడం విశేషం. తన నాట్య, సంగీత ప్రదర్శనల ద్వారా సమ్మాన్ అవార్డు, భరత కళా చూడామణి అవార్డులతో పాటు మరెన్నో అవార్డులను కూడా గెలుచుకుంది. శివశ్రీ తన యూట్యూబ్ ఛానల్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో ఎప్పటికప్పుడు తాజా వీడియోలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. ఈమె యూట్యూబ్ ఛానల్‌కు 2 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

ఏమిటీ 'ఐరన్‌మ్యాన్ 70.3'?



మానసిక, శారీరక దారుఢ్యాలను, శక్తిసామర్థ్యాలను పరీక్షించే పోటీగా 'ఐరన్‌మ్యాన్ 70.3'కి ప్రపంచ వ్యాప్తంగా గొప్ప పేరుంది. ఇందులో 1.2 మైళ్ల స్విమ్మింగ్, 56 మైళ్ల సైక్లింగ్, 13.1 మైళ్ల రన్నింగ్ ఉంటాయి. మొత్తం కలిపి 70.3 మైళ్ల రేస్ ఇది. ఎంతో అనుభవమున్న క్రీడాకారులు, ఒలింపిక్ పతక విజేతలు ఈ పోటీలో పాల్గొని సత్తా చాటుకుంటూ ఉంటారు. ఈ పోటీల్లో ఒక్కరే పాల్గొనవచ్చు. లేదా మూడు విభాగాలకు ముగ్గురు వేర్వేరు క్రీడాకారులు కలిసి ఒక బృందంగా కూడా పాల్గొనవచ్చు. శివశ్రీ పెళ్లాడబోతున్న బీజేపీ నేత, తేజస్వీసూర్య ఈ పోటీలో పాల్గొన్న మొట్టమొదటి ప్రజా ప్రతినిధిగా పేరు తెచ్చుకున్నారు. 50 దేశాల క్రీడాకారులు పాల్గొనే 'ఐరన్ మ్యాన్ 70.3' పోటీని సూర్య 8 గంటల 27 నిమిషాల్లో పూర్తి చేయడం విశేషం.





తేజస్వితో పెళ్లి...

బీజేపీ నేత, బెంగుళూరు సౌత్ ఎంపీ తేజస్వీసూర్యతో శివశ్రీ స్కందప్రసాద్‌కు ఇటీవల నిశ్చితార్థం జరిగింది. వీరి పెళ్లి మార్చిలో జరగనుందనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి.

నా నేస్తం సైకిల్...

తన కళాత్మక నైపుణ్యాలతో రాణించడంతోనే సరిపెట్టుకోకుండా, సైక్లింగ్, ట్రెక్కింగ్ మొదలైన క్రీడల్లో కూడా మెరుగైన ప్రతిభను కనబరుస్తోంది శివశ్రీ. తాజాగా ఐరన్‌మ్యాన్ 70.3 నాల్గవ ఎడిషన్‌లో సైక్లింగ్ రేసును విజయవంతంగా పూర్తి చేసిందామె. ఆ పోటీల గురించి ఆమె ప్రస్తావిస్తూ... "నా బడి చదువంతా సైకిల్‌తోనే సాగింది. డాన్స్ తరగతులకూ, సంగీత తరగతులకూ.. ఇలా ఎక్కడకు వెళ్లాలన్నా నేను సైకిల్ మీదే వెళ్లేదాన్ని. అయితే ఐరన్‌మ్యాన్ రేసులో భాగంగా ఏకబిగిన 90 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కడమన్నది పూర్తిగా భిన్నమైన అనుభవం. పైగా గోవాలోని వేడి, తేమతో కూడిన వాతావరణంలో సైకిల్ తొక్కడం ఆషామాషీ వ్యవహారం కాదు. నేను రిలే పోటీలో సైక్లింగ్ విభాగాన్ని ఎంచుకున్నాను. నా కోచ్ హేమ, పరుగు పందేన్ని పూర్తి చేస్తే, హర్షిణి ఈత పోటీని పూర్తి చేసింది. ఈ పోటీకి సిద్ధపడాలని నిశ్చయించుకున్నప్పుడు, 90 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కగలుగుతానా? అని భయపడ్డాను. కానీ నా సహ క్రీడాకారిణులిద్దరూ నన్నెంతో ప్రోత్సహించి పోటీలకు సిద్ధం చేశారు. పోటీకి నెల రోజుల ముందు నేను ఒక ప్రదర్శన కోసం అమెరికా వెళ్లాను. అక్కడ ఉన్న నెల రోజులూ సైకిల్ తొక్కడం, వ్యాయామం చేయడం సాధన చేశాను. తిరిగి భారతదేశానికి చేరుకున్న తర్వాత, ఆహారం మీద దృష్టి పెట్టాను. మాంసకృత్తులు, పీచు మోతాదు పెంచాను. నీళ్లు కూడా ఎక్కువ తాగడం మొదలుపెట్టాను. సైకిల్ తొక్కడంవెనకున్న సైన్స్‌తో పాటు శరీర పనితీరు గురించి లోతుగా తెలుసుకున్నాను. అలాగే సామర్థ్యాన్ని పెంచడానికి తోడ్పడే శక్తి వ్యవస్థలు, కండరాల రికవరీ, పోషకాల ప్రాముఖ్యతల గురించి నేర్చుకున్నాను. ఇవన్నీ నా శిక్షణకు ఎంతో బాగా తోడ్పడ్డాయి" అంటూ చెప్పుకొచ్చింది.

నాట్యమే సహాయపడింది

"ఐరన్‌మ్యాన్ పోటీకి రెండు వారాల ముందు కొత్త సైకిల్ కొనుగోలు చేసి, పోటీకి ఒక్క రోజు ముందు 60 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కాను. అలాగే సరికొత్త సైకిల్‌తో పోటీలో పాల్గొన్నాను. సాధారణంగా ఎవరూ ఇలాంటి రిస్క్ తీసుకోరు. పోటీలోకి అడుగు పెట్టగానే ఓ పక్క సంతోషం, మరో పక్క భయం నన్ను ఆవరించాయి. అయినా పోటీలో గెలిచి తీరాలనే పట్టుదల అంతకంతకూ పెరిగిపోయింది. పోటీలో డీహైడ్రేషన్‌కు గురి కాకుండా నిరంతరం ఎలక్ట్రొలైట్స్‌తో కూడిన నీళ్లు తాగడంతో పాటు శక్తి కోసం, కార్బ్స్ కలిగి ఉండే బార్స్, జెల్స్ తీసుకున్నాను. నిజం చెప్పాలంటే ఈ పోటీలో సమర్థంగా సైకిల్ తొక్కడానికి సైక్లింగ్ సాధన కంటే, నా 23 ఏళ్ల భరతనాట్య సాధనే ఎక్కువగా తోడ్పడిందని చెప్పాలి. భరతనాట్యంలోని 'అరమండి'వల్ల పిరుదులు, పిక్కలు దృఢంగా మారడంవల్లే నేను అంత దూరం సైకిల్ తొక్కగలిగాననే భావిస్తున్నాను" అంటూ శివశ్రీ తన అనుభవాలను పంచుకుంది.

ఫ్యాషన్ స్టడీస్ @ నిఫ్ట్



కోర్సులు:
- టెక్స్‌టైల్ డిజైన్
- యాక్సెసరీ డిజైన్
- లెదర్ డిజైన్
- ఫ్యాషన్ డిజైన్
- నిట్‌వేర్ డిజైన్
- అపారెల్ ప్రొడక్ట్
- ఫ్యాషన్ కమ్యూనికేషన్


యూజీ/ పీజీ ప్రోగ్రామ్స్
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జనవరి 6
ప్రవేశ పరీక్ష తేదీ: 2025 ఫిబ్రవరి 9

పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఫిబ్రవరి 28
ప్రవేశ పరీక్ష: 2025 ఏప్రిల్

పూర్తి వివరాలకు: NIFT HYDERABAD NIFT Campus, Opposite HiTech City, Cyberabad post, Madhapur, Hyderabad – 500 081, Telangana.
T: (040) 23110841/42/43, 23110630. **వెబ్‌సైట్:** www.nift.ac.in

దక్షిణ మధ్య రైల్వేలో 4232 అప్రెంటిస్‌లు

సికింద్రాబాద్‌లోని రైల్వేరిక్రూట్‌మెంట్ సెల్ ఎస్‌సీఆర్ వర్క్‌షాప్, యూనిట్‌లలో అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతోంది. దక్షిణ మధ్య రైల్వేలోకి వచ్చే జిల్లాల అభ్యర్థులు మాత్రమే 2025 జనవరి 27లోగా దరఖాస్తు చేసుకోవాలి.



ఎస్‌సీఆర్ యూనిట్ ప్రదేశాలు: సికింద్రాబాద్, లాలాగూడ, మెట్టుగూడ, ఖాజీపేట్, హైదరాబాద్, విజయవాడ, బిట్రగుంట, గూడూరు జంక్షన్, కాకినాడ పోర్టు, కొండపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్, ఒంగోలు, రాజమండ్రి, రాయనపాడు, నల్లపాడు, గుంటూరు, గుంతకల్, తిమ్మనచర్ల, యాద్‌గిర్, నాందేడ్, పూర్ణ జంక్షన్, ముద్‌ఖేడ్.

ట్రేడ్‌ల వారీగా ఖాళీలు:
- ఏసీ మెకానిక్ - 143
- ఎయిర్ కండీషనింగ్ - 32
- కార్పెంటర్ - 42
- డీజిల్ మెకానిక్ - 142
- ఎలక్ట్రానిక్ మెకానిక్ - 85
- ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ - 10
- పెయింటర్ - 74
- ఎలక్ట్రీషియన్ - 1053
- ఫిట్టర్ - 1742
- మెషినిస్ట్ - 100
- వెల్డర్ - 713
- పవర్ మెయింటెనెన్స్ (ఎలక్ట్రీషియన్) - 34
- ఎలక్ట్రికల్(ఎస్అండ్‌టీ) (ఎలక్ట్రీషియన్) - 10
- ట్రైన్ లైటింగ్(ఎలక్ట్రీషియన్) - 34
- మోటార్ మెకానిక్ మెహికిల్ - 08
- మెకానిక్ మెషీన్ టూల్ మెయింటెనెన్స్ - 10

(మొత్తం పోస్టుల సంఖ్య 4232 (ఎస్సీ-635, ఎస్టీ-317, ఓబీసీ -1143, ఈడబ్ల్యూఎస్-423, యూఆర్-1714)

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో పది పాస్ కావడంతోపాటు, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ పూర్తి చేసి ఉండాలి.
వయస్సు: 2024 డిసెంబర్ 28 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్యలో ఉండాలి
ఎంపిక: పది, ఐటీఐలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఓబీసీలకు మూడు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
చివరి తేదీ: 2025 జనవరి 27
పూర్తి వివరాలకు scr.indianrailways.gov.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

దిక్సూచి DIKSUCHI

దేశవ్యాప్తంగా ఇంటర్మీడియేట్(ఎంపీసీ) లేదా తత్సమాన విద్యార్థులు బీటెక్, బీఆర్క్/బీ డిజైన్ కోర్సుల్లో ప్రతిష్ఠాత్మక ఎన్ఐటీ, ఐఐఐటీ, ఎస్‌పీఏ లాంటి విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ(మెయిన్) ప్రవేశ పరీక్ష ప్రతి ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా రెండు దఫాలుగా అంటే జనవరి, ఏప్రిల్‌ల్లో నిర్వహిస్తున్నారు. జనవరి సెషన్‌కి సంబంధించి అప్లికేషన్ ప్రాసెస్ ఈపాటికే పూర్తయింది. దాదాపు 13.6 లక్షలమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఏప్రిల్ సెషన్‌కి సంబంధించి అప్లికేషన్ ప్రాసెస్ జనవరి 31, 2025 నుంచి ఫిబ్రవరి 24 వరకు ఉంటుంది. జనవరి సెషన్‌కి దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ తేదీలను గుర్తుపెట్టుకోవాలి.

- జనవరి 22 నుంచి 31 వరకు జరిగే కంప్యూటర్ ఆధార పరీక్షలో ప్రధానంగా చాయిస్ ప్రశ్నలను తీసివేశారు. అంటే గతంలో సబ్జెక్టుకి పార్ట్-బిలో 10 ప్రశ్నల్లో అయిదు అటెంప్ట్ చేస్తే సరిపోయేది. కానీ ఈ సంవత్సరం అయిదింటికి అయిదు అటెంప్ట్ చేయాలి. అంటే ప్రతి సబ్జెక్టుకి 25కి 25 అటెంప్ట్ చేయాల్సి ఉంటుంది. చాయిస్ ఉండదు.
- ఈ సందర్భంగా చాలామంది విద్యార్థులు జనవరి లేదా ఏప్రిల్‌లో ఏ సెషన్‌ని సీరియస్‌గా తీసుకోవాలనే సందిగ్ధంలో ఉంటారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరిలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, మార్చిలో బోర్డ్ పరీక్షలు రాయడంలో హడావుడిగా ఉంటారు. కాబట్టి వారికి జనవరి సెషన్ బెటర్ ఎందుకంటే వీరికి బోర్డు పరీక్షలు అయిన తరువాత జేఈఈ(మెయిన్) ఏప్రిల్ సెషన్‌కి సమయం లభించేది చాలా తక్కువ. అదే ఇంటర్ పూర్తిచేసుకుని లాంగ్‌టర్మ్ ప్రిపరేషన్‌లో ఉన్న విద్యార్థులు ఏ సెషన్ అయినా సీరియస్‌గా తీసుకోవచ్చు.

జేఈఈ(మెయిన్) 2025 జనవరి సెషన్ బెటర్

ఈ టిప్స్‌తో విద్యార్థులు మంచి పర్సంటైల్ స్కోరును సాధించవచ్చు.

1. సిలబస్‌పై అవగాహన
ఎ) విద్యార్థి పరీక్ష విధానం, మార్కింగ్ స్కీమ్, వెయిటేజ్ టాపిక్స్‌పై పూర్తి అవగాహనతో ఉండాలి.
బి) ఎక్కువ వెయిటేజ్ ఉన్న టాపిక్స్/ చాప్టర్స్‌పై దృష్టి సారించాలి.

2. సరైన ప్రణాళిక
ఎ) విద్యార్థి ప్రతి సబ్జెక్టుకి నిర్దిత సమయాన్ని కేటాయించి, దానిప్రకారం ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
బి) ముఖ్యమైన టాపిక్స్‌కి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
సి) చదువు, విశ్రాంతికి మధ్య సరైన సమయాన్ని కేటాయించుకోవాలి.

3. రివైజ్- ప్రాక్టీస్
ఎ) ఎన్‌సీఈఆర్‌టీ, ఇంటర్ పాఠ్య పుస్తకాల్లో ఉన్న సమ్మరీని సమగ్రంగా రివైజ్ చేయాలి.
బి) విద్యార్థి తనకు పట్టున్న చాప్టర్లు, టాపిక్స్‌ను ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి.

4. నమూనా పరీక్షలు
ఎ) గత సంవత్సరం ప్రశ్నపత్రాలను విరివిగా సాల్వ్ చేయాలి.
బి) మాక్‌టెస్ట్‌ను రాయడం ద్వారా పరీక్ష భయాన్ని అధిగమించవచ్చు.

5. సమయ పాలన
ఎ) ప్రాక్టీస్, మాక్‌టెస్ట్ సమయంలో నిర్దిష్టమైన టైమ్‌లైన్ పాటించాలి. ప్రతి ప్రశ్నకు రెండు లేదా మూడు నిమిషాల సమయం ఉంటుంది. కాబట్టి తొందరపాటు లేకుండా అటెంప్ట్ చేయాలి. దీనివల్ల నెగెటివ్ మార్కులను తగ్గించవచ్చు.
బి) ముదట క్లిష్టమైన ప్రశ్నలను వదిలేసి, బాగా తెలిసిన వాటిపై దృష్టి సారించడం ద్వారా మీకు మనోనిబ్బరం తగ్గకుండా ఉంటుంది.

6. క్లాస్‌రూమ్ నోట్స్
ప్రిపరేషన్ రోజుల్లో విద్యార్థి ఎక్కువగా ఎన్‌సీఈఆర్‌టీ/ గత ప్రశ్నపత్రాలపై ఆధారపడాలి. మీ క్లాస్‌రూమ్ నోట్స్ అనేది రివిజన్‌కు ఎంతో ఉపయోగపడుతుంది.

7. ఫార్ములాస్ రివిజన్



ఎ) అన్ని ముఖ్యమైన ఫార్ములాలు, ఒకచోట పెట్టుకుని ప్రతి రోజూ రివైజ్ చేయాలి.
బి) వీలైతే దీనికి సంబంధించి బ్రీఫ్ నోట్స్ తయారు చేసుకోవాలి.

8. సమగ్ర విశ్లేషణ
ఎ) ప్రతి మాక్‌టెస్ట్ అయ్యాక తప్పొప్పులపై దృష్టి సారించాలి.
బి) రెగ్యులర్‌గా అడిగే కాన్సెప్ట్‌లను ఎక్కువగా రివైజ్ చేయాలి. గెస్‌వర్క్‌ను పూర్తిగా అవాయిడ్ చేయాలి.

9. పాజిటివ్ ఆలోచనలు
ఎ) విద్యార్థి ఈ దశలో మాడిఫైడ్‌గా ఉండాలి. అసలు నెగెటివ్ ఆలోచనలను దరికి రానివ్వద్దు.
బి) మీ చుట్టూ సహ విద్యార్థులు, లెక్చరర్స్ ఉండటంతో పోటీ వాతావరణం ఉంటుంది. అయితే ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి.

10. ఆరోగ్యం ముఖ్యం
ఎ) స్టడీ సెషన్స్ మధ్య సరైన బ్రేక్స్ ఉండాలి
బి) ఆహారం, నిద్ర అనేది మెదడును ఫ్రెష్‌గా ఉంచుతుంది.
సి) వీలైతే మెడిటేషన్, యోగ చేయాలి.
డి) మీ శరీరం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి.

చివరిగా ఈ పరీక్షలో విజయం సాధించాలంటే హార్డ్‌వర్క్‌తో పాటు, ఆక్యురసీ, సమయపాలనపై ఎక్కువ శ్రద్ధ పెట్టండి.



డాక్టర్ పవన్‌కుమార్ కాసు
సంజీవిని ఐఐటీ అకాడమీ

SCHOLARSHIP ALERT

Omron Healthcare

Description: OMRON Healthcare India invites applications from girl students studying in Classes 9 to 12 at any school across India.
Eligibility: Girl students studying in Classes 9 to 12 at any school across India are eligible to apply. Students must have received a minimum of 75% marks in their previous academic year. The annual family income of applicants should be less than INR 8,00,000.
Prizes & Rewards: One-time scholarship of INR 20,000
Last Date to Apply: 10-01-2025 ***Application mode:*** Online only
Short Url: www.b4s.in/aj/OMHS2

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date to Apply: 15-01-2025 ***Application mode:*** Online only
Short Url: www.b4s.in/aj/TCPS27

buddy4study.com

హై కోర్టు పరిధిలో 1673 పోస్టులు



తెలంగాణ హైకోర్టు పరిధిలోని 1673 టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

హైకోర్టు పరిధిలో
- కోర్టు మాస్టర్ అండ్ పర్సనల్ సెక్రటేరియస్ - 12
- కంప్యూటర్ ఆపరేటర్ - 11
- అసిస్టెంట్ - 42
- ఎగ్జామినర్ - 24
- టైపిస్ట్ - 12
- కాపిస్ట్ - 16
- సిస్టమ్ అనలిస్ట్ - 20
- ఆఫీస్ సబార్డినేట్ - 75

మొత్తం - 212

మినిస్టీరియల్, సబార్డినేట్ సర్వీస్ పరిధి
- నాన్ టెక్నికల్ - 1277
- టెక్నికల్ - 184

మొత్తం 1461

రెండు విభాగాలు కలిపి ఖాళీలు 1673

అర్హత: పది, ఇంటర్, డిగ్రీ ఉత్తర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయస్సు: 18-34 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, సీడీబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్‌0 అభ్యర్థులకు పదేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ **చివరి తేదీ:** 2025 జనవరి 31
పరీక్ష తేదీ: టెక్నికల్ పోస్టులకు ఏప్రిల్, నాన్ టెక్నికల్ పోస్టులకు 2025 జూన్
వెబ్‌సైట్: https://tshc.gov.in

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

అలాంటి సినిమాలను నిషేధించాలి

- అనంత శ్రీరామ్




'నిండు సభలో ద్రౌపది వస్త్రాన్ని తీస్తున్నా మౌనంగా ఉన్న కర్ణుడు గొప్పవాడు ఎలా అవుతాడు? పురాణ ఇతిహాసాలను సినిమావాళ్లు తమ ఇష్టం వచ్చినట్లు మార్చి హైందవ ధర్మాన్ని వక్రీకరిస్తున్నారు' అని అన్నారు సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్. గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద విశ్వ హిందూపరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'హైందవ శంఖారావం' సభలో ఆయన మాట్లాడుతూ. 'హిందూ ధర్మాన్ని అవమానించేలా తీసిన సినిమాలను ప్రభుత్వం నిషేధించాలి. లేదంటే హిందువులే పూర్తిగా వాటిని బహిష్కరించాలి. అప్పుడే హిందూ ధర్మానికి ఒక గౌరవం, గుర్తింపు ఉంటాయి. సినిమాల్లో హైందవ ధర్మం మీద దాడి జరుగుతోంది. వాల్మీకి రామాయణం, వ్యాస భారతం..భారత సాహిత్య వాఙ్మయానికి రెండు కళ్లు వంటివి. అలాంటి వాటిని వినోదం కోసం వక్రీకరిస్తున్నారు. హిందూ ధర్మాన్ని హననం చేసే సినిమాలను ప్రతి ఒక్కరూ బహిష్కరించాలి. అప్పుడు ఆ సినిమాలకు డబ్బులు రావు. డబ్బులు రాకపోతే ఇలాంటి చిత్రాలను నిర్మాతలు తీయరు' అని ఆయన అన్నారు.

అడవికి రాజు.. డాకు మహారాజ్



బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. బాబీ డియోల్, మకరంద్ దేశ్‌పాండే, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. అమెరికాలోని డల్లాస్‌లో ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో వింటేజ్ బాలకృష్ణను ప్రజెంట్ చేశారు దర్శకుడు బాబీ. 'అనగనగా ఒక రాజు ఉండేవాడు. చెడ్డవాళ్లంతా ఆయనను డాకు అనేవాళ్లు. మాకు మాత్రం ఆయన మహారాజ్'.. 'ఆయన కింగ్ ఆఫ్ జంగిల్' వంటి సంభాషణలతో ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. ఇందులో విభిన్నమైన గెటప్పుల్లో బాలకృష్ణ కనిపించారు. ఆయన లుక్స్, యాక్షన్ సన్నివేశాలు, విజువల్స్, భావోద్వేగాలు, అద్భుతమైన సంగీతంతో నిండిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విజయ్ కార్తీక్ కన్నన్, సంగీతం: తమన్.



త్రివిక్రమ్‌పై చర్యలేవి?

'మా'ను ప్రశ్నించిన పూనమ్‌కౌర్



నటి పూనమ్ కౌర్ మరోసారి ఎక్స్ వేదికగా దర్శకుడు త్రివిక్రమ్‌ను.. 'మా'ను ఉద్దేశిస్తూ పోస్టు పెట్టారు. 'త్రివిక్రమ్‌పై ఫిర్యాదు చేసి ఎంతో కాలమైంది. కానీ 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) నుంచి ఎటువంటి స్పందన రాలేదు. త్రివిక్రమ్‌పై ఇచ్చిన ఫిర్యాదు విషయంలో 'మా' సంఘం ఆయన్ని ప్రశ్నించలేదు. నా జీవితాన్ని నాశనం చేసి.. ఆరోగ్యాన్ని.. ఆనందాన్ని కోల్పోయేలా చేసిన ఆయనపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. పైగా ఆయన విషయంలో చర్యలు తీసుకోకుండా ఉండేలా ఇండస్ట్రీ పెద్దల నుంచి సహకారం అందుతోంది' అని ఆరోపించారు.

'మా'ను లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించండి

ఈ ట్వీట్‌పై 'మా' కోశాధికారి, నటుడు శివబాలాజీ స్పందించారు. 'పూనమ్.. మీరు చేసిన ఫిర్యాదు మాకు అందలేదు. గతంలోనూ మీరు ఫిర్యాదు చేసినట్లు 'మా' రికార్డుల్లో లేదు. న్యాయం దక్కాలంటే మీరు 'మా' లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించండి. ఇలా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదు' అని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు స్పందించాల్సి ఉంది. కాగా, గతంలోనూ పూనమ్ ఎక్స్ వేదికగా త్రివిక్రమ్‌పై పలు సార్లు ఆరోపణలు చేశారు.

అది అకీరా ఇష్టం



తనయుడు అకీరా నందన్ సినీ అరంగేట్రం కోసం తానూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాని రేణూ దేశాయ్ అన్నారు. ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంలో ఆమె అకీరా సినీ ఎంట్రీపై స్పందించారు. 'ఎక్కడకు వెళ్లినా అకీరా సినిమా ఎప్పుడు? అనే ప్రశ్న ఎదురవుతోంది. పవన్ కల్యాణ్ అభిమానుల్లానే నేను కూడా అకీరా సినిమాల్లోకి రావాలని కోరుకుంటున్నాను. అయితే అందరి కన్నా ఒక తల్లిగా నేనే ఎక్కువగా కోరుకుంటాను. కానీ సినిమాల్లోకి ఎప్పుడు రావాలనేది అకీరా ఇష్టం. ఏదైనా తను కోరుకున్న విధంగా జరగాలి. అప్పటి వరకూ వేచిచూడండి' అని అన్నారు.


ప్రభుకు బ్రెయిన్ సర్జరీ



తమిళ సీనియర్ నటుడు ప్రభుకు బ్రెయిన్ సర్జరీ జరిగింది. జ్వరం, తలనొప్పితో ఆస్పత్రిలో చేరగా, మెదడులోని ఓ రక్తనాళంలో వాపు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే మైనర్ సర్జరీ చేసి వాపును తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

- చెన్నై, (ఆంధ్రజ్యోతి)

డిఫరెంట్ కాన్సెప్ట్‌తో..



వరుణ్ సందేశ్ హీరోగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మిస్తున్న చిత్రం 'కానిస్టేబుల్'. మధులిక వారణాసి హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను దర్శకుడు త్రినాథరావు నక్కిన రిలీజ్ చేశారు. హత్యకు గురైన ఓ అమ్మాయి కేసును ఛేదించే పోలీస్ కానిస్టేబుల్ పాత్రలో వరుణ్ సందేశ్ కనిపించబోతున్నారని టీజర్ చూస్తే తెలుస్తోంది.

దర్శకత్వ ఆలోచన లేదు

- ఎస్.జె.సూర్య



రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నటుడు ఎస్.జె.సూర్య మీడియాతో ముచ్చటించారు.' డైరెక్టర్ శంకర్‌తో పని చేయాలని ప్రతీ ఒక్క ఆర్టిస్ట్‌కు ఉంటుంది. ఆయన చాలా విజనరీ డైరెక్టర్. రామ్‌చరణ్ అద్భుతమైన నటుడు. ఆయన గ్లోబల్ స్టార్‌గా ఎదిగారు. ఈ చిత్రంలో ఆయన డిఫరెంట్ షేడ్స్‌లో కనిపిస్తారు. 'గేమ్ ఛేంజర్‌లో అన్ని అంశాలు ఉంటాయి. అందరినీ అలరించేలా ఈ మూవీ ఉంటుంది. పవన్ కళ్యాణ్ గారు మా చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు రావడం ఆనందంగా ఉంది. ఆయన ఎప్పుడూ ప్రజల కోసం ఆలోచిస్తూ ఉంటారు. నాకు నటుడిగా చాలా కంఫర్ట్‌గా ఉంది. దర్శకత్వం గురించి ఏమీ ఆలోచించడం లేదు' అని అన్నారు.

ప్రేక్షకులు మెచ్చే ప్రేమకథ



తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క, హీరోగా, గరిమ చౌహాన్ హీరోయిన్‌గా నటిస్తున్న 'కలవరం' చిత్రం షూటింగ్ హైదరాబాద్ సారథీ స్టూడియోలో ప్రారంభమైంది. విజయ్, రాజ్ తిరందాసుపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు చదలవాడ శ్రీనివాసరావు కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత సి.కల్యాణ్ తొలి క్లాప్ ఇచ్చారు, హనుమాన్ వాసంశెట్టి దర్శకత్వంలో సీఎల్ఎన్ మీడియా సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. నిర్మాత శోభారాణి మాట్లాడుతూ 'ఈ సినిమాకు 'కలవరం' పర్ఫెక్ట్ టైటిల్. ఇందులో 70 మంది ఆర్టిస్టులు ఉన్నారు. ప్రేక్షకులు మెచ్చే సినిమా అవుతుంది' అన్నారు.

వైవిధ్యమైన కథతో..



లోహిత్ కల్యాణ్, రాజేశ్ కుంచాడా, జోషిత్ రాజ్‌కుమార్, కైలాష్ వేలాయుధన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాజుగారి దొంగలు'. లోకేశ్ రనల్ హిటాసో దర్శకత్వంలో నడిమింటి బంగారునాయుడు నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు లోకేశ్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరిని మెప్పిస్తుందనే నమ్మకముంది. వైవిధ్యమైన కథతో తెరకెక్కిన సినిమా ఇది" అని చెప్పారు. "ఈ సినిమా మీ అంచనాలకు మించి ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే చిత్రమిది" అని నిర్మాత బంగారునాయుడు అన్నారు.

రోడ్డు ప్రమాదం.. కుటుంబం చిన్నాభిన్నం

» లారీ బైక్‌ను ఢీకొని తల్లి, తండ్రి, కుమార్తె మృతి

» కుమారుడికి తీవ్ర గాయాలు.. మేడ్చల్‌లో ఘటన



బుల్లబ్బాయి, లావణ్య, హర్షిత (ఫైల్)

మేడ్చల్ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆదివారం లారీ బైక్‌ను ఢీకొన్న ఘటనలో తల్లితండ్రి, కుమార్తె మృతి చెందగా, నాలుగేళ్ల కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని కాకినాడ జిల్లా ఎర్రవరం గ్రామానికి చెందిన బుల్లబ్బాయి (37) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. బుల్లబ్బాయి ఆయన మిత్రుడు వెంకటేశ్వరావును కలవడానికి భార్య సాగి లావణ్య (30) కూతురు హర్షిత (10), నాలుగేళ్ల కుమారుడు సిద్దేశ్వర్‌తో కలిసి బైక్‌పై మేడ్చల్ మండలం ఎల్లంపేటకు బయల్దేరారు. ఈ క్రమంలో మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద వెనుక నుంచి వచ్చిన ఓ లారీ వీరి బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. దీంతో బుల్లబ్బాయి, లావణ్య, హర్షిత అక్కడికక్కడే మృతి చెందగా సిద్దేశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సిద్దేశ్వర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

» నేటి నుంచి 18వ తేదీ వరకు అందుబాటులో...

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 నుంచి 18వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 6, 7 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (07077/07078), 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (02764/02763) మధ్య 6 రైళ్లు అందుబాటులో ఉంటాయి. 13న వికారాబాద్-కాకినాడ టౌన్ (07037), 14న కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) మధ్య రైళ్లు నడుస్తాయి. 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ-తిరుపతి-కాచిగూడ మధ్య నాలుగు, 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07035/07036) మధ్య నాలుగు, 12, 19 తేదీల్లో సికింద్రాబాద్-కాకినాడ టౌన్-సికింద్రాబాద్ మధ్య నాలుగు, జనవరి 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07033/07034)మధ్య పది రైళ్లు నడుస్తాయి. 8, 9, 10, 11, 12, 13, 14, 15 చర్లపల్లి-కాకినాడ టౌన్-చర్లపల్లి (07031/07032)మధ్య ఎనిమిది, జనవరి 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్-కాకినాడ టౌన్-నాందేడ్ (07487/07488) మధ్య నాలుగు, జనవరి 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07025/07026) మధ్య ఆరు రైళ్లు అందుబాటులో ఉంటాయి. 7, 8 తేదీల్లో కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-కాచిగూడ (07041/07042)మధ్య రెండు రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

చలి.. అసలు 'తగ్గేదేలే'

» అర్లీలో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

» రాష్ట్రవ్యాప్తంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్/ కోహీర్/ ఆసిఫాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసలు 'తగ్గేదేలే' అన్నట్లు చలి విజృంభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు బాగా పడిపోతున్నాయి. ఈ సీజన్‌లోనే అత్యల్పంగా శనివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా అర్లీ (టీ)లో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ)లో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, తిర్యాణి మండలంలోని గిన్నెధరి గ్రామంలో 6.1 డిగ్రీలు, తిర్యాణిలో 7.3 డిగ్రీలు, వాంకిడి, కెరమెరిలో 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితీవ్రత ఒక్కసారిగా పెరగడంతో జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.1 డిగ్రీలు నమోదవగా, అల్గోల్‌లో 7.7, మల్‌చెల్మలో 9.5, మొగుడంపల్లిలో 9.8, సత్వార్‌లో 9.8, న్యాల్‌కల్‌లో 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తిలో 10.7, నర్సాపూర్‌లో 11.1, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట-భూమ్‌పల్లి 10.9, కొండపాక 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు రాష్ట్రంలో రాబోయే మూడు రోజులలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. పలు జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉందని, ఆదిలాబాద్ జిల్లాలో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

నేటి నుంచి బసవతారకం ఆస్పత్రిలో సర్వైకల్ క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ శిబిరం

హైదరాబాద్ సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో సర్వైకల్(గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేశారు. ప్రపంచ సర్వైకల్ క్యాన్సర్ అవగాహన నెల సందర్భంగా సోమవారం నుంచి ఈనెలాఖరు వరకు అన్ని పనిదినాల్లో ఉదయం 10 గం.ల నుంచి మధ్యాహ్నం 1గం.ల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. శిబిరంలో వైద్యులు ఉచితంగా ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారని, అనుమానమున్న వారికి పాప్‌స్మియర్ పరీక్షల్లో 50 శాతం, ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో 20 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 040-23551235 ఎక్స్‌టెన్షన్ 2335, 2354, 2216 లలో సంప్రదించవచ్చని చెప్పింది.

ఆబ్కారీ శాఖలో నార్కోటిక్స్ విభాగం

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌పై యుద్ధంలో భాగంగా అబ్కారీ శాఖలో కొత్తగా నార్కోటిక్స్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కొత్త బృందాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఎస్పీ స్థాయి అధికారిక పర్యవేక్షించే ఈ విభాగంలో ఒక సీఐ, ఇద్దరేసి ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 15-20 మంది కానిస్టేబుళ్లు ఉంటారని తెలిపారు.

సొంత జిల్లాలకు బదిలీ చేయాలి

» జీవో 317 డిస్‌లొకేటెడ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ జేఏసీ వినతి

కవాడిగూడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జీవో 317 ద్వారా జిల్లాలు మారిన ఉద్యోగ, ఉపాధ్యాయులను తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని జీవో 317 డిస్‌లొకేటెడ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను కలిసి విన్నవించినట్లు జేఏసీ అధ్యక్ష కార్యదర్శులు పడకంటి అజయ్‌కుమార్, ఎలగొండ రత్నమాల తెలిపారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మీడియాతో వారు మాట్లాడుతూ.. జీవో 317 వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. గత మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగులు దూర ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటివరకు 47మంది చనిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే జీవో 317ను రద్దు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, ఇప్పటికైనా ఈ జీవోను వెంటనే రద్దు చేసి న్యాయం చేయాలని వారు విన్నవించారు.

సచివాలయ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సచివాలయ సంఘం అధ్యక్షుడిగా గిరి శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సంఘం ఎన్నికల తుది ఫలితాలు ఆదివారం వెల్లడయ్యాయి. ఉపాధ్యక్షుడి(జనరల్)గా నవీన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్(ఉమెన్)గా లావణ్యలత, ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్, అడిషనల్ సెక్రటరీగా రాము భుక్యా, జాయింట్ సెక్రటరీ(పబ్లిసిటి)గా రాజేశ్వర్ ఎన్నికయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీ(కల్చరల్)గా యామిని కనకతార, జాయింట్ సెక్రటరీ(స్పోర్ట్స్)గా వంశీధర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ(ఉమెన్)గా నీరజాక్షి, జాయింట్ సెక్రటరీ(ఆర్గనైజేషన్)గా శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు.

ప్రభుత్వ అంబులెన్స్‌లు

మన వద్ద మరీ తక్కువ!

దేశంలోనే 20వ స్థానంలో తెలంగాణ.. అందుబాటులో 456 వాహనాలు మాత్రమే

» 7,499 అంబులెన్స్‌లతో అగ్రస్థానంలో మహారాష్ట్ర

» కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ నివేదిక



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సర్కారీ అంబులెన్స్ సంఖ్యలో తెలంగాణ దేశంలోనే 20వ స్థానంలో నిలిచింది. ఈ విషయంలో పొరుగున ఉన్న ఏపీతోపాటు ఝార్ఖండ్, ఒడిసా, బిహార్ రాష్ట్రాల కంటే తెలంగాణ వెనుకంజలో ఉండడం గమనార్హం. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నడిచే అంబులెన్స్ వాహనాల సంఖ్యపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా 40,445 ప్రభుత్వ అంబులెన్స్‌లు ఉన్నాయి. ఇందులో 7,499 అంబులెన్స్‌లతో మహారాష్ట్ర ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్ 4,720, పశ్చిమ బెంగాల్ 3,185 వాహనాలతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇక, 456 ప్రభుత్వ అంబులెన్స్‌లు కలిగిన తెలంగాణ ఈ జాబితాలో 20వ స్థానంలో నిలిచింది. అదే సమయంలో 768 ప్రభుత్వ అంబులెన్స్‌లతో తెలంగాణ కంటే మెరుగ్గా ఏపీ 16వ స్థానంలో నిలిచింది. ఇక, దక్షిణాది రాష్ట్రాల విషయానికొస్తే ప్రభుత్వ అంబులెన్స్‌ల సంఖ్యలో తెలంగాణ అట్టడుగు స్థానంలో ఉంది. తమిళనాడులో 2,303 ప్రభుత్వ అంబులెన్స్‌లో ఉండగా కర్ణాటకలో 2,007, కేరళలో 783, ఆంధ్రప్రదేశ్‌లో 768 ఉన్నాయి. కాగా, జాతీయ ఆరోగ్య విషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధులతో నడిచేవి ఎన్ని ఉన్నాయి? రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నడిచే వాహనాలెన్ని? అనే వివరాలను కేంద్రం ఈ జాబితాలో వేర్వేరుగా విడుదల చేసింది. అంతేకాక అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్), బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) సాధారణ అంబులెన్స్‌ల సంఖ్యను రాష్ట్రాల వారీగా వెల్లడించింది. ఇందులో ఎన్‌హెచ్‌ఎం నిధులతో నడిచేవి ఎన్ని? రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నడిచేవి ఎన్ని? అనే వివరాలను కూడా పేర్కొంది. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం నిధులతో నడిచే అంబులెన్స్‌లు 28,830 ఉన్నాయి. ఇందులో ఏఎల్ఎస్ వాహనాలు 3,044 ఉండగా, 15,283 బీఎల్ఎస్ వాహనాలు, ఇతర అంబులెన్స్‌లు 10,503 ఉన్నాయి. ఇక, రాష్ట్రాల నిధులతో పని చేసే అంబులెన్స్‌లు దేశవ్యాప్తంగా 11,615 ఉండగా వాటిల్లో 430 ఏఎల్ఎస్, 2,067 బీఎల్ఎస్, ఇతర అంబులెన్స్‌లు 9,118 ఉన్నాయి. ఇక తెలంగాణలో నడుస్తోన్న 456 సర్కారీ అంబులెన్స్‌లు ఎన్‌హెచ్‌ఎం నిధులతోనే నడుస్తున్నాయి. ఈ 456లో 425 బీఎల్ఎస్, 31 ఏఎల్ఎస్ అంబులెన్స్‌లు ఉన్నాయి.

జనాభాకు తగ్గట్లుగా లేని అంబులెన్స్‌లు

తెలంగాణ జనాభాకు తగిన విధంగా అంబులెన్స్‌లు లేవన్నది కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో ప్రతీ 83,991 మందికి ఒక సర్కారీ అంబులెన్స్ అందుబాటులో ఉంది. సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో 3 కోట్ల జనాభా ఉంటే అక్కడ 1,163 అంబులెన్స్‌లున్నాయి. అక్కడ ప్రతీ 25,795 మందికి ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంది. అత్యధిక సర్కారు అంబులెన్స్‌లు ఉన్న రాష్ట్రంగా నిలిచిన మహారాష్ట్రలో ప్రతీ 17,709 మందికి ఓ అంబులెన్స్ ఉంది. యూపీలో 4,720 అంబులెన్స్‌లు ఉండగా ప్రతీ 51,694 మందికి ఒక వాహనం అందుబాటులో ఉంది.

ఏమిటీ ఏఎల్ఎస్, బీఎల్ఎస్ ?

ఏఎల్ఎస్ అంబులెన్స్ అంటే అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ వ్యవస్థ కలిగిన అంబులెన్స్ అని అర్థం. తీవ్రమైన అనారోగ్యం, రోడ్డు ప్రమాదాని గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులు ఆస్పత్రిలో చేరే లోపు ప్రాణం కోల్పోకుండా ఉండేందుకు అవసరమైన తక్షణ వైద్య సాయం అందించేందుకు కావాల్సిన వసతులు, శిక్షణ పొందిన సిబ్బంది ఈ ఏఎల్ఎస్‌లో ఉంటాయి. స్ట్రెచర్, పోర్టబుల్ ఆక్సిజన్ సిలిండర్, మల్టీపారా మానిటర్, పల్స్ ఆక్సీమీటర్, పోర్టబుల్ సక్షన్, ఇన్‌ఫ్యూజన్ పంప్‌లు, నెబ్యులైజర్, ఐవీ ఫ్లూయిడ్స్, ఎమర్జెన్సీ మెడిసిన్, మరికొన్ని వైద్య పరికరాలు ఏఎల్ఎస్‌ల్లో ఉంటాయి. ఇక, బీఎల్ఎస్ అంబులెన్స్ అంటే బేసిక్ లైఫ్ సపోర్టు వ్యవస్థ కలిగిన వాహనాలు. ఈ బీఎల్ఎస్ వాహనాల్లో సక్షన్ యూనిట్, మెడికల్ బ్యాగ్, డీఫిబ్రిలేటర్, వెంటిలేటర్, ప్రథమ చికిత్స అందించేందుకు కావాల్సిన మందులు, పరికరాలు ఉంటాయి.


చర్లపల్లి రైల్వే టెర్మినల్

నేడు చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం

» వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, హైదరాబాద్, కుషాయిగూడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సర్వహంగులతో స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో అధునాతనంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ సోమవారం ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభం కానుంది. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. కాగా, ప్రారంభోత్సవ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసార వీక్షణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రులు మంత్రి జి.కిషన్ రెడ్డి, వి.సోమన్న, రవనీత్ సింగ్, బండి సంజయ్, గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, జనవరి 7 నుంచి సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్-గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళ్లు (12603-12604) మార్చి 7 నుంచి, గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.

పలు ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపన

ప్రధాని మోదీ సోమవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పలు రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభం, శంకుస్థాపన చేయనున్నారు. కొత్తగా జమ్మూ రైల్వే డివిజన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఈస్ట్ కోస్ట్ రైల్వేకు చెందిన రాయగడ రైల్వే డివిజన్ భవనానికి శంకుస్థాపన చేస్తారు.

సాగర్‌కు గోదావరి-కావేరి గండం!

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకునేందుకు అనుమతివ్వాలని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదనలు

» ఇప్పటికే వ్యతిరేకించిన తెలంగాణ

» ట్రైబ్యునల్ తీర్పు తర్వాత ఆలోచిస్తామని వెల్లడి

» అనుమతిస్తే సాగర్.. మరో శ్రీశైలమే

» ప్రమాదం పొంచి ఉందంటున్న నిపుణులు



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ అనుసంధానంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా నాగార్జునసాగర్‌ను వాడుకుంటే తిప్పలు తప్పవా? ప్రస్తుతం శ్రీశైలంలో ఉత్పన్నమవుతున్న సమస్యలు మున్ముందు సాగర్‌లో చూడక తప్పని పరిస్థితి నెలకొంటుందా? అంటే.. అవుననే అంటున్నారు నిపుణులు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా నాగార్జున సాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకుంటామని జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) ఇటీవల ప్రతిపాదించగా... తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. బ్రిజేష్ ట్రైబ్యునల్ తీర్పు తర్వాత జలాల పంపిణీ, ప్రాజెక్టు ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై స్పష్టత వచ్చాకే ఈ అంశంపై ఆలోచిస్తామని స్పష్టం చేసింది. పలువురు నిపుణులు మాత్రం ఈ ప్రతిపాదననే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది అమల్లోకి వస్తే సాగర్ మరో శ్రీశైలంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కుడికాలువ మరో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీగా మారే ప్రమాదం ఉందని చెబుతున్నారు. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వినియోగించుకునేందుకు అనుమతిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి నీటిని తరలించే అంశంపై తెలుగు రాష్ట్రాల మధ్య ఇప్పటికే పలు వివాదాలు ఉన్నాయి. ఏడాదిలో కృష్ణా బోర్డు/కేంద్రానికి తెలుగు రాష్ట్రాలు 20 లేఖలు రాస్తే... అందులో 15కిపైగా శ్రీశైలం ప్రాజెక్టుపైనే ఉంటాయి. పోతిరెడ్డిపాడుతో పాటు ముచ్చుమర్రి, బనకచర్ల, మల్యాల నుంచి నీటిని ఏపీ తరలించకుండా అడ్డుకోవాలని తెలంగాణ, కల్వకుర్తి నుంచి నీటిని తరలించకుండా ఆపాలని, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని అడ్డుకోవాలని ఏపీ లేఖలు రాస్తుంది. గోదావరి-కావేరి అనుసంధానంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోవడానికి అనుమతి ఇస్తే... సాగర్‌కు వచ్చే నీటికన్నా తరలించే నీరే అధికంగా ఉంటుందన్న వాదన వినిపిస్తోంది. హైదరాబాద్ తాగునీటి అవసరాలతోపాటు పలు జిల్లాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌ను ప్రమాదంలో పడేసే నిర్ణయాలపై పునరాలోచన చేసి, బలంగా వ్యతిరేకిస్తేనే సాగర్‌ను బతికించుకోగలమని అభిప్రాయపడుతున్నారు.

సెల్ఫీ కోసం కాలువలోకి దిగి విద్యార్థి గల్లంతు

» మరొకరిని కాపాడిన పశువుల కాపరి

» ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో ఘటన


శివ (ఫైల్)

కల్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ సరదా ఓ విద్యార్థి ప్రాణాలు తీసింది. మరో విద్యార్థి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పడమటలోకవరం గ్రామ సమీపంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. పడమటలోకవరం గ్రామానికి చెందిన పరిమి శివ (19) కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవురోజు కావటంతో తన స్నేహితులైన గోకవరం గ్రామానికి చెందిన సంపత్, కల్లూరుకు చెందిన కల్యాణ్‌తో కలిసి పడమటలోకవరం గ్రామ సమీపంలోని సాగర్ కాల్వ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో శివ, సంపత్ సెల్ఫీ దిగేందుకు కాల్వ లోపలకు దిగగా ప్రమాదవశాత్తు లోతులోకి జారిపోయి నీటిలో మునిగారు. శివ కాల్వలో గల్లంతవగా, సమీపంలోనే ఉన్న ఓ పశువుల కాపరి కర్ర సాయంతో సంపత్‌ను కాపాడాడు. శివ తండ్రి కొన్నేళ్ల క్రితం మృతి చెందగా తల్లి కూలి పనులు చేస్తూ అతడిని చదివిస్తోంది.

ఔర్ ఏక్ దక్కా... వర్గీకరణ పక్కా: మందకృష్ణ

» ఫిబ్రవరి 7న లక్ష డప్పులు-వెయ్యి గొంతుకల కార్యక్రమం

గజ్వేల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఔర్ ఏక్ దక్కా.. ఎస్సీ వర్గీకరణ పక్కా అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం నిర్వహించిన మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణకు అనుకూలంగానే ఉన్నారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ఓ మంత్రి ఆర్డినెన్స్ తేకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. 30 ఏళ్ల పోరాటం అందరి మద్దతు, అనేక త్యాగాలు, పోరాటాలతో తుది దశకు చేరుకుందని, మరోసారి గట్టిగా పోరాడితే వర్గీకరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీసీ సంఘం నాయకుడు ఆర్ కృష్ణయ్య పదేళ్లలో ఐదు కండువాలు మార్చారని, తాను మాత్రం వర్గీకరణే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. పదవులు ముఖ్యం కాదని, వర్గీకరణ సాధిస్తే వచ్చే వంద తరాలు బాగుపడతాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరుగబోయే లక్ష డప్పులు, వెయ్యిగొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


మంత్రి పొన్నంతో మాట్లాడుతున్న విద్యార్థినులు

దయచేసి మాకు డిగ్రీ చదివే అవకాశం కల్పించండి

» గురుకుల కళాశాల్లోనే డిగ్రీ ఏర్పాటు చేయండి

» మంత్రి పొన్నంకు గురుకుల విద్యార్థినుల వినతి

హుస్నాబాద్, హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తమకు డిగ్రీ చదివే అవకాశం కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురుకుల విద్యార్థినులు విజ్ఞప్తి చేశారు. పొన్నం ప్రభాకర్ ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను, కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు డిగ్రీ కూడా ఇక్కడే చదువుకునేందుకు అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. తాము ఇంటర్ పూర్తి చేసి ఇంటికి వెళ్లగానే తల్లిదండ్రులు పెళ్లి చేసేస్తారని ముస్లిం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకూ ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు చేయాలని ఉందని చెప్పారు. మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలను డిగ్రీ వరకు అప్‌డేట్ చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం అప్పటికప్పుడు మైనార్టీ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ తాఫ్సీర్ ఇక్బాల్, సీఎం సెక్రెటరీ షానవాజ్ ఖాసీంతో ఫోన్‌లో మాట్లాడారు. మైనార్టీ గురుకులల్లో తప్పకుండా డిగ్రీ చదివేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

మరో 10 వేల మందికి కాటమయ్య రక్షణకిట్‌లు:

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 వేల మంది కల్లు గీత కార్మికులకు శిక్షణ ఇప్పించి కాటమయ్య రక్షణ కవచాల కిట్‌లను అందించనున్నట్లు మంత్రి పొన్నం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆయా జిల్లాల బీసీ సంక్షేమాభివృద్ధి అధికారులు, జిల్లా కలెక్టర్‌ల మార్గదర్శకత్వంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు గౌడ వర్గానికి చెందిన అర్హత కలిగిన కల్లు, గీత కార్మికులను గుర్తిస్తారని చెప్పారు. వేరే ప్రాంతాల్లో పనిచేసే కల్లు, గీత కార్మికులు ఆయా ప్రాంతాల్లోని అధికారులను సంప్రదించి ఈ కిట్‌లను పొందాలని సూచించారు. 18 ఏళ్ల వయసు దాటిన వారే ఈ రక్షణ కిట్ లు పొందేందుకు అర్హులని మంత్రి స్పష్టం చేశారు. మొదటి విడతలో 15 వేల మందికి శిక్షణ ఇప్పించి ఈ కిట్‌లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

అటవీ అధికారులపై దాడి

» ఆదిలాబాద్ జిల్లా కేశవపట్నంలో తిరగబడ్డ గ్రామస్థులు

» రెండు వాహనాల అద్దాలు ధ్వంసం


స్వాధీనం చేసుకున్న కలపను తీసుకెళ్తుండగా అటవీ అధికారులను చుట్టుముట్టిన గ్రామస్థులు

ఇచ్చోడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవపట్నంలో భారీగా కలప నిల్వ ఉందన్న సమాచారంతో ఆదివారం అటవీ సిబ్బందితో పాటు పోలీసులు నిర్బంధ తనిఖీలు చేయగా స్థానికులు కొందరు రాళ్లతో దాడి చేశారు. ముందుగా ఎఫ్ఏఏ రేవంత్‌చంద్ర, ఎస్ఆర్ పుండలిక్, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్‌లతో పాటు ఇచ్చోడ, నేరడిగొండ ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్, సిబ్బంది గ్రామంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు రాళ్లు రువ్వడంతో అయిదుగురు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. రెండు అటవీ శాఖ వాహనాల అద్దాలు పగిలిపోయాయి. సేకరించిన కలపను ఎత్తుకెళ్లారు. వెంటనే సీఐ భీమేష్‌తో పాటు పోలీసులు మోహరించి ఆ కలపను స్వాధీనం చేసుకున్నారు. దాదాపుగా రూ.3.50 లక్షల విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ ఇచ్చోడ అటవీ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. స్మగ్లింగ్ జరుగుతుందన్న సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదేశాలతో అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు పోలీసుల సహకారంతో ఆదివారం తనిఖీలు నిర్వహించామన్నారు. సిబ్బందిపై దాడి జరగలేదని చెప్పారు. అలాంటి దాడి జరిగితే ఇంత విజయవంతంగా తనిఖీలు నిర్వహించే వాళ్లం కాదన్నారు. త్వరలోనే గ్రామస్థుల తోడ్పాటుతో నిందితులను అరెస్టు చేస్తామన్నారు.

పెద్దసారు మమ్మల్ని కలుస్తలేరు

» గెలిపించాక అసలు కనిపించడమే లేదు

» బీఆర్ఎస్ మనోహరాబాద్ సమావేశంలో కేసీఆర్ తీరుపై నేతలు, కార్యకర్తల ఆవేదన

తూప్రాన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'కష్టపడి అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దసారు (కేసీఆర్)ను గెలిపించుకున్నాం, గెలిచిన తర్వాత మమ్మల్ని కలువడం లేదు. అసలే కనిపించకుండా పోతే కార్యకర్తల కష్ట సుఖాలను ఎవరు పట్టించుకుంటారు' అంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇమాంపూర్ శివారులో బీఆర్ఎస్ పార్టీ మనోహరాబాద్ మండల సమావేశాన్ని జిల్లా నాయకులు ర్యాకల శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. కేసీఆర్ ఫాంహౌజ్‌లో కూడా తమను కలవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరునెలల క్రితం మండల అధ్యక్షుడు పార్టీని వీడితే ఇప్పటికీ అధ్యక్షుడిని నియమించలేదని అన్నారు. మాజీమంత్రి హరీశ్‌రావు కూడా తమను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తారని ప్రచారం జరుగుతోందని, అరెస్టు చేస్తే మండల అధ్యక్షుడు లేనిపక్షంలో ఎవరి ఆధ్వర్యంలో ఆందోళనలు చేయాలని ప్రశ్నించారు.

గోదాములోనే తలనీలాల నిల్వలు

» తీసుకెళ్లని కాంట్రాక్టర్

» కట్టాల్సింది రూ.10 కోట్లు.. గడువు మూడు నెలలే!

వేములవాడ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామికి భక్తులు సమర్పించే తలనీలాల నిల్వలు గోదాములో పేరుకుపోతున్నాయి. మార్కెట్‌లో తలనీలాలకు డిమాండ్ లేదనే కారణంతో కాంట్రాక్టర్ డబ్బులు చెల్లించకపోవడం, తీసుకెళ్లకపోవడంతో వాటిని ఆలయ కళా భవన్‌పై పోలీసు బందోబస్తు మధ్య ఆరబెడుతున్నారు. దీనికి దేవదాయ శాఖ కమిషనర్ ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురానికి చెందిన సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ 2023-2025 సంవత్సరాలకు రూ.19 కోట్లకు తలనీలాల టెండర్ దక్కించుకుంది. ప్రతి నెలా రూ.79 లక్షల పైచిలుకు చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. కానీ గత ఏడాది 31 మార్చి వరకు రూ.9 కోట్లు మాత్రమే కట్టి వదిలేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 15కల్లా రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉంది. మిగతా డబ్బులు కట్టాలని రాజన్న ఆలయాధికారులు సదరు సంస్థపై ఒత్తిడి చేయగా టెండర్ ధరకు గిట్టుబాటు కావడం లేదని చెప్పినట్లు తెలుస్తోంది. ఆ సంస్థ ఇచ్చిన రూ.79 లక్షల విలువగల ఆరు చెక్కులను బ్యాంకులో జమ చేయగా.. దాని ఖాతాలో డబ్బులు లేవని తేలింది. దీంతో ఆలయాధికారులు చెక్ బౌన్స్ కేసులు వేశారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా కోర్టు తీర్పు ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. ఒకవేళ సదరు సంస్థ మిగతా సొమ్ము రూ.9 కోట్లు చెల్లించకపోతే... నిల్వ చేసిన తలనీలాలను అమ్మినా రూ.4 నుంచి 5 కోట్ల వరకే వచ్చే అవకాశం ఉందని అంచనా. కాంట్రాక్టు గడువు ఏప్రిల్‌తో ముగియనుండడంతో ఆలోపు కొత్తగా టెండర్ పిలిచేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. రాజన్న ఆలయంలో రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే తలనీలాల టెండర్‌కు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కాంట్రాక్టర్లు పోటీ పడతారు.

బిజినెస్

వరంగల్ ● సోమవారం 6 జనవరి 2025

ఎంఎస్ఎంఈ ఫార్మా యూనిట్లకు ఊరట

జీఎంపీ ప్రమాణాలకు మరో ఏడాది

న్యూఢిల్లీ: చిన్న, మధ్యతరహా ఫార్మా కంపెనీలకు (ఎంఎస్ఎంఈ) ప్రభుత్వం పెద్ద ఊరట ఇచ్చింది. ఈ కంపెనీలు ఉత్తమ తయారీ విధానాలకు (జీఎంపీ) మారాల్సిన గడువును 2026 జనవరి 1 వరకు పొడిగించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కంపెనీలు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలన్నా, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) నిర్వహణలోని కార్యక్రమాలకు ఔషధాలు సరఫరా చేయాలన్నా జీఎంపీ సర్టిఫికేషన్ తప్పనిసరి. ప్రస్తుతం దేశంలో 10,500 ఫార్మా కంపెనీలుంటే అందులో 8,500 ఎంఎస్ఎంఈలు. ఇందులో 2,000 ఎంఎస్ఎంఈలకు మాత్రమే జీఎంపీ సర్టిఫికేషన్ ఉంది.

క్రిస్టల్ చేతికి బేయర్ 'ఇథాక్సిసల్ఫరాన్' బిజినెస్

న్యూఢిల్లీ: బేయర్ కంపెనీకి చెందిన 'ఇథాక్సిసల్ఫరాన్' బిజినెస్‌ను ప్రముఖ అంతర్జాతీయ ఆగ్రోకెమికల్ సంస్థ క్రిస్టల్ క్రాప్ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ రసాయన మందును వరి, సజ్జ వంటి పంటల్లో కలుపు మొక్కల నివారణకు ఉపయోగిస్తారు. అయితే ఎంత మొత్తానికి ఈ వ్యాపారాన్ని కొనుగోలు చేసింది కంపెనీ వెల్లడించలేదు.

మార్జిన్లకు ద్రవ్యోల్బణం గండి

ఎఫ్ఎంసీజీ కంపెనీల ఆందోళన



న్యూఢిల్లీ: మూడో త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ కంపెనీల మార్జిన్లకు ద్రవ్యోల్బణం గండి కొట్టనుంది. ద్రవ్యోల్బణం, అధిక ముడిసరకు వ్యయాల కారణంగా అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో తమ మార్జిన్లు ఒక మోస్తరుగానే ఉండవచ్చునని ఎఫ్ఎంసీజీ కంపెనీల ప్రతినిధులంటున్నారు. ఈ త్రైమాసికంలో మార్జిన్లు ఒక అంకెకే పరిమితం కావచ్చునని కూడా వారు అభిప్రాయపడుతున్నారు. కొబ్బరి, వెజిటబుల్ ఆయిల్, పామాయిల్ వంటి ముడిసరకు ధరలు 30 శాతం వరకు పెరిగిన కారణంగా ఆ ప్రభావాన్ని తట్టుకునేందుకు డిసెంబరు త్రైమాసికంలో చాలా కంపెనీలు ఉత్పత్తుల ధరలు పెంచాయి. పట్టణ మార్కెట్లలో వినియోగం తగ్గిన సమయంలో ధరలు పెంచడం వల్ల అమ్మకాలు కొంతమేరకు ప్రభావితం కావచ్చునంటున్నారు. అయితే గ్రామీణ మార్కెట్లలో మాత్రం పరిస్థితి కాస్తంత మెరుగ్గా ఉంది. ఒకపక్క ఆధునిక ట్రేడ్, ఇ-కామర్స్, క్విక్ కామర్స్ విభాగాలు బలమైన వృద్ధిని నమోదు చేయగా పరిసర కిరాణా దుకాణాలు మాత్రం అమ్మకాలపరంగా అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఒత్తిడిని ఎదుర్కొన్నట్టు డాబర్ ప్రతినిధి చెప్పారు. ముడి సరకు ధరల భారం కారణంగా రెండో త్రైమాసికంతో పోల్చితే తమ నిర్వహణా మార్జిన్ ఒక మోస్తరు స్థాయికే పరిమితం కావచ్చునని మారికో ప్రతినిధి అన్నారు. స్థూల మార్జిన్లలో క్షీణత ఊహించిన దాని కన్నా అధికంగానే ఉండవచ్చునన్నారు. ద్రవ్యోల్బణ ఒత్తిడులు, వేతనాల్లో స్వల్ప వృద్ధి, ఇళ్ల అద్దెల పెరుగుదల కారణంగా పట్టణ ప్రాంతాల డిమాండు వృద్ధి కాస్తంత ప్రతికూలంగానే ఉన్నదని నువామా చెబుతోంది. సబ్బులు, స్నాక్స్, టీ ధరల పెరుగుదల కారణంగా వినియోగదారులు చిన్న ప్యాక్‌ల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారంటున్నారు. ఇది తమ అమ్మకాలను ప్రతికూలంగా ప్రభావితం చేసిందని కంపెనీలు వెల్లడించాయి.

చలికాలం ఆలస్యంగా ప్రారంభం కావడం కూడా తమ మార్జిన్లకు గండి కొట్టిందని కంపెనీలంటున్నాయి. చలి ఆలస్యంగా ప్రారంభం కావడం వల్ల ఆ కాలంలో అధిక డిమాండు గల బాడీ లోషన్లు, చ్యవన్‌ప్రాశ్ విక్రయాలు జోరందుకోలేదని చెబుతున్నాయి. డీ2సీ బ్రాండ్లు అమ్మకాల్లో ఎదురీదుతున్నాయని, అదే సమయంలో క్విక్ కామర్స్ విక్రయాలు జోరందుకోవడం వల్ల కంపెనీల మార్జిన్లు ఒత్తిడికి లోనయ్యాయని డెలాయిట్ ఇండియా పార్టనర్ ఆనంద్ రామనాథన్ అన్నారు. అయితే జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఉండే పంటల కాలం వ్యవసాయ కమోడిటీల మార్జిన్ల ఒత్తిడిని కొంత మేరకు తగ్గించవచ్చునని, ఇది కమోడిటీ ధరలపై కూడా ఒత్తిడి తగ్గడానికి దారి తీస్తుందని ఆయన చెప్పారు.

ఉపాధి కల్పనకు సప్తసూత్ర అజెండా

సీఐఐ బడ్జెట్ కోరికల చిట్టా

న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగాల కల్పనకు కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని చర్యలు తీసుకోవాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వాన్ని కోరింది. సమ్మిళిత అభివృద్ధికి, యువత శక్తి సామర్థ్యాలను మరింత నిర్మాణాత్మకంగా ఉపయోగించుకునేందుకు భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన అవసరమని స్పష్టం చేసింది. 2050 నాటికి మన దేశం 13.3 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉందని గుర్తు చేసింది. ఇందుకోసం ఏడు అంశాలతో ఒక అజెండాను సూచించింది. ప్రస్తుతం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ ఉద్యోగ, ఉపాధి పథకాలను విలీనం చేసి ఒక సమగ్ర జాతీయ ఉపాధి విధానం తీసుకురావాలని కోరింది. దీనికి తోడు కార్మిక శక్తి అధికంగా ఉండే పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, విదేశీ ఉద్యోగాల కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటు వంటి చర్యలు అవసరమని పేర్కొంది.

ప్రత్యేక ఇంటర్న్‌షిప్: దీనికి తోడు కాలేజీల్లో చదువు పూర్తి చేసిన వారి కోసం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్న్‌షిప్ పథకం ప్రారంభించాలని సూచించింది. దీని వల్ల వారికి స్వల్పకాలిక ఉపాధి లభించడంతో పాటు, వృత్తి నైపుణ్యాలు పెంపొందుతాయని సీఐఐ తెలిపింది. ఉద్యోగాల కల్పనకు కంపెనీలు చేసే ఖర్చులను ఐటీ చట్టం నుంచి మినహాయించేలా ప్రత్యేక సెక్షన్ తీసుకు రావాలని కూడా కోరింది. రాయితీల పన్ను విధానం ఎంచుకున్న కంపెనీలకూ ఈ మినహాయింపును వర్తింప చేయాలని సూచించింది.

మహిళా ఉపాధి: ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళల పాత్ర తక్కువగా ఉండడంపై సీఐఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రంగాల్లో వీరి పాత్ర పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని తెలిపింది. సామాజిక బాధ్యత కింద కంపెనీలు (సీఎస్ఆర్) ఖర్చు చేసే నిధులతో పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళల కోసం వసతి సముదాయాలు, చిన్న పిల్లల సంరక్షణ వసతులు ఏర్పాటు చేయడం ఇందుకు బాగా కలిసి వస్తుందని సూచించింది. తాత్కాలిక లేదా కాంట్రాక్టు ఉద్యోగులు (గిగ్ వర్కర్లు), ఓలా, ఊబర్, స్విగ్గీ వంటి ప్లాట్‌ఫామ్స్ కోసం పని చేసే తాత్కాలిక ఉద్యోగులకూ కార్మిక చట్టాలు వర్తింపచేసి, వారికీ సామాజిక భద్రత కల్పించాలని సీఐఐ సూచించింది.

24300 పైన బుల్లిష్

(జనవరి 6-10 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 24005 (+192)

నిఫ్టీ గత వారం 24226-23460 పాయింట్ల మధ్యన కదలాడి 192 పాయింట్ల లాభంతో 24005 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23948, 23821, 23959, 24189 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 24300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23600

నిరోధ స్థాయిలు: 24200, 24300, 24400 (24100 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23800, 23700, 23600 (23900 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	500
చిత్తూరు	543	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	111	విజయవాడ	113
వరంగల్	111	గుంటూరు	110
కరీంనగర్	111	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	111	చిత్తూరు	82
కర్నూలు	111	నెల్లూరు	87
విశాఖపట్నం	104	అనంతపురం	87
గోదావరి	113		

ఈ వారంలోనూ అప్రమత్తతే మేలు

స్టాక్ మార్కెట్ ఈ వారం మిశ్రమంగా కదలాడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ పరిణామాలను బట్టి సూచీల గమనం ఉంటుంది. రూపాయి బలహీనత, ఎఫ్‌పీఐల అమ్మకాలు, ఆర్థిక మందగమనం ఈ వారం మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేయనున్నాయి. గత వారం రియల్టీ, మెటల్ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనైతే, ఆటో, ఫైనాన్స్, కన్సూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రస్తుతం ఫార్మా, హెల్త్‌కేర్ కంపెనీల షేర్లు బుల్లిష్‌గా కనిపిస్తున్నాయి. ఈ అనిశ్చితి నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండడమే మంచిది.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

ఎన్‌టీపీసీ: జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి ఎన్‌టీపీసీ షేర్లు ప్రస్తుతం 30 శాతం దిద్దుబాటుకు లోనయ్యాయి. కీలక మద్దతు స్థాయి రూ.300 వద్ద టర్న్ అరౌండ్ అయిన, ఈ కంపెనీ షేర్లు గత నాలుగు సెషన్లుగా అప్‌ట్రెండ్‌లో ట్రేడవుతున్నాయి. గత వారం రూ.339 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.365/385 టార్గెట్‌తో రూ.345 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్ లాస్ : రూ.338.

హెచ్‌సీఎల్ టెక్: ఈ కంపెనీ షేర్లు గత వారం రూ.1,946.65 వద్ద క్లోజయ్యాయి. డాలర్‌తో రూపాయి పతనంతో ప్రస్తుతం ఐటీ రంగం బుల్లిష్‌గా కనిపిస్తోంది. దీంతో ఈ కౌంటర్‌లో ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ క్రమంగా పెరుగుతున్నాయి. రూ.1,950 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,860పై స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1,840.

మ్యాక్స్ హెల్త్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు జీవిత కాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతున్నాయి. స్వల్ప పుల్‌బ్యాక్ తర్వాత మరింత బలం పుంజుకున్నాయి. దీనికి తోడు ప్రస్తుతం హెల్త్‌కేర్ సెక్టర్ బుల్లిష్‌గా ఉంది. గత వారం 1.64 శాతం లాభంతో రూ.1,178 వద్ద ముగిశాయి. రూ.1,250/1,310 టార్గెట్‌తో మదుపరులు రూ.1,180 స్థాయిలో ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్ లాస్ : రూ.1,165.

కోటక్ మహీంద్ర బ్యాంకు: గత కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో ఉన్న ఈ బ్యాంకు షేర్లు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్నాయి. ఈ సంవత్సరం బ్యాంకు ఆర్థిక ఫలితాలు బాగుంటాయని రేటింగ్ సంస్థల అంచనా. రూ.1,970 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.1,850 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1,830.

డాబర్: అక్టోబరు గ్యాప్‌డౌన్లతో ఈ కంపెనీ షేర్లు 26 శాతం మేర పతనమయ్యాయి. ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి రూ.500 వద్ద మద్దతు తీసుకుని పుంజుకుంటున్నాయి. గత వారం చివరి నాలుగు సెషన్లలోనూ బలం ప్రదర్శించాయి. 2.25 శాతం లాభంతో రూ.524 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.590 టార్గెట్‌తో రూ.528 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్ లాస్ : రూ.510.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24200 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కరెక్షన్‌తో ప్రారంభమై 23,500 కన్నా దిగజారినా రికవరీ సాధించింది. ఆ తర్వాత బలమైన పునరుజ్జీవం సాధించి వారం మొత్తం మీద 190 పాయింట్ల లాభంతో 24,000 కన్నా పైన క్లోజయింది. ముందు వారం బేరిష్ ట్రెండ్ అనంతరం ఏర్పడిన పుల్ బ్యాక్ రికవరీ ఇది. అయితే కరెక్షన్ అనంతరం నిలకడగా ముగియడం విశేషం. మార్కెట్ కనిష్ఠ స్థాయిల్లో మద్దతు పొందడం వల్ల తక్షణ ప్రమాదం నుంచి కూడా తప్పించుకుంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఈ వారంలో బలంగా నిలదొక్కుకోవడం అవసరం. అలాగే గత వారం మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 950 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 ఇండెక్స్ 280 పాయింట్లు లాభపడ్డాయి. గత శుక్రవారం నాటి ప్రపంచ మార్కెట్ ధోరణులను బట్టి ఈ వారంలో పాజిటివ్ ధోరణికి ఆస్కారం ఉంది. ఇప్పుడు నిఫ్టీ స్వల్పకాలిక నిరోధం 24,200 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: స్వల్పకాలిక పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 24,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన నిరోధ స్థాయిలు 24500, 24800.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేట్ అయి నిలదొక్కుకోవాలి. విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,800. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 23,500.

బ్యాంక్ నిఫ్టీ: వారం మొత్తం మీద ఈ సూచీ 320 పాయింట్ల మేరకు నష్టపోయినా మద్దతు స్థాయి 50,000 కన్నా చాలా పైన ఉంది. గత వారం 51,000 వద్ద క్లోజ్ కావడం కనిష్ఠ స్థాయిల్లో మద్దతు సాధించిందనేందుకు సంకేతం. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 51,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. నిరోధం 51,650. ప్రధాన నిరోధం 52,000. మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 50, 200 డీఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. 24,200 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. ఇక్కడ నిలదొక్కుకోవడం అవసరం. సానుకూలత కోసం 23,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,130, 24200
మద్దతు	23,950, 23880

స్పోర్ట్స్

'టెస్ట్'లపట్ల నిబద్ధత ఉంటే.. దేశవాళీల్లో ఆడాలి

ఆటగాళ్లకు కోచ్ గంభీర్ సూచన



సిడ్నీ: ఏ ఆటగాడైనా దేశవాళీ పోటీల్లో ఆడడం ద్వారా టెస్టు క్రికెట్ పట్ల తమ నిబద్ధతను నిరూపించుకోవాలని భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ సూచించాడు. దేశవాళీలకు అత్యధిక ప్రాధాన్యమివ్వకపోతే టెస్టుల్లో నాణ్యమైన ఆటగాళ్లను చూడలేమన్నాడు. ఇక ఫామ్‌లేమితో సతమతమవుతున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికీ తమ సత్తా నిరూపించుకోవాలన్న తపనతోనే ఉన్నారని చెప్పాడు. అదే సమయంలో భవిష్యత్‌లో భారత టెస్టు జట్టులో రోహిత్, కోహ్లీ స్థానాలకు గ్యారెంటీ మాత్రం గంభీర్ ఇవ్వకపోవడం గమనార్హం. పేలవ ఫామ్‌తో ఐదో టెస్టు నుంచి వైదొలగిన రోహిత్‌ను ప్రశంసించాడు.

జట్టులో చోటుకు కోహ్లీ అర్హుడు కాదు



సిడ్నీ: విరాట్ కోహ్లీ తీరుపై మాజీ పేసర్ ఇర్ఫాన్ పఠాన్ విరుచుకుపడ్డాడు. బ్యాటింగ్‌లో పదేపదే అదే తప్పు చేస్తుండడాన్ని దుయ్యబట్టాడు. తప్పులను అధిగమించేందుకు ఏ మాత్రం ప్రయత్నం చేయని కోహ్లీ..అసలు భారత జట్టులో చోటుకు అర్హుడే కాదని కుండబద్దలు కొట్టాడు. మనకు జట్టు సంస్కృతి కావాలే తప్ప సూపర్ స్టార్‌డమ్ కాదని చెప్పాడు.

లంకపై కివీస్ ఘన విజయం

వెల్లింగ్టన్: మ్యాట్ హెన్రీ (4/19) నిప్పులు చెరగడంతోపాటు విల్ యంగ్ (90 నాటౌట్) అర్ధ శతకం సాధించడంతో శ్రీలంకతో ఆదివారం జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత లంక 43.4 ఓవర్లలో 178 పరుగులకు కుప్పకూలింది. అవిష్క ఫెర్నాండో (56) హాఫ్ సెంచరీ చేశాడు. ఛేదనలో న్యూజిలాండ్ 26.2 ఓవర్లలో 180/1 స్కోరు చేసి గెలిచింది. రచిన్ రవీంద్ర (45) రాణించాడు. ఈ మూడు వన్డేల సిరీస్‌లోని రెండో మ్యాచ్ బుధవారం జరుగుతుంది.



సిరీస్ బెర్త్ చేజారె

ఆఖరి టెస్టులో 6 వికెట్లతో భారత్ ఓటమి

- బరిలోకి దిగని బుమ్రా
- 3-1తో ఆసీస్‌దే సిరీస్
- రెండో ఇన్నింగ్స్ 162/4
- డబ్ల్యూటీసీ ఫైనల్లో కంగారూలు



సిడ్నీ: ఒకే ఒక్క ఫలితం.. భారత టెస్టు జట్టును రెండు విధాలుగా దెబ్బకొట్టింది. ఆస్ట్రేలియాతో దాదాపు మూడు రోజుల్లోనే ముగిసిన ఐదో టెస్టులో భారత్ 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. దీంతో ఆసీస్ గడ్డపై 2018, 2020ల్లో వరుసగా రెండుసార్లు దక్కించుకున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 1-3 తేడాతో ఆతిథ్య జట్టుకు కోల్పోయింది. అంతేకాదు.. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలు కూడా గల్లంతయ్యాయి. డబ్ల్యూటీసీ రేసులో ఉండాలంటే టీమిండియా ఈ టెస్టులో కచ్చితంగా గెలవాల్సింది. దీంతో తొలి రెండు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లో ఆడిన టీమిండియాకు ఈసారి నిరాశే ఎదురైంది. అటు సిడ్నీలో విజయంతో వరుసగా రెండోసారి ఆస్ట్రేలియా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఈ ఏడాది జూన్ 16 నుంచి లార్డ్స్‌లో జరిగే తుది పోరులో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు సిడ్నీ టెస్టును గెలుచుకునేందుకు ఆదివారం ఆసీస్ 162 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగింది. ఓపెనర్ ఖవాజా (41), వెబ్‌స్టర్ (39 నాటౌట్), హెడ్ (34 నాటౌట్) రాణించడంతో తమ రెండో ఇన్నింగ్స్‌లో 27 ఓవర్లలోనే 4 వికెట్లకు 162 పరుగులు చేసి గెలిచింది. పేసర్ ప్రసిద్ధ్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 157 పరుగులు చేసింది. 141/6 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 16 పరుగులు మాత్రమే జోడించి చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. జడేజా (13), నితీశ్ (4) విఫలమయ్యారు. బోలాండ్‌కు ఆరు, కమిన్స్‌కు మూడు వికెట్లు లభించాయి. ఇక భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 185, ఆసీస్ 181 పరుగులు చేశాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బోలాండ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా బుమ్రా నిలిచారు.

1 — ఆసీస్ గడ్డపై జరిగిన టెస్టుల్లో ఎక్కువ రన్‌రేట్ (6.00)తో 100+ రన్స్ ఛేదించడం ఇదే తొలిసారి.

సిడ్నీలో 129 ఏళ్ల తర్వాత అత్యంత వేగం (1141 బంతుల్లో)గా ముగిసిన టెస్టు ఇదే.

దూకుడుగా ముగించారు: వెన్నునొప్పి కారణంగా తాత్కాలిక కెప్టెన్ బుమ్రా ఆదివారం కూడా పెవిలియన్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడు లేని భారత బౌలింగ్ విభాగం ఛేదనలో ఆసీస్‌ను అడ్డుకోలేకపోయింది. 162 పరుగుల ఛేదనను కంగారూలు ఆరు పరుగుల రన్‌రేట్‌తో దూకుడుగా ఆడి రెండో సెషన్‌లోనే ముగించారు. ఓపెనర్లు కాన్‌స్టాస్ (22), ఖవాజా తొలి వికెట్‌కు 3.5 ఓవర్లలోనే 39 పరుగులు జత చేశారు. అయితే స్వల్ప వ్యవధిలో కాన్‌స్టాస్, లబుషేన్ (6), స్మిత్ (4)ల వికెట్లను తీసి పేసర్ ప్రసిద్ధ్ కాస్త ఒత్తిడి పెంచాడు. అప్పటికి ఆసీస్ విజయానికి మరో 58 పరుగుల దూరంలో ఉంది. ఈ దశలో బుమ్రా కూడా మైదానంలో ఉండుంటే పరిస్థితి మరోలా ఉండేదేమో. కానీ హెడ్, బోలాండ్‌ను భారత్ కట్టడి చేయలేకపోయింది. ఈ జోడీ ఎలాంటి తడబాటు లేకుండా ఐదో వికెట్‌కు అజేయంగా 53 బంతుల్లో 58 పరుగులు జోడించడంతో ఆసీస్ సంబరాలు ఆకాశాన్నంటాయి.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 185

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 181

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) బోలాండ్ 22; రాహుల్ (బి) బోలాండ్ 13; గిల్ (సి) క్యారీ (బి) వెబ్‌స్టర్ 13; కోహ్లీ (సి) స్మిత్ (బి) బోలాండ్ 6; పంత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 61; జడేజా (సి) క్యారీ (బి) కమిన్స్13; నితీశ్ (సి) కమిన్స్ (బి) బోలాండ్ 4; సుందర్ (బి) కమిన్స్ 12; సిరాజ్ (సి) ఖవాజా (బి) బోలాండ్ 4; బుమ్రా (బి) బోలాండ్ 0; ప్రసిద్ధ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 39.5 ఓవర్లలో 157 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-42, 2-47, 3-59, 4-78, 5-124, 6-129, 7-147, 8-156, 9-156, 10-157; **బౌలింగ్:** స్టార్క్ 4-0-36-0; కమిన్స్ 15-4-44-3; బోలాండ్ 16.5-5-45-6; వెబ్‌స్టర్ 4-1-24-1.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (సి) సుందర్ (బి) ప్రసిద్ధ్ 22; ఖవాజా (సి) పంత్ (బి) సిరాజ్ 41; లబుషేన్ (సి) జైస్వాల్ (బి) ప్రసిద్ధ్ 6; స్మిత్ (సి) జైస్వాల్ (బి) ప్రసిద్ధ్ 4; హెడ్ (నాటౌట్) 34; వెబ్‌స్టర్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 27 ఓవర్లలో 162/4; వికెట్ల పతనం:** 1-39, 2-52, 3-58, 4-104; **బౌలింగ్:** సిరాజ్ 12-1-69-1; ప్రసిద్ధ్ 12-0-65-3; నితీశ్ 2-0-10-0; సుందర్ 1-0-11-0.

తీరని వ్యథ వెనుక..

భారత జట్టు తీరు మారలేదు.. అభిమానులకు గుండె కోత తప్పలేదు. 2018లో కోహ్లీ హయాంలో, 2020లో రహానె కెప్టెన్సీలో ఆసీస్ గడ్డపై చారిత్రక విజయాలను చవి చూసిన టీమిండియా.. ఈసారి ఘోర ప్రదర్శనతో దశాబ్దం తర్వాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని చేజార్చుకొంది. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో 0-3తో చిత్తుగా ఓడినా.. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో స్ఫూర్తిదాయక విజయం సాధించిన భారత జట్టు మళ్లీ అదే తరహా ప్రదర్శన చేయలేక పోయింది. అందుకు ప్రధాన కారణం జట్టు బ్యాటింగ్ వైఫల్యం. సిరీస్‌లోని మొత్తం ఐదు టెస్టుల్లో ఆరుసార్లు భారత్ 200 పరుగుల స్కోరు కూడా దాటలేకపోవడం దారుణం. పెర్త్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 150 రన్స్‌కే కుప్పకూలినా.. రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్, కోహ్లీ శతకాలతో అద్భుత విజయాన్ని అందుకొంది. కానీ, అడిలైడ్ టెస్టు నుంచి మన బ్యాటింగ్ డొల్లతనం బహిర్గతమైంది. మెల్‌బోర్న్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల వైఫల్యం కారణంగా డ్రా చేసుకోవాల్సిన మ్యాచ్‌ను చేజార్చుకొని 1-2తో వెనుకబడింది. తప్పక గెలవాల్సిన సిడ్నీ టెస్టులోనూ ఆశించిన స్థాయిలో ఆడలేక సిరీస్‌తోపాటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలనూ చేజార్చుకొంది. బ్యాటర్లు వరుసగా విఫలమవుతున్నా.. వారిని సరిదిద్దుకోలేక పోవడమనే సమస్య ఏళ్లుగా వెంటాడుతోంది. ఆఫ్‌స్టంప్‌పై పడే బంతులను వెంటాడి అవుటయ్యే బలహీనతను కోహ్లీ అధిగమించలేక పోతున్నాడు. రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో జట్టుకు భారంగా మారాడు. వీరిద్దరి వరుస వైఫల్యాలతో టీమిండియా తొమ్మిది మందితోనే ఆడుతోందన్న సెటైర్లు సోషల్ మీడియాలో పేలుతూనే ఉన్నాయి. బౌలింగ్ విషయానికొస్తే బుమ్రా ఒంటరి పోరాటం చేశాడు. సహచరుల నుంచి కనీస సహకారం అందకపోయినా.. అతడు మాత్రం జట్టు విజయం కోసం పాటుపడ్డాడు. తొలి టెస్టు విజయంలో బుమ్రా పాత్ర ఎంతో ఉంది. సిరాజ్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా ఎప్పుడో మెరుపులు తప్ప నిలకడ ప్రదర్శించలేదు. ఆఖరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో గాయం కారణంగా బుమ్రా బౌలింగ్‌కు దూరం కావడంతో మ్యాచ్ ఫలితం ముందుగానే తెలిసిపోయింది. మొత్తంగా ఈ సిరీస్‌తోనైనా కళ్లు తెరచి.. జట్టును ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. సంధి దశలో ఉన్న భారత జట్టు కోసం మెరికల్లాంటి యువ ఆటగాళ్లను వెతికిపడితే.. టీమిండియా మళ్లీ పుంజుకొనే అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అలా.. వాళ్ల నోళ్లు మూయించాడు!



మైదానంలో విరాట్ కోహ్లీ దూకుడు అలా.. ఇలా ఉండదు. టీమిండియాను ఎవరు ఎద్దేవా చేసినా ఉపేక్షించడు. అతిగా ప్రవర్తించిన ఆస్ట్రేలియా ఫ్యాన్స్‌కు తనదైనరీతిలో బదులిచ్చాడు విరాట్. ఇంతకీ ఏం జరిగిందంటే..సిడ్నీ టెస్టు రెండో రోజు ఆటలో భారత క్రికెటర్ బుమ్రా బూటు సరి చేసుకుంటుండగా దాని లోంచి ఓ పేపర్ లాంటిది వచ్చింది. దాంతో భారత ఆటగాళ్లు 'శాండ్ పేపర్' ఉపయోగిస్తున్నారని ఆసీస్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఆరోపణలు గుప్పించారు. ఇక సీన్ కట్ చేస్తే..ఆదివారం ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో స్మిత్ అవుటయ్యాక..తన ప్యాంటు జేబుల్లో, ఇంకా ప్యాంటు లోపలా ఎక్కడా 'శాండ్ పేపర్' లాంటిది ఏదీ లేదంటూ ఆతిథ్య జట్టు ఫ్యాన్స్‌కు సంజ్ఞ చేయడం ద్వారా కోహ్లీ వాళ్ల నోళ్లు మూయించాడు. 2018 దక్షిణాఫ్రికా పర్యటనలో ఆసీస్ బ్యాటర్ బాన్‌క్రాఫ్ట్ శాండ్ పేపర్‌తో బంతికి మెరుపు తెస్తూ టీవీ కెమెరాకు దొరికిపోయిన సంగతి తెలిసిందే. ఆ ఉదంతంలో నాటి ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్-కెప్టెన్ వార్నర్ కూడా దోషులుగా తేలారు. 'శాండ్ పేపర్ గేట్' కుంభకోణంగా పేరుపొందిన ఆ ఘటనలో బాన్‌క్రాఫ్ట్, స్మిత్, వార్నర్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా వేటు వేసింది. అలా..ఆ ఘటనను కోహ్లీ గుర్తు చేస్తూ ఆసీస్ ఫ్యాన్స్‌కి షాకిచ్చాడు.

ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ గెలుపు

అహ్మదాబాద్: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ఆదివారం అరుణాచల్ ప్రదేశ్ జట్టుతో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్లతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన అరుణాచల్.. స్పిన్నర్లు తనయ్ త్యాగరాజన్ (5/32), అనికేత్ రెడ్డి (4/14) ధాటికి 28.3 ఓవర్లలో 96 పరుగులకే ఆలౌటైంది. ఛేదనలో హైదరాబాద్ టీ20 తరహాలో ఆడి 12 ఓవర్లలోనే 100/2 స్కోరు చేసి నెగ్గింది. ఇక, గ్రూప్-సిలోని హైదరాబాద్ 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ఈ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

గవాస్కర్‌ను పక్కనబెట్టారు





భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే టెస్టు సిరీస్‌లను 1996-97 నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీగా పిలుస్తున్నారు. అయితే తాజా సిరీస్‌లో ట్రోఫీని ఆ ఇద్దరు దిగ్గజాలు సంయుక్తంగా అందిస్తే బావుండేది. కానీ బోర్డర్ ఒక్కడే బహూకరించడం చర్చనీయాంశమైంది. ఆ సమయంలో గవాస్కర్ మైదానంలోనే ఉన్నాడు. అయితే ఈ టెస్టుకు ముందే సన్నీకి ఈ విషయంలో అధికారులు స్పష్టతనిచ్చారట. 'ఒకవేళ భారత్ సిడ్నీ టెస్టులో ఓడినా, డ్రా చేసుకున్నా ట్రోఫీని అందించేటప్పుడు మీ అవసరం లేదని నాకు చెప్పారు. ఆ సమయంలో కాస్త అయోమయానికైతే గురయ్యా. ఎందుకంటే ఇది బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కదా. ఇద్దరం కలిసి అందిస్తేనే బావుంటుంది. ఆసీస్ గెలిచినందుకు నేను భారతీయుడిని కాబట్టి ట్రోఫీని అందించకూడదేమో' అని గవాస్కర్ అన్నాడు. మరోవైపు సన్నీని ఆహ్వానించకపోవడంపై క్రికెట్ ఆస్ట్రేలియా స్పందించింది. ఇద్దరినీ వేదికమీదకు పిలిస్తే బావుండేదని, కానీ ఆసీస్ గెలిస్తే బోర్డర్.. భారత్ గెలిస్తే గవాస్కర్ ట్రోఫీని అందించాలని ముందే నిర్ణయించినట్టు తేల్చింది.

ఓల్డ్‌సిటీ మెట్రోకు మద్దతు!

» కారిడార్ నిర్మాణంలో 1100 ఆస్తులు ప్రభావితం

» ఆస్తులు ఇచ్చేందుకు నిర్వాసితుల సుముఖత

» అనుమతి పత్రాలిచ్చిన 169 మంది.. నేడు చెక్కుల పంపిణీ

హైదరాబాద్ సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌సిటీ వాసులు మెట్రో రైలు కోసం మద్దతు పలుకుతున్నారు. తమ ప్రాంతంలో మెట్రో కలను నెరవేర్చుకోవడంలో భాగంగా ఆస్తులను ఇచ్చేందుకు సుముఖత చూపిస్తున్నారు. దీంతో ఇక్కడ కారిడార్ నిర్మాణానికి అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. కారిడార్-6లో ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట మధ్య చేపడుతున్న 7.5 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణంలో భాగంగా 1100 ఆస్తులు ప్రభావితమవుతున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్) అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఇందులో దాదాపు 90 శాతం మంది ఆస్తులను ఇచ్చేందుకు సిద్ధంగా ఉండగా, కేవలం 10 శాతం మంది ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. చదరపు గజానికి రూ.81వేలతో పాటు భవన నిర్మాణానికి అదనంగా మరికొంత ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండడంతో నిర్వాసితులు ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం 1100 మందిలో ఇప్పటివరకు 169మంది అనుమతి పత్రాలు ఇచ్చారు.

ఓల్డ్‌సిటీ నిర్వాసితులకు నేడు చెక్కుల పంపిణీ

ఓల్డ్‌సిటీ మెట్రో నిర్మాణంలో ఆస్తులను కోల్పోతున్న నిర్వాసితులకు సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిర్వాసితులకు చెక్కులను అందజేస్తారని తెలిపారు. మిగతా వారికి రసూల్‌పురాలోని మెట్రో భవన్‌లో అందజేస్తామన్నారు. కాగా, చెక్కులను అందజేసిన నిర్వాసితుల ఆస్తులను త్వరలో కూల్చివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఓ వైపు విడతల వారీగా చెక్కులను పంపిణీ చేస్తూనే కూల్చివేతలు కూడా చేపడతామన్నారు.

ఆలస్యమైనా హామీలన్నీ నిలబెట్టుకుంటాం

» 28 నుంచి రైతు భరోసా.. కూలీలకు ఈ నెల్లోనే 6వేలు

» ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే లక్ష్యం: దుద్దిళ్ల

ముత్తారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొంచెం ఆలస్యమైనా ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రధాన బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమేనని, అలా అయితేనే గ్యారెంటీలతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలవుతాయన్నారు. రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రైతు భరోసా ఇవ్వరని అసత్య ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా భూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12,000 ఇచ్చే కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో రూ. 6,000 ఈ నెలలో ఇవ్వబోతున్నామని చెప్పారు. అన్నదాతలకు సంబంధించి ఏ విషయంలోనూ రాజీ పడటం లేదని, రైతు భరోసా ఎకరాకు 12వేలు, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ కల్పించి రైతులను రాజులను చేసే దిశగా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. రైతు భరోసా ఈనెల 28 నుంచి మొదలు కాబోతుందని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

ఏడాది పాలనపై సమీక్ష!

» 8న టీపీసీసీ పీఏసీ భేటీ.. స్థానిక ఎన్నికలపై చర్చకు చాన్స్

» ఏఐసీసీ తరఫున హాజరు కానున్న వేణుగోపాల్

హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా పాలనా తీరుపై సమీక్షించేందుకు ఈ నెల 8న గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) భేటీ కానుంది. ఈ సమావేశానికి ఏఐసీసీ తరఫున సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హాజరుకానున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, పీఏసీ సభ్యులూ పాల్గొననున్నారు. వాస్తవానికి ఈ నెల 9న హైదరాబాద్‌లో పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం జరగనుంది. ఆ కమిటీకి చైర్మన్‌గా ఉన్న కేసీ వేణుగోపాల్.. సమావేశంలో పాల్గొనేందుకు ఈ నెల 8నే హైదరాబాద్ వస్తున్నారు. అయితే, ఏడాది పాలన, ఇతర అంశాలపైన సమీక్ష కోసం పీఏసీ సమావేశం నిర్వహించాలని భావిస్తున్న టీపీసీసీ.. కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో 8వ తేదీనే నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చింది. సాయంత్రం 6 గంటలకు గాంధీభవన్‌లో ప్రారంభం కానున్న సమావేశంలో ఏడాది పాలన-పనితీరు, స్థానిక సంస్థల ఎన్నికలు, కుల గణన, బాపూ.. అంబేడ్కర్ సంవిధాన్ యాత్ర నిర్వహణపై చర్చించనున్నారు. ఏడాది పాలనపై సమీక్షలో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుపైనా చర్చించే అవకాశం ఉంది. తనతోసహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల పనితీరుపై రిపోర్టు కార్డులు ఉన్నాయంటూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. పీఏసీ సమావేశంలో ఈ రిపోర్టు కార్డులు, ఏఐసీసీ నివేదికలను క్రోడీకరించి నాయకుల పని తీరుపై సమీక్షించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏఐసీసీ, టీపీసీసీ సంస్థాగత నిర్మాణంపైనా పీఏసీ సభ్యుల అభిప్రాయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అలాగే, ఏడాది పాలన తర్వాత జరగనున్న స్థానిక ఎన్నికలను క్లీన్ స్వీప్ చేయడానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఏయే బాధ్యతలు అప్పగించాలన్న దానిపైనా సమావేశంలో చర్చించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

రిటైరైన తర్వాత సైకిల్‌పై ఇంటికి..

» ఏపీలో ఐజీ వెంకట్రామి రెడ్డి నిరాడంబరత



రిటైర్ అయిన తర్వాత సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న ఐజీ వెంకట్రామిరెడ్డి

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): డబ్బు సంపాదన.. దర్పం.. రాజకీయ సాన్నిత్యం.. కుటుంబ స్వార్థం లాంటివి ఎక్కువగా కనిపిస్తున్న పోలీసు శాఖలో అవేవీ వద్దనే మహానుభావులు చాలా అరుదు!. ఆదాయం వచ్చే పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తూ లంచాలతో ప్రజల్ని పీడించుకుతినే ఖాకీలున్న చోట.. సమాజ సేవ తప్ప తనకూ ఇంకేమీ వద్దనే రక్షక భటులూ ఉన్నారంటే ఆశ్చర్యం కలుగకమానదు!. ముప్పై సంవత్సరాల క్రితం డీఎస్పీగా పోలీసు శాఖలో చేరి నిజాయితీగా పనిచేసి.. ఐజీ స్థాయికి ఎదిగిన వెకంట్రామి రెడ్డి అలాంటివారే!. ఆయన వారం క్రితం (డిసెంబరు 31న) పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ హోదాలో పదవీ విరమణ చేశారు. డీఎస్పీ స్థాయి నుంచి రిటైరయ్యే వరకూ ఆయనకు కారు, డ్రైవరు, గన్‌మెన్లు, సెల్యూట్లు అన్నీ ఉన్నాయి. కానీ అత్యంత సాధారణ జీవితం గడిపేందుకు ఇష్టపడే వెంకట్రామి రెడ్డి, రిటైరైన రోజున సైకిలు తొక్కుకుంటూ పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి నిష్క్రమించారు. ఆఖరికి వీడ్కోలు సందర్భంగా ఘనంగా సన్మానం చేయాలని సహచర అధికారులు భావించినా, ఆయన సున్నితంగా తిరస్కరించి వెళ్లిపోయారు. ఈ ఫొటోలు తీసిన పోలీసులు.. 'మీరు గ్రేట్ సార్.. సెల్యూట్ సర్' అంటూ ఆయన నిరాడంబరతను కొనియాడారు. వెంకట్రామిరెడ్డి స్వస్థలం కర్నూలు జిల్లా నందికొట్కూరు. ఏరికోరి మంచి పోస్టింగ్స్ తెచ్చుకుని, అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసే పోలీసు అధికారులు ఎక్కువగా కనిపించే ఈ సమాజంలో.. డబ్బు, హోదా, రాజకీయ సావాసమే కాదు కుటుంబం కూడా వద్దంటూ బ్రహ్మచారిగానే జీవించిన ఇలాంటి అత్యుత్తమ విలువలు కలిగిన పోలీసు నిజాయితీ, నిబద్ధతకు ఎవరైనా సెల్యూట్ చేయాల్సిందే!!.

మార్చిలోగా గ్రూప్-1 నియామకాలు

జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు.. సివిల్స్ అభ్యర్థులకు అండగా ఉంటాం

రాష్ట్రం నుంచే అత్యధిక మంది ఎంపిక కావాలి.. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష

సివిల్స్ అభ్యర్థులకు చెక్కుల పంపిణీ.. ఇంటర్వ్యూకి ఎంపికైనవారికి ఢిల్లీలో బస: భట్టి



సివిల్స్ అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందించిన సీఎం రేవంత్. చిత్రంలో భట్టి, తుమ్మల

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పోస్టుల నియామకాలను మార్చి 31లోగా పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 14 ఏళ్లుగా గ్రూప్-1 నిర్వహించలేదని, తాము అడ్డంకులను, కుట్రలను అధిగమించి 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి పరీక్షలను నిర్వహించినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేస్తామని పునరుద్ఘాటించారు. 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద ఆదివారం ఆయన ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఆర్థిక సాయంగా రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేక నిరుద్యోగులు ఎంతగానో నష్టపోయారన్నారు. "ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే.. దేశంలో ఎక్కడా లేని విధంగా 55,143ఉద్యోగ నియామకాలు చేపట్టాం. సివిల్స్‌కి రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపిక కావాలన్న లక్ష్యంతో అభయహస్తాన్ని ప్రారంభించాం. అభ్యర్థులకు ఆర్థికంగా అండగా ఉండేలా.. రూ.లక్ష సాయం అందిస్తున్నాం. రాష్ట్రం నుంచి యూపీఎస్సీ ఇంటర్వ్యూకి వెళ్లే ప్రతి అభ్యర్థి సివిల్స్‌కు ఎంపికవ్వాలని ఆకాంక్షిస్తున్నాను. దేశంలో అత్యధికంగా సివిల్స్ ఎంపిక మన రాష్ట్రం నుంచి జరుగుతుందని గర్వంగా చెప్పుకొనేస్థాయికి తెలంగాణను తీసుకెళ్లాలి" అని అభిలషించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యే అభ్యర్థులకు ఢిల్లీలో వసతి కల్పిస్తామన్నారు. "ఏ రాష్ట్రంలో లేని విధంగా సివిల్స్ వైపు యువత మొగ్గుచూపేలా సింగరేణి సంస్థ తరఫున ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించాం. ప్రతి దశలోనూ సివిల్స్ అభ్యర్థులు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాయం అందిస్తాం" అని వ్యాఖ్యానించారు. కాగా, టీఎస్‌జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్స్, కెమిస్ట్ పోస్టులకు ఎంపికైన 315 మంది అభ్యర్థులకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రపంచంతో పోటీ పడాలి

(మొదటిపేజీ తరువాయి)



తెలుగు సమాఖ్య మహాసభల్లో మాట్లాడుతున్న రేవంత్

పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఏమైనా సమస్యలున్నా.. చర్చించుకుని పరిష్కరించుకుందామని అన్నారు. దేశాల మధ్య యుద్ధాలు తలెత్తినప్పుడు కూడా చర్చల ద్వారా పరిష్కారమైన సందర్భాలున్నాయని, రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించుకోడానికి ఆ విధంగా ఆలోచన చేయలేమా! అని వ్యాఖ్యానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల ముగింపు ఉత్సవానికి సీఎం రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత నార్నే విజయలక్ష్మి సంపాదకత్వంలో వెలువడిన "తెలుగుదనం-తెలుగు ధనం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ సినీనటులు జయప్రద, జయసుధ, మురళీమోహన్, సాయికుమార్, నిర్మాత అశ్వినీదత్ తదితరులను సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దివంగత నేత నందమూరి తారకరామారావు చేతులమీదుగా 30 ఏళ్ల కిందట ప్రారంభమైన ఈ సంస్థ 12వ ద్వైవార్షికోత్సవంలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. "ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి జనాభా 18కోట్ల మంది పైచిలుకు అని ఒక అంచనా. అయినా జాతీయ రాజకీయాలపై తెలుగువాళ్లం ప్రభావం చూపలేకపోతున్నాం"అని రేవంత్ అన్నారు. గతంలో నీలం సంజీవరెడ్డి, పీవీ నర్సింహారావు, ఎన్టీ రామారావు జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారని, ఆ తర్వాత వెంకటస్వామి, జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు ప్రభావం చూపించారని గుర్తు చేశారు. రెండు, మూడు తరాలకు మధ్య.. చంద్రబాబు, వైఎస్ఆర్ ప్రభావం చూపించినా.. ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లిందన్నారు. అయితే ఐటీ, ఫార్మా రంగాల్లో తెలుగువారు ఎందరో అత్యున్నత స్థాయిల్లో రాణిస్తున్నారని తెలిపారు. దేశంలో 35 శాతం ఔషధాలు (బల్క్ డ్రగ్స్) హైదరాబాద్‌లోని తెలుగువారి కంపెనీల నుంచి ఉత్పత్తి అవుతున్నాయని చెప్పడానికి సంతోషిస్తున్నానన్నారు. నాడు ప్రధాని రాజీవ్‌గాంధీ ఈ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేసి, సాంకేతిక రంగంలో దూసుకెళ్లగలిగేందుకు అవసరమైన పునాదులు నిర్మించారని చెప్పారు. దానిని అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం నారా చంద్రబాబు అందిపుచ్చుకుని సైబరాబాద్‌ను ప్రపంచంతోనే పోటీపడే విధంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తర్వాత వైఎస్ దానిని మరింత ముందుకు తీసుకెళ్లారని వెల్లడించారు. "హైదరాబాద్ నగరాన్ని మహమ్మద్ కులీ కుతుబ్‌షా, సికింద్రాబాద్‌ను ఆంగ్లేయులు, నిజాం నవాబులు, సైబరాబాద్‌ను నారా చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్మిస్తే.. అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుకొని 30 వేల ఎకరాల్లో ఫోర్త్ సిటీ పేరుతో ఒక అత్యాధునిక మహానగరాన్ని నిర్మించడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ స్థాయి నగరాలకు దీటుగా దీనిని రూపొందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అని రేవంత్ చెప్పారు.

రాజకీయాల్లోకి వచ్చాకే విలువ తెలిసింది..

చిన్నతనం నుంచి ఉన్నత విద్య వరకు ఆంగ్ల మాధ్యమంలో చదివిన తనకు రాజకీయాల్లోకి వచ్చాకే తెలుగు విలువ తెలిసిందని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించి.. ఇప్పుడు తన మనుమలకు తెలుగు నేర్పిస్తున్నట్లు తెలిపారు. మలేసియా ప్రతినిధుల నృత్య ప్రదర్శన, పద్యాల ఆలాపన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కాగా, వ్యాఖ్యాతగా వ్యవహరించిన నటుడు బాలాదిత్య "తెలంగాణ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్..."అంటూ రేవంత్ సమక్షంలోనే తడబడ్డారు.

హాలీవుడ్‌తో పోటీ పడుతున్న తెలుగు సినిమా

తెలుగు సినిమా రంగం నేడు దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, హాలీవుడ్‌తో సైతం పోటీపడుతున్న సందర్భాలు చూస్తున్నామని సీఎం రేవంత్ ప్రశంసించారు. "రాజకీయాలు, ఆర్థిక, సామాజిక, సినీరంగాలలో రాణించడానికి ఏ భాషనైనా నేర్చుకోండి. కానీ, తోటి తెలుగువారితో మన మాతృభాషలోనే మాట్లాడండి. విదేశాల్లోని తెలుగు వారంతా తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఆలోచన చేయాలి. తెలంగాణ రైజింగ్ నినాదంతో రాబోయే 25 ఏళ్లకు తగిన ఒక అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నాం. దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న తెలుగువారంతా తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కండి. పెట్టుబడులు పెట్టండి. అందుకు అవసరమైన అనుమతులన్నింటినీ సింగిల్ విండోలో ఇచ్చే బాధ్యత నాది" అని రేవంత్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలను వీలైనంత వరకు తెలుగులో వెలువరించేందుకు ప్రయత్నిస్తామని ప్రకటించారు. అంతకుముందు ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రధాన కార్యదర్శి నార్నే విజయలక్ష్మి మాట్లాడుతూ... ఈ కాలానికి తగినట్టుగా పెద్ద బాలశిక్షను సవరించి, ప్రాథమిక స్థాయి విద్యాబోధనలో భాగం చేయాలని సీఎంను కోరగా.. తప్పకుండా విద్యా కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని రేవంత్ తెలిపారు. ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు నిర్వహించిన ఇందిరాదత్‌ను ప్రశంసించారు.



దేశ రాజకీయాల్లో నన్ను వెలిగించింది తెలుగే!

» తెలుగు సమాఖ్య మహాసభల్లో వెంకయ్య

హైదరాబాద్ సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అలంకారాల్లో ఒదిగిపోయే విలక్షణమైన భాష తెలుగు. వేల మాటల్లో చెప్పగలిగే భావాన్ని సైతం ఒక్క మాటలో భావయుక్తంగా చెప్పే వెసులుబాటు మన భాష సొంతం' అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగులో ఆలోచించడం వల్లే ఇతర భాషల్లోనూ అంతే సాధికారతతో ప్రజలను ఆకట్టుకునేలా మాట్లాడగలమని, తనను దేశ రాజకీయాల్లో వెలిగించింది తెలుగేనని భావోద్వేగంతో చెప్పారు. ఆదివారం హైటెక్స్ నోవొటెల్‌లోని ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల మూడో రోజు ఉదయం సదస్సుకు వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంగ్లిషు నేర్చుకుందాం కానీ దానిపై వ్యామోహాన్ని వీడుదామని పిలుపునిచ్చారు. 'మాతృభాష రాకపోతే శ్వాస ఆగిపోయినట్లే. మాతృభాష మరిస్తే మాతృబంధం వీడినట్లే. కనుక తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలకు మాతృభాష మాధుర్యాన్ని గోరుముద్దల్లా అందించాలని కోరారు. రష్యా, ఫ్రాన్స్ దేశాల అధ్యక్షులు మన దేశం వచ్చినప్పుడు, వారి మాతృభాషల్లోనే ప్రధానితో సంభాషిస్తారని తెలిపారు. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు తెలుగును పరిపాలనా భాషగా అమలు చేయాలని, మాతృభాషలో ప్రాథమిక విద్యా బోధన జరిగేలా చూడాలని సూచించారు. మహాసభల్లో భాగంగా జానపద కళా ప్రదర్శనలు, నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. సంక్రాంతి వేడుకలపై నృత్య రూపకం అమితంగా ఆకట్టుకుంది.

లక్ష మంది కూర్చునే స్టేడియం

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. అక్కడ క్రీడల కోసం తీసుకుంటున్న చర్యలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సదుపాయాలు, శిక్షణ తీరును పరిశీలించనున్నారు. ఆయన వెంట శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, సీఎం సలహాదారు జితేందర్‌రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు ఉంటారు. వీరంతా క్వీన్స్‌లాండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీ, పలు మైదానాలను పరిశీలించనున్నారు. యూనివర్శిటీలో అందిస్తున్న కోర్సులు, శిక్షణలతోపాటు, గ్రౌండ్ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై అధ్యయనం చేయనున్నారు. సింగపూర్‌లో పలు అంశాలపై అధ్యయనం కొనసాగనుంది. ముఖ్యంగా.. చిన్న దేశమైనా.. ఎక్కువ మైదానాలుండడం.. ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో మెడల్స్‌ను సాధించడం వంటి వాటిపై దృష్టిసారిస్తారు. అక్కడ క్రీడా మైదానాల కిందే పార్కింగ్ సదుపాయాలుంటాయి. దీనిపై సీఎం ప్రత్యేకంగా ఆరాతీస్తారని సమాచారం. హైదరాబాద్‌లో ఐపీఎల్ జరిగితే.. ట్రాఫిక్ ఇబ్బందులు తెలిసిందే.! సింగపూర్‌లో అలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకుంటున్న చర్యలనూ పరిశీలిస్తారు. సింగపూర్‌లో పలు మాల్స్‌పైనా క్రీడా కేంద్రాలున్నాయి. వాటి నిర్మాణ తీరుతోపాటు.. ఒలింపిక్స్‌లో అత్యధిక మెడల్స్ రావడానికి క్రీడాకారులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీయనున్నారు. 20-24 తేదీల్లో సీఎం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్)లో పాల్గొంటారు.

అవమానాలను పట్టించుకోలేదు

మన కష్టమే మనను నంబర్ వన్ చేస్తుంది.. 'ఆప్తా' సదస్సులో మెగాస్టార్ చిరంజీవి



ఆప్తా సదస్సులో మాట్లాడుతున్న చిరంజీవి

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కెరీర్ తొలినాళ్లలో తనకు ఎన్ని అవమానాలు ఎదురైనా పట్టించుకోలేదని, వాటిని అనుకూలంగా మలుచుకున్నానని మెగాస్టార్ చిరంజీవి తెలిపారు. 'విజయం సాధించాలనుకుంటే నెగెటివిటీ అసలు ఉండకూడదు. మీ పాజిటివ్ ఆలోచనా తీరే మీ బలం కావాల'ని యువ వ్యాపారవేత్తలకు సూచించారు. ఆదివారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) అంతర్జాతీయ వ్యాపార సదస్సు ముగింపు కార్యక్రమంలో చిరంజీవి మాట్లాడారు. చెన్నై పాండీ బజార్‌లో తనకు ఎదురైన అనుభవాల గురించి చెబుతూ అక్కడ కుంగిపోయేలా మాట్లాడేవారని, నమ్మకం సడలిపోయేదన్నారు. తాను నమ్ముకున్న ఆంజనేయ స్వామితోనే సంభాషించేవాడినని, ఆయన తనకు సలహాలు ఇస్తున్నారని అనిపించేదన్నారు. లక్ష్య సాధనకు కష్టాన్ని నమ్ముకుని ముందుకెళితే అదే మనను నంబర్ వన్ స్థానంలో నిలబెడుతుందన్నారు. 'మీ అభిరుచిని గుర్తించండి. లక్ష్యం ఎంచుకోండి. అవకాశాలు ఎన్నో ఉంటాయి. కానీ, మీకు అనుకూలమైనది ఏదో గుర్తించాలి. డబ్బు ముఖ్యం కాదు. నిలదొక్కుకోవడమే ముఖ్యం. తరువాత డబ్బే మన వద్దకు వస్తుంది. ఇగో, హర్ట్ కావడం వంటివి వదిలేయండ'ని యువ పారిశ్రామికవేత్తలకు సూచించారు. కొంత రిస్క్ తీసుకోండి... మార్కెట్ అవసరాలను తెలుసుకుని ముందుకు సాగండి అని చెప్పారు. జీవితంలో తాను సంపాదించుకున్నది పవన్ కళ్యాణ్, రామ్‌చరణ్ అని చెప్పి అభిమానులను ఉత్సాహపరిచారు. పవన్ కళ్యాణ్ ఇటీవల తన దగ్గరకొచ్చి 'అన్నయ్యా మీరు నిష్కల్మష మనసుతో మాట్లాడతారు. మీరు ఒకప్పుడు మన కుటుంబం కూడా కపూర్ ఫ్యామిలీలా సినీ పరిశ్రమలో ఉండాలని చెప్పారు. ఇప్పుడు మన కుటుంబంలో అందరూ ఈ రంగంలోనే ఉన్నామ'ని చెబితే చాలా సంతోషంగా అనిపించింద'న్నారు. తమ మెగా కుటుంబంలో 9-10 మంది సినీ రంగంలోనే ఉన్నారంటూ ఇటీవల ఓ పత్రిక 'కపూర్ ఫ్యామిలీ ఆఫ్ సౌత్ సినిమా' అని కీర్తించిందన్నారు. భగవంతుని ఆశీర్వాదం, ప్రేక్షకుల ఆదరణ వల్లే ఇది సాధ్యమైందన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా సహా 10 దేశాల నుంచి 1,000 మంది తెలుగు ఎన్ఆర్ఐలతో పాటు, రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి వచ్చినవారితో వేదిక కళకళలాడింది.

చిన్నబుచ్చుకున్న ఏపీ మంత్రి దుర్గేష్

ఆప్తా సదస్సులో పర్యాటక అంశంపై కీలకోపన్యాసం చేయడానికి వచ్చిన ఏపీ మంత్రి దుర్గేష్.. ఏపీ ప్రభుత్వ విధానాలను వివరిస్తుండగా... నిర్వాహక బృందం ఆయన దగ్గరకొచ్చి త్వరగా ముగించాలని కోరారు. దీంతో చిన్నబుచ్చుకున్న ఆయన ముందుగా చెప్పకపోవడంతో సమయం తీసుకున్నానని, అందుకు క్షంతవ్యుడనంటూ వేదిక దిగిపోయారు. నిర్వాహకులు సర్ది చెప్పడానికి ప్రయత్నించినా ప్రాంగణం నుంచి వడివడిగా వెళ్లిపోయారు.

ఆలయాల రక్షణే మన దీక్ష

పార్టీలు, ప్రభుత్వాల కబంధ హస్తాల నుంచి విముక్తి కల్పించాలి.. 'హైందవ శంఖారావం' తీర్మానం



శంఖారావం బహిరంగ సభకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మానికి మూలస్తంభమైన దేవాలయాలను రక్షించుకోవడమే హిందువులకు దీక్ష కావాలని 'హైందవ శంఖారావం' సభ పిలుపిచ్చింది. దేవాలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని.. ఆలయాలకు రక్షణ కల్పించాలని.. వాటిలో అన్యమత ఉద్యోగులను తక్షణమే తొలగించాలని తీర్మానించింది. సనాతన ధర్మ పరిరక్షణ, పూర్వ వైభవ పునరుద్ధరణ పేరుతో ఆదివారం విజయవాడ సమీపంలోని కేసరపల్లి వద్ద విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) భారీ బహిరంగ సభ నిర్వహించింది. రాష్ట్రం నలుమూలల నుంచీ భారీ సంఖ్యలో హిందువులు తరలివచ్చారు. విదేశీయుల పాలనలోనూ ఆలయాలను రక్షించుకున్నామని, కానీ స్వాతంత్ర్యానంతరం మాత్రం వాటిని కాపాడలేకపోతున్నామని స్వామీజీలు, సాధుసంతులు వాపోయారు. వాటి రక్షణకు హిందూ సమాజం నడుం బిగించి దీక్షపూనాలని పిలుపిచ్చారు. ఆలయాలను కాపాడాలని సభికులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు సభలో వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ ప్రసంగించారు. హిందూ దేవాలయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెత్తనం ఉండకూడదన్నారు. వాటిని ఆయా ప్రభుత్వాలే స్వచ్ఛందంగా హిందువులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. 'దేశంలోని అన్ని హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి. ఒకప్పుడు ఆలయాల సంరక్షణ పూర్తిగా హిందువులే చూసుకునేవారు. దేవాలయాల్లో పూజా కైంకర్యాలు, ఆగమ శాస్త్రాల ప్రకారం నిర్వహణ చేపట్టే బాధ్యత వీహెచ్‌పీ తీసుకుంటుందా.. బ్రాహ్మణులు తీసుకుంటారా.. అని కొందరు అడుగుతున్నారు.. హిందూ సమాజం ఒక నెట్‌వర్క్‌గా ఏర్పడి దేవాలయాల సంరక్షణ తీసుకోవాలి' అని ఆయన సూచించారు. 'హిందువులకు అతిపెద్ద ఆలయమైన తిరుమలలో అందరూ బ్రాహ్మణులే ఉన్నారా.. కంచి పీఠంలో బ్రాహ్మణేతర హిందువులు లేరా..' అని నిలదీశారు.వీహెచ్‌పీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి విలింద్ పరాండే మాట్లాడుతూ.. మన సమాజంలో శక్తిమంతమైన ఆలయాలను విదేశీయులు స్వాతంత్ర్యానికి పూర్వం చేతుల్లోకి తీసుకుంటే, ఆ తర్వాత దురదృష్టవశాత్తూ ప్రభుత్వాలు పెత్తనం చేస్తున్నాయన్నారు. 'ప్రపంచం సుఖసంతోషాలతో ఉండాలంటే విశ్వకల్యాణం కోసం కృషి చేసే భారతదేశం సురక్షితంగా ఉండాలి.. అందుకు హిందూ ధర్మం మరింత భద్రంగా ఉండాలి.' అని అయోధ్య రామాలయ కోశాధికారి గోవిందదేవ్ గిరిజీ మహరాజ్ అన్నారు. హిందూ దేవాలయాల విముక్తి పోరాటానికి విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం మొదటి అడుగుగా వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజుఅభివర్ణించారు.

ట్రస్టు బోర్డులు వీఐపీల సేవలకా?: చినజీయర్

ఆలయాల్లో ట్రస్టు బోర్డు పాలక వర్గాలు దేవుడి సేవలను వీఐపీలకు దగ్గర చేస్తూ, పేదలకు దూరం చేస్తున్నాయని చినజీయర్ స్వామి అన్నారు. వీఐపీ దర్శనాల పేరిట పేదలను దేవుడికి దూరం పెడితే.. వారు ఇతర మతాల్లోకి ఎందుకుపోరని ప్రశ్నించారు. డబ్బులు వస్తాయన్న ఉద్దేశంతో అయినా అన్యమతాల్లోకి వెళ్తారని చెప్పారు. దేవాలయాలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. కమలానంద భారతి మాట్లాడుతూ దేవదాయ శాఖనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

గురుకుల విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యం

- ఆర్థిక ఇబ్బందులున్నా కాస్మెటిక్ చార్జీలు పెంచాం: భట్టి

బీబీనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యమని, అందుకే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కాస్మెటిక్ చార్జీలు పెంచామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎస్సీ, బీసీ గురుకుల బాలికల పాఠశాలలను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వసతి గృహాల్లోని వంట గదుల్లోకి వెళ్లి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించి డైనింగ్ హాల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వసతి గృహాల్లో శుభ్రత, భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంచిన చార్జీల మేరకు హాస్టల్‌లో మెనూ అందిస్తున్నారా? లేదా? అనే విషయాలను తెలుసుకునేందుకు నెలలో ఒక్కసారి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు క్యాబినెట్ మంత్రులు గురుకులాలను సందర్శించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగానే తాను బీబీనగర్‌లోని గురుకుల పాఠశాలలను సందర్శించినట్లు చెప్పారు.

జనగామలో భట్టి కాన్వాయ్‌కి స్వల్ప ప్రమాదం

జనగామ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాన్వాయ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం డిప్యూటీ సీఎం హైదరాబాద్ నుంచి వరంగల్ జిల్లా మొగిలిచెర్ల పర్యటనకు బయల్దేరారు. ఈ క్రమంలో జనగామ జిల్లా పెంబర్తి స్వాగత తోరణం వద్దకు ఆయన కాన్వాయ్ చేరుకోగానే ఎస్కార్ట్‌గా ఉన్న జనగామ ఎస్సై చెన్నకేశవులు వాహనం అదుపుతప్పి రోడ్డు కింద చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లోని ఓ వాహనాన్ని తప్పించబోయే క్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎస్సై చెన్నకేశవులు, డ్రైవర్ సాగర్‌కు స్వల్ప గాయాలు కాగా వాహనం స్వల్పంగా దెబ్బతింది.

సైబర్ మోసానికి యువకుడి బలి

- గృహ రుణం పేరిట 52 వేలు కాజేసిన సైబర్ మాయగాళ్లు
- మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య

లింగంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధితుడి కుటుంబం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం ఐలాపూర్‌కు చెందిన కమ్మరి గంగరాజు(28)కు జనవరి 2న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. బెంగళూరుకు చెందిన సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నానని, రూ.10 లక్షలు గృహ రుణం క్షణాల్లో ఇప్పిస్తానని నమ్మబలికాడు. అయితే, రుణ ముంజూరుకు డిపాజిట్‌గా కొంత సొమ్ము చెల్లించాలని చెప్పాడు. ఆ మాటలు నమ్మిన గంగరాజు ఆ వ్యక్తి చెప్పిన బ్యాంకు ఖాతాలో అదే రోజున విడతలవారీగా రూ.52,500 జమ చేశాడు. తనకిస్తానన్న రుణం ఎంతసేపటికీ బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో గంగరాజు తిరిగి ఆ వ్యక్తికి ఫోన్ చేసి అడగ్గా.. 'నాకే సంబంధం లేదు' అనే బదులు వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన గంగరాజు తనకు జరిగిన మోసాన్ని వాట్సాప్ ద్వారా కుటుంబసభ్యులకు తెలియజేసి జనవరి 3న అర్ధరాత్రి తర్వాత ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శనివారం సాయంత్రం దాకా వేచి చూసిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఐలాపూర్ ఊర చెరువు తూము వద్ద గంగరాజు చెప్పులు కనిపించాయని కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చెరువులో గాలింపు చేపట్టగా గంగరాజు మృతదేహం లభ్యమైంది.

అనుమానాస్పద స్థితిలో కానిస్టేబుల్ మృతి


భానుశంకర్ (ఫైల్)

పరిగి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొద్ది నెలలుగా రాష్ట్రంలో పోలీసు శాఖలో ఉద్యోగుల ఆత్మహత్య ఘటనలు చర్చనీయాంశంగా మారాయి. కొద్దిరోజుల క్రితం ఇద్దరు ఎస్సైలు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. శాఖలో వరుస సంఘటనలు సంచలనం సృష్టిస్తుండగా.. తాజాగా ఓ కానిస్టేబుల్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా దోమ మండలం దొంగఎన్కెపల్లికి చెందిన భానుశంకర్ కులకచర్ల పీఎస్‌లో పోస్టింగ్ ఉండగా, పరిగి పీఎస్‌కు అటాచ్‌తో విధులు నిర్వహిస్తున్నాడు. కానిస్టేబుల్ కొంతకాలం నుంచి అతిగా మద్యం సేవించడంతోపాటు భార్యతో తరచూ గొడవలు పడుతుండేవాడని సన్నిహితుల ద్వారా తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం భానుశంకర్ హైదరాబాద్ అంబర్‌పేట్‌లో గల తన నివాసంలో మృతి చెందాడు. ఆయన మృతికి కారణాలు తెలియరాలేదు. ఫిట్స్ వచ్చి మృతి చెందాడా? లేదా కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో అంబర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేనెంత సున్నితమో.. అంత కఠినం కూడా..: సీతక్క

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు, మానవత్వాన్ని జోడించి పనిచేస్తే ఫలితాలు వస్తాయని, ఎవరైనా తమ బాధ్యతలు విస్మరిస్తే.. సహించేదిలేదని మంత్రి ధనసరి అనసూయ సీతక్క హెచ్చరించారు. క్షేత్రస్థాయి తప్పులను సరిదిద్దుకొని విధుల్లో వేగం పెంచాలన్న మంత్రి తాను.. ఎంత సున్నితమో.. అంత కఠినంగానూ ఉంటానన్నారు. ఆదివారం మిషన్ భగీరథ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా ప్రత్యేకచర్యలు చేపట్టాలని, స్థానిక పరిస్థితులనుబట్టి ప్రణాళికల రూపొందించుకోవాలని సూచించారు.

అధ్యాపకుల ఒత్తిడి తట్టుకోలేక విదార్థి ఆత్మహత్య


రామ్‌పవార్ (ఫైల్)

చుంచుపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో 464 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థి రెండో ఏడాదిలో మరిన్ని మార్కుల కోసం అధ్యాపకులు పెడుతున్న ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భద్రాద్రి జిల్లా చుంచుపల్లిలో ఆదివారం ఈ ఘటన జరిగింది. చుంచుపల్లి మండలం నందాతండాకు చెందిన శనగ రామ్‌పవార్ (18) అనే విద్యార్థి లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మొదటి ఏడాదిలో 464 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిన అతడు ఇటీవల కళాశాలలో నిర్వహించిన వారాంతపు పరీక్షల్లో తక్కువ మార్కులు సాధించాడు. దాంతో అధ్యాపకులు అతడిని మందలించి, తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. ఇలా మరోసారి జరిగితే ప్రతిభావంతుల సెక్షన్ నుంచి తీసేసి వేరే సెక్షన్‌లో వేస్తామని హెచ్చరించారు. దాంతో తీవ్ర ఒత్తిడికి లోనైన రామ్‌పవార్ పది రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి చదువుకుంటున్నాడు. అయితే అధ్యాపకులు కళాశాలకు రావాలని విద్యార్థికి, అతడి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. లేనిపక్షంలో వార్షిక పరీక్షలకు హాల్‌టికెట్ ఇవ్వబోమని భయపెట్టారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థి రామ్‌పవార్ ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లిదండ్రులు ఆరోపించారు.


నల్లగొండ జిల్లా కేంద్రంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి


ఖైరతాబాద్‌లో ముగ్గుల పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

నేలపై హరివిల్లులు

సంక్రాంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ముగ్గుల పోటీలు

- తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల్లో పోటీల్లో పాల్గొన్న 12వేల మందికిపైగా మహిళలు
- జిల్లాలవారీ విజేతలకు 10న హైదరాబాద్‌లో ఫైనల్స్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ముత్యాల ముగ్గులతో పుడమి పులకించింది. రంగురంగుల రంగవల్లులతో సంక్రాంతి శోభ ముందే వచ్చేసింది! "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటకల్లోని 81 కేంద్రాల్లో జనవరి 3, 4, 5 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ రంగవల్లులతో సంక్రాంతి శోభను ఇనుమడింపజేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి రూ.6,000, ద్వితీయ బహుమతి రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తోపాటు అనేక కన్సొలేషన్ బహుమతుల్ని మహిళలు గెల్చుకున్నారు. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి ఎంపికైన పదిమంది మహిళలకు ఈ నెల 10న హైదరాబాద్‌లో ఫైనల్ పోటీలు జరుగుతాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని 13 పాత జిల్లాలు, తమిళనాడు, కర్ణాటకల నుంచి ఒక్కొక్కరు... మొత్తం 15 మందికి ఈ నెల 11న విజయవాడలో ఫైనల్స్ జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.1,70,000కు పైగా బహుమతులు, ఇంకా గిఫ్ట్ హ్యాంపర్లు లభిస్తాయి. కాగా.. ఈ పోటీలకు ఆయా జిల్లాల్లో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నల్లగొండలో జరిగిన పోటీలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా.. మల్కాజిగిరిలో ఎంపీ ఈటల రాజేందర్, హనుమకొండలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తాండూర్‌లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, బోధన్‌లో ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, జగిత్యాలలో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.



రైతు భరోసా.. బోగస్

- స్థానిక ఎన్నికల తర్వాత ఇదీ ఇవ్వరు
- రాష్ట్రంలో 14 % కమీషన్ ప్రభుత్వం
- ఇద్దరు, ముగ్గురు మంత్రులకైతే అదే పని
- సమస్యలు పట్టని కేసీఆర్‌కు పదవెందుకు?
- హరీశ్ లేదా మరొకరికి విపక్ష నేత పదవి ఎందుకు ఇవ్వరు?: కేంద్ర మంత్రి సంజయ్



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల పేరిట మరో సారి మోసగించేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆరే గురువు అని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే కాంగ్రెస్ సర్కారులో కొనసాగుతున్నరని, గత పదేళ్లలో బీఆర్ఎస్ ఎలా మోసం చేసిందో... ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే చేస్తోందని దుయ్యబట్టారు. టీజీఐఐసీ భూములు తనఖా పెట్టి రూ.10వేల కోట్లు అప్పు తెచ్చారని, ఆ నిధులనే ప్రస్తుతం రైతు భరోసాకు వినియోగిస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు రూ.15వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రూ.12వేలు అంటున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అది కూడా ఇవ్వరని జోస్యం చెప్పారు. రైతు భరోసాను బోగస్‌గా మార్చిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెలా రూ.10వేల కోట్లు అప్పు తెస్తోందని, రాష్ట్రాన్ని మరో శ్రీలంకను చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 14శాతం కమీషన్ సర్కార్ నడుస్తోందని, ఇద్దరు-ముగ్గురు మంత్రులకైతే అదే పనిగా మారిందని ధ్వజమెత్తారు. ఏడాది వ్యవధిలో ఏ గ్రామ పంచాయతీకి ఏ పథకం కింద ఎన్ని నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని, కాంగ్రెస్‌కు దమ్ముంటే ఇదే అంశం అజెండాగా పంచాయతీ ఎన్నికలకు వెళ్దామని సవాల్ విసిరారు. కేసీఆర్ అంటేనే విశ్వాసఘాతకుడని సంజయ్ మండిపడ్డారు. ఫాంహౌజ్‌లో ఉండేవారికి, ప్రజల సమస్యలు పట్టించుకోనివారికి విపక్షనేత హోదా ఎందుకు? ఆ పదవి హరీశ్‌కో, బీసీ నేతలైన గంగుల, తలసానికో లేదా మరో నేతకో ఎందుకు ఇవ్వరు? అని నిలదీశారు.

జైపాల్‌రెడ్డి పేరును వ్యతిరేకిస్తున్నాం

రైతు భరోసా కింద 12వేలే ఇస్తామని ప్రకటించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు అరుణ ప్రకటించారు. ఆ ప్రాజెక్టులో జైపాల్‌రెడ్డి పాత్ర ఏముందని ఆయన పేరు పెడుతున్నారని నిలదీశారు. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం తన తండ్రి చిట్టెం నర్సిరెడ్డి పోరాటాలు చేశారని తెలిపారు. కాగా, రాష్ట్రంలో కోతల ప్రభుత్వం నడుస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

బరి తెగింపు
భవనం కూల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ నిర్మాణంగా తేల్చగా.. ఆదివారం హైడ్రా యంత్రాంగం దీనిని కూల్చివేసే పని మొదలుపెట్టింది. ప్రధాన రోడ్డుకు అనుకొని ఉన్న స్థలంలో జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ భవన నిర్మాణంపై 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'బరి తెగింపు' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా, వంద అడుగుల రోడ్డును ఆక్రమించి 684 గజాల స్థలంలో రెండు సెల్లార్‌లతో కలిపి ఏడు అంతస్తులుగా ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఐదు అంతస్తులను వంద ఓయో రూమ్‌లుగా నిర్మాణం చేపట్టారు. అయితే జీహెచ్‌ఎంసీ జారీ చేసిన నోటీసులను, హైకోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా చేపట్టిన ఈ భవనం నిర్మాణంపై స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఎలాంటి సెట్‌బ్యాక్‌లు వదలకుండా, తగిన పార్కింగ్ సౌకర్యం, ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోకుండా సెల్లార్‌లోనే కిచెన్ ఉండేలా నిర్మాణం జరుపుతున్నట్లు హైడ్రా అధికారులు తమ పరిశీలనలో గుర్తించారు. ఈ మేరకు భవనం కూల్చివేత చేపట్టారు. ఆదివారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికార యంత్రాలను రప్పించి కూల్చివేత పనులు మొదలుపెట్టారు. మధ్యాహ్నం సమయంలో బాహుబలి క్రేన్‌ను తెప్పించి.. భవనం వెనక వైపు నుంచి గోడలను కూల్చివేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మెయిన్ రోడ్డు పక్కనే భవనం ఉండడంతో విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా భవనం చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.


మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

నేడు కూడా కొనసాగనున్న కూల్చివేతలు..

ఆదివారం హైడ్రా కూల్చివేతలు భవనం వెనక భాగంలోనే జరిగాయి. వెనక నుంచి భారీ క్రేన్‌లతో మొదట కట్టిన గోడలను కూల్చివేశారు. బాహుబలి క్రేన్ ఆలస్యంగా రావడంతో కూల్చివేతలు వేగంగా చేపట్టలేకపోయారు. భవనం వంద అడుగుల రోడ్డును ఆక్రమించి ఉండడం, దాని పక్కన అండర్ పాస్ రోడ్డు ఉండడంతో ఒక వైపు నుంచే రెండు క్రేన్‌లతో కూల్చివేత పనులు చేపట్టాల్సి వచ్చింది. భవనాన్ని పూర్తి స్థాయిలో కూల్చివేయాలంటే సోమవారం సైతం ఎత్తయిన క్రేన్‌లను వినియోగించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. వాస్తవానికి ఈ భవన నిర్మాణం అక్రమమని, దీనిని కూల్చివేస్తున్నామని తెలుపుతూ జీహెచ్‌ఎంసీ అధికారులు 2024 ఫిబ్రవరి 14నే నోటీసులు జారీ చేసింది. అనంతరం ఫిబ్రవరి 26న స్పీకింగ్ ఆర్డర్ సైతం ఇచ్చింది. మరోవైపు హైకోర్టు కూడా రిట్ పిటిషన్ నంబరు 10030/2024పై స్పందిస్తూ అక్రమ నిర్మాణమని నిర్ధారించింది. దీని కూల్చివేతకు సంబంధించి చర్యలు తీసుకోవాలని అదే ఏడాది ఏప్రిల్ 19న ఆదేశించింది. ఈ ఆదేశాలతో జూన్ 13న భవనం కొంత భాగాన్ని కూల్చివేశారు. అయినా నిర్మాణదారు ఇవేవీ పట్టించుకోకుండా భవన నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనే భవనం కూల్చివేత పనులు మొదలుపెట్టారు. అయితే కూల్చివేత సమయంలో.. భవన నిర్మాణంలో పనిచేస్తున్న కొందరు కార్మికులు.. తమ సామాన్లు లోపలే ఉండిపోయాయని, వాటిని తీసుకుంటామని చెప్పినా హైడ్రా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. దీనికితోడు తాము పనిచేస్తున్నందుకు ఈ నెలకు సంబంధించిన జీతం ఇప్పటివరకు యజమాని ఇవ్వలేదని చెప్పారు.

జీహెచ్‌ఎంసీని హైకోర్టు ఆదేశించింది: హైడ్రా కమిషనర్ రంగనాథ్

అయ్యప్ప సొసైటీ వంద అడుగుల రోడ్డును ఆనుకొని నిర్మించిన అక్రమ భవనాన్ని కూల్చివేయాలని జీహెచ్‌ఎంసీని హైకోర్టు ఆదేశించింది. దీంతో స్లాబ్‌పై కొన్ని రంధ్రాలు చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు జీహెచ్‌ఎంసీ చేసిన రంధ్రాలను మూసివేసి మరో రెండు అంతస్తుల అదనపు నిర్మాణం చేపట్టారు. దీనిపై హైకోర్టులో ధిక్కార పిటిషన్ సైతం దాఖలై విచారణ కొనసాగుతోంది. అయ్యప్ప సొసైటీలో దాదాపు చాలా నిర్మాణాలు చట్టవిరుద్ధంగానే ఉన్నాయి. ఇలాంటి నిర్మాణాలను కూల్చివేయాలంటే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది. దానికి అనుగుణంగానే హైడ్రా కూల్చివేతలు చేపడుతుంది. అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు జీహెచ్‌ఎంసీతో సమన్వయం చేసుకుంటాం. కూల్చివేసిన భవన అక్రమ నిర్మాణానికి బాధ్యులైన అధికారులపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తాం.

శ్రీతేజ్‌కు పరామర్శపై పునరాలోచించండి

హీరో అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసు

- పేషెంట్లకు ఇబ్బంది అని వెల్లడి
- వెళ్లాలనుకుంటే ఆస్పత్రివర్గాలతో, తమతో సమన్వయం చేసుకోవాలని సూచన
- జరగరానిది జరిగితే బాధ్యత వహించాలని హెచ్చరిక
- చిక్కడపల్లి పీఎస్‌లో అర్జున్ సంతకం


చిక్కడపల్లి పీఎస్ వద్ద అల్లు అర్జున్

రాంగోపాల్‌పేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడ్డ శ్రీతేజ్‌ను పరామర్శించే విషయమై పునరాలోచించాలని హీరో అల్లు అర్జున్‌కు రాంగోపాల్‌పేట్ పోలీసులు నోటీసిచ్చారు. ఆయన రాకతో ఆస్పత్రి కార్యకలాపాలకు, ఇతర రోగులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని అందులో పేర్కొన్నారు. అయినా ఆస్పత్రికి వెళ్లాలని భావిస్తే.. ఆస్పత్రి వర్గాలతో, తమతో సమన్వయం చేసుకోవాలని.. తమ సూచనలను పాటించాలని సూచించారు. ఏదైనా జరగరానిది జరిగితే అందుకు అల్లు అర్జునే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శ్రీతేజ్ ప్రస్తుతం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. అతణ్ని పరామర్శించడానికి అర్జున్ వెళ్లాలనుకుంటున్నట్టు సమాచారం అందడంతో.. రాంగోపాల్‌పేట్ పీఎస్ ఎస్సై నర్సింగరావు నేతృత్వంలోని పోలీసులు జూబ్లీహిల్స్‌లోని అర్జున్ నివాసానికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేక పోవడంతో మేనేజర్‌కు నోటీసు అందజేశారు. ఇక.. ఈ కేసులో కోర్టు ఆదేశాల మేరకు అల్లు అర్జున్ ఆదివారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేశారు. అర్జున్‌కు షరతులతో కూడినసాధారణ బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం.. ఎనిమిదివారాల పాటు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చిక్కడపల్లి పీఎస్‌కు వెళ్లి సంతకం చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఠాణాకు చేరుకున్న బన్నీ సంతకం చేసి 10.45 గంటలకు తిరిగి వెళ్లిపోయారు. అల్లు అర్జున్ రాక సందర్భంగా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే భక్తులనూ అనుమతించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అభిమానులు యూట్యూబ్ చానళ్ల పాత్రికేయుల పేరు తో మీడియా రిపోర్టర్లలో కలిసిపోయారు. అల్లు అర్జున్ వెళ్లిపోయేటప్పుడు.. 'జై బన్నీ..' అంటూ నినాదాలు చేశారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.